www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 11-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 12
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం, తిథి: తదియ మ. 3.04 తదుపరి చవితి, నక్షత్రం: కృత్తిక రా. 1.38 తదుపరి రోహిణి, వర్జ్యం: మ.2.21-3.51, దుర్ముహూర్తం: ఉ.10.12-11.02, మ.3.09-3.58, అమృతఘడియలు: రా.11.22-12.52, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.05, సూర్యాస్తమయం: 6.26
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జూన్‌లో స్థానిక ఎన్నికలు

లోక్‌సభ ఎన్నికల్లో పనితీరు ఆధారంగా అవకాశాలు

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్.. ముఖ్యనేతలతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నివాసంలో సమావేశం

మేలో నల్లగొండ, చౌటుప్పల్‌లో ప్రియాంక రోడ్‌షోలు

21న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్

నేడు ఢిల్లీకి రేవంత్‌రెడ్డి.. ఓ టీవీ షోలో పాల్గొనేందుకే!

13



తన ఇంటికి వచ్చిన సీఎం రేవంత్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

కిడ్నాప్ టాస్క్.. షేర్ల బదిలీకి ఫోర్స్



వెలుగులోకి రాధాకిషన్ అండ్ కో దందా

హెల్త్‌కేర్ సంస్థ యజమాని అపహరణ.. టాస్క్‌ఫోర్స్ ఆఫీసులో నిర్బంధం

స్వయంగా డీజీపీ ఫోన్ చేసినా.. తప్పుదోవ పట్టించిన పోలీసులు

బెదిరించి, షేర్లు బదిలీ చేయించిన వైనం

2018 నవంబరులో ఘటన

మీడియాకు చెబితే చంపేస్తామని బెదిరింపులు

ఫోన్ ట్యాపింగ్ అరెస్టులతో ధైర్యం తెచ్చుకున్న బాధితుడు.. జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు

రాధాకిషన్, గట్టుమల్లు, ఎస్సై మల్లికార్జున్ షేర్లు బదిలీ చేయించుకున్న దుండగులపై కేసు

ట్యాపింగ్‌పై ఈడీకి హైకోర్టు లాయర్ ఫిర్యాదు

ముగిసిన రాధాకిషన్‌రావు పోలీసు కస్టడీ

బంజారాహిల్స్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌ట్యాపింగ్ కేసులో అరెస్టయిన టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్ రావు అండ్ కో.. కిరాయి గూండాల్లా కిడ్నాప్‌లు, వసూళ్లు చేయించిన ఘటనలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. విదేశాల్లో ఎంబీఏ పూర్తిచేసి, హైదరాబాద్‌లో ఓ కంపెనీని స్థాపించి.. ఒక్కోమెట్టు పైకెదుగుతున్న వ్యాపారిని అథఃపాతాళానికి తొక్కేశారు. అతణ్ని కిడ్నాప్ చేసి.. కంపెనీ షేర్లన్నింటినీ బదలాయించి వదిలిపెట్టారు. ఈ వ్యవహారంలో ఏకంగా డీజీపీనే తప్పుదోవపట్టించారు. విషయాన్ని మీడియాకు చెబితే.. చంపేస్తామని బాధితుణ్ని బెదిరించారు. రాధాకిషన్ అరెస్టుతో ధైర్యం తెచ్చుకున్న బాధితుడు బుధవారం జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల కథనం ప్రకారం.. మణికొండకు చెందిన చెన్నుపాటి వేణుమాధవ్ విదేశాల్లో ఎంబీఏ పూర్తిచేసి.. 2011లో జూబ్లీహిల్స్ రోడ్‌నంబరు 72లో 'క్రియా హెల్త్‌కేర్' కంపెనీని నెలకొల్పారు. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రంలోని ఆరోగ్య కేంద్రాలు, అంబులెన్స్ సర్వీసుల నిర్వహణ బాధ్యతను ఈ కంపెనీ నిర్వహించేది. ఇంతింతై.. వటుడింతై.. అన్నట్లు కంపెనీ 250 కోట్ల టర్నోవర్‌కు చేరడంతో, వ్యాపారాన్ని మరింతగా విస్తరించేందుకు గోపాల్, రాజ్, నవీన్, రవి అనే వ్యక్తులను భాగస్వాములుగా చేర్చుకున్నారు. బాలాజీ అనే వ్యక్తిని సీఈవోగా నియమించుకున్నారు. 2018 వరకు అంతా సవ్యంగానే సాగినా.. క్రియా హెల్త్‌కేర్ దినదినాభివృద్ధి చెందుతుండడం.. యూపీలోనూ టెండర్లు వేసేందుకు వేణుమాధవ్ సిద్ధమవ్వడంతో భాగస్వాములు

మిగతా 14వ పేజీలో...

ఓరి 'ఈడీ' వేషాలో..

ఢిల్లీలోని సైబర్‌ఫోరెన్సిక్ సంస్థ నెక్స్‌టెక్నోజెన్ క్లయింట్ల జాబితాలో ఈడీ

ఐఫోన్లను క్రాక్ చేసే ఇజ్రాయెలీ సంస్థ సెల్‌బ్రైట్‌తో ఆ సంస్థ భాగస్వామ్యం

కేజ్రీ ఐఫోన్‌పై కోర్టులో ఈడీ అమాయకత్వం!

2

నిబంధనలకు తూట్లు.. పార్టీలకు బాండ్లు

బీఆర్ఎస్‌కే అత్యధిక లబ్ధి

12

ఆ పార్టీకి రూ.31.5 కోట్లు, భారతీయ జనతా పార్టీకి రూ.26 కోట్లు

కంపెనీ ఏర్పాటైన మూడేళ్ల తర్వాతే రాజకీయ పార్టీలకు విరాళం ఇచ్చే అర్హత


షెల్ కంపెనీలను అడ్డుకోవటానికే..

నిబంధనను ఉల్లంఘించి రూ.103 కోట్ల బాండ్లు పార్టీలకిచ్చిన 20 కొత్త కంపెనీలు

వీటిలో 12 హైదరాబాద్ నుంచి నడిచేవే..

వెల్లడించిన 'హిందూ' దినపత్రిక

ఈద్ ముబారక్




మానవీయ విలువలకు అద్దం పట్టే రంజాన్

శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్

లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీక: ముఖ్యమంత్రి రేవంత్

12

మీ క్షమాపణలు మాకొద్దు



చర్యలకు సిద్ధంగా ఉండండి

తప్పుచేస్తే తప్పకుండా బాధపడాల్సిందే.. ఈ కేసులో మేం ఉదారంగా వ్యవహరించం

క్షమాపణ అఫిడవిట్‌ను కోర్టుకు సమర్పించే కన్నా ముందే మీడియాకు విడుదల చేశారు

విదేశీ పర్యటనల పేరుతో వ్యక్తిగత హాజరు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నాలు

కోర్టు ధిక్కరణ కేసులో రాందేవ్‌బాబా, బాలకృష్ణపై సుప్రీం ధర్మాసనం తీవ్ర ఆగ్రహం

పతంజలి సంస్థతో కుమ్మక్కయ్యారంటూ ఉత్తరాఖండ్ లైసెన్సింగ్ అధికారులపై ధ్వజం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పతంజలి ఆయుర్వేద సంస్థ వ్యవస్థాపకుడైన బాబా రాందేవ్, ఆ సంస్థ ఎండీ బాలకృష్ణపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కేసు నేపథ్యంలో న్యాయస్థానానికి బేషరతుగా సంపూర్ణ క్షమాపణలు చెబుతూ వారు సమర్పించిన అఫిడవిట్‌ను జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ అమానుల్లా నేతృత్వంలోని ధర్మాసనం తిరస్కరించింది. ఈ కేసులో ఉదారంగా వ్యవహరించలేమని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అలోపతిని (ఆధునిక వైద్యాన్ని) కించపరిచేలా.. పతంజలి సంస్థ, బాబా రాందేవ్ తరచుగా ప్రకటనలు చేయడాన్ని, వాణిజ్య ప్రకటనలు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గత ఏడాది సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఇకపై ఆ తరహా తప్పుడు వాణిజ్య ప్రకటనలు ఇవ్వబోమని పతంజలి సంస్థ అప్పట్లో అత్యున్నత న్యాయస్థానానికి హామీ ఇచ్చింది. కానీ, ఆ తర్వాత కూడా తన తీరు మార్చుకోకుండా అదే ధోరణి కొనసాగించడంతో కోర్టు ఆ సంస్థకు ఈ ఏడాది

మిగతా 2వ పేజీలో...

కేజ్రీవాల్‌కు నిరాశ

ఆయన పిటిషన్‌పై అత్యవసర విచారణకు సుప్రీం కోర్టు నిరాకరణ

వచ్చే సోమవారం పరిశీలిస్తామన్న సీజేఐ

అరెస్టును సమర్థించిన ఢిల్లీ హైకోర్టు

సవాలు చేస్తూ సుప్రీంను ఆశ్రయించిన కేజ్రీ

మంత్రి పదవికి ఆప్ నేత రాజ్‌కుమార్ ఆనంద్ రాజీనామా

కేజ్రీవాల్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపణ

నవంబరులో ఆనంద్ ఇంట్లో ఈడీ సోదాలు

మంత్రి రాజీనామాతో ఆప్ అవినీతి తేటతెల్లం: బీజేపీ

2



SHOWROOMS: TELANGANA: WARANGAL: RENAULT Warangal Mob: +91 9311700673.

6, 9, 11 తరగతులకు 'నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్'

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: కొత్త విద్యాసంవత్సరం(2024-25) నుంచి 6, 9, 11 తరగతులకు 'నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సీఆర్‌ఎఫ్)'ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని సీబీఎస్‌ఈ నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలంటూ అనుబంధ పాఠశాలలను బుధవారం ఆహ్వానించింది. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీఆర్‌ఎఫ్‌ను ప్రారంభించింది. పాఠశాల విద్య, ఉన్నత విద్య, వృత్తి విద్యలను సమీకృతం చేయడం.. ప్రీ ప్రైమరీ నుంచి పీహెచ్‌డీ స్థాయి వరకు విద్యార్థులు తమ క్రెడిట్లను పెంచుకోవడానికి ఎన్‌సీఆర్‌ఎఫ్ దోహదపడుతుంది. సీబీఎస్‌ఈ ముసాయిదా ప్రకారం పాఠశాల, ఉన్నత, వృత్తి విద్యలను అభ్యసించే విద్యార్థులకు క్రెడిట్ల కేటాయింపు కోసం సంవత్సరానికి మొత్తం అభ్యసన గంటలను 1200గా నిర్ణయించారు. ఈ ప్రక్రియలో విద్యార్థులకు 40 క్రెడిట్లు ఇస్తారు. అంటే 30 అభ్యసన గంటలు ఒక క్రెడిట్‌తో సమానం. ఈ ముసాయిదా మార్గదర్శకాల అమలును 2024-25 విద్యాసంవత్సరం నుంచి 6, 9, 11 తరగతులకు పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని సీబీఎస్‌ఈ నిర్ణయించినట్లు అనుబంధ పాఠశాలల ప్రిన్సిపాళ్లకు రాసిన లేఖలో తెలిపింది.

సీబీఐ విచారణకు సందేశ్ ఖాళీ కేసు

కోల్‌కతా, ఏప్రిల్ 10: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్ ఖాళీ ప్రాంతంలో మహిళలపై వేధింపులు, భూకబ్జాలపై కోల్‌కతా హైకోర్టు బుధవారం సీబీఐ విచారణకు ఆదేశించింది. చీఫ్ జస్టిస్ టీఎస్ శివజ్ఞానం నేతృత్వంలోని డివిజన్ బెంచ్ కోర్టు పర్యవేక్షణలోనే ఈ విచారణ సాగుతుందని స్పష్టం చేసింది. సందేశ్‌ఖాళీలో వ్యవసాయ భూములను చేపల చెరువులుగా మార్చిన తీరుపై క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, భూ రికార్డుల పరిశీలన జరిపి తదుపరి విచారణ సమయానికి నివేదిక సమర్పించాలని సీబీఐని ఆదేశించింది. మే 2న తదుపరి విచారణ ఉంటుందని తెలిపింది.

ఎన్ఐఏ, బీజేపీ మధ్య అవగాహన: టీఎంసీ

హల్దియా, ఏప్రిల్ 10: బీజేపీ, ఎన్ఐఏ మధ్య అవగాహన ఉందని తృణమూల్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. ఎన్ఐఏ అధికారులతో బీజేపీ సభ్యుడు ఒకరు సమావేశమయ్యారని ఆరోపించారు. అలాగే మరో బీజేపీ కార్యకర్త ఎన్ఐఏ అధికారి ఇంటికి వెళ్లి ఓ ప్యాకెట్ ఇచ్చారని ఆరోపించారు. దీనిపై తాము సుప్రీంకోర్టుకు వెళతామని స్పష్టం చేశారు. బీజేపీ కార్యకర్త చేతిలో ఓ ప్యాకెట్టుతో ఎన్ఐఏ అధికారి ఇంట్లోకి ప్రవేశించారని, తిరిగి వచ్చేటప్పుడు అది ఆయన చేతిలో లేదని చెప్పారు. దీనికి సంబంధించిన హైక్వాలిటీ వీడియో ఫుటేజ్ సుప్రీంకోర్టుకు సమర్పిస్తామని తెలిపారు. ఎన్నికల్లో గెలవలేమని భయపడుతున్న బీజేపీ... గెలిచేందుకు అనైతిక విధానాలకు పాల్పడుతోందని ఆరోపించారు.

మహిళా ఓటరుకు బీజేపీ ఎంపీ ఖగేన్ ముద్దు

కోల్‌కతా, ఏప్రిల్ 10: పశ్చిమబెంగాల్‌లోని ఉత్తర మల్దా నియోజకవర్గ ఎంపీ, బీజేపీ అభ్యర్థి ఖగేన్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ.. శ్రీహిపూర్ గ్రామంలో ఓ మహిళ చెంపపై ముద్దు పెట్టారు. ఊహించని ఈ ఘటనతో స్థానికులు ఆశ్చర్యపోయారు. ఎంపీ ఖగేన్ చేష్టను టీఎంసీ తీవ్రంగా ఖండించింది. "మోదీ బృందం ఎత్తుకున్న నారీ కా సమ్మాన్ నినాదం ఇదేనా" అని వ్యాఖ్యానించింది. అయితే మహిళా ఓటరుకు ముద్దు పెట్టడాన్ని ఖగేన్ సమర్థించుకున్నారు. ఆమెను ఓ చిన్నారిగా భావించే ముద్దు పెట్టానని చెప్పారు. సదరు మహిళ కూడా ఖగేన్‌ను వెనకేసుకొచ్చింది.

చంద్రయాన్-3 టీమ్‌కు అరుదైన గౌరవం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: చంద్రయాన్-3 మిషన్ విజయానికి కారణమైన ఇస్రో టీమ్‌ను 2024 ఏడాదికి గానూ అమెరికాలోని స్పేస్ ఫౌండేషన్ ప్రతిష్ఠాత్మక 'జాన్ ఎల్ జాక్ స్విగెర్ట్ జూనియర్ అవార్డు'తో సత్కరించింది. ఈ అవార్డును జనవరిలోనే ప్రకటించగా.. తాజాగా అమెరికాలోని కొలరాడోలో జరిగిన వార్షిక స్పేస్ సింపోజియంలో దాన్ని ప్రదానం చేశారు. ఇస్రో తరఫున హ్యూస్టన్‌లోని భారత కాన్సులేట్ జనరల్ డీసీ మంజునాథ్ ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా స్పేస్ ఫౌండేషన్ సీఈవో హీదర్ ప్రింగిల్ మాట్లాడుతూ.. 'ఈ బృందం చేపట్టే తదుపరి మిషన్ కోసం మేం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం' అని అన్నారు.

కెనడా ఎన్నికల్లో భారత్ జోక్యం లేదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: కెనడా ఎన్నికల్లో భారత్ ఎలాంటి జోక్యం చేసుకోలేదని ట్రూడో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వతంత్ర కమిషన్ దర్యాప్తులో స్పష్టమైంది. 2021 నాటి ఎన్నికలను ప్రభావితం చేసేలా భారత్ ప్రయత్నాలు చేసినట్లు తమ దృష్టికి రాలేదని సీనియర్ అధికారుల కమిటీ కమిషన్‌కు తెలిపింది. ఈ కమిటీయే నాటి ఎన్నికలను పర్యవేక్షించింది. భారత్ ప్రమేయం ఉందనడానికి ఎలాంటి సాక్ష్యాలు లేవని కూడా కమిటీ స్పష్టం చేసింది. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో భారత్‌పై చేసిన ఆరోపణలతో ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న తెలిసిందే. కెనడాలో ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య వెనుక భారత్ హస్తం ఉందని ట్రూడో ఆరోపించారు. దీంతో పాటు కెనడా ఎన్నికల్లో భారత్ జోక్యంపై దర్యాప్తునకు ఆదేశించారు.

నేషనల్ హెరాల్డ్ ఆస్తుల జప్తునకు సమర్థన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: మనీ లాండరింగ్ కేసులో నేషనల్ హెరాల్డ్ పత్రికకు చెందిన రూ.752 కోట్ల ఆస్తులను ఈడీ జప్తు చేయడాన్ని పీఎంఎల్‌ఏ న్యాయ ప్రాధికార సంస్థ సమర్థించింది. ఈడీ అటాచ్ చేసిన చరాస్తులు, ఈక్విటీ షేర్లు ఆర్థిక అక్రమాలు, మనీ లాండరింగ్ ద్వారా సమకూరినట్టు భావిస్తున్నట్టు సంస్థ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రమోటర్లుగా ఉన్న యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ నేషనల్ హెరాల్డ్‌కు యాజమాన్య సంస్థ. ఈ సంస్థలో ఆర్థిక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది.

'దైవకణం' కనుగొన్న పీటర్ హిగ్స్ కన్నుమూత



ఇంగ్లండ్, ఏప్రిల్ 10 : ఈ విశ్వం ఎలా ఆవిర్భవించిందనేది వివరించడంలో సాయపడే హిగ్స్ బోసన్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన దిగ్గజ భౌతికశాస్త్ర శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత పీటర్ హిగ్స్(94) కన్నుమూశారు. హిగ్స్ మంగళవారం మరణించారని ఎడిన్‌బర విశ్వవిద్యాలయం ప్రకటించింది. దైవకణం లేదా హిగ్స్‌బోసన్ పార్టికల్‌పై చేసిన పరిశోధనలతో పీటర్ హిగ్స్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. హిగ్స్‌బోసన్ కణం ఉనికిని హిగ్స్ 1964లోనే వెలుగులోకి తెచ్చారు. బెల్జియంకు చెందిన ఫ్రాంకోయిస్‌తో కలిసి 2013లో ఆయన భౌతికశాస్త్రంలో నోబెల్ అందుకున్నారు.

టాప్ 25 బిజినెస్ స్కూళ్లలో ఐఐఎం-అహ్మదాబాద్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: ప్రతిష్ఠాత్మక క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో భారత్‌కు చెందిన బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యాసంస్థలు మరోసారి సత్తా చాటాయి. బుధవారం సబ్జెక్టుల వారీగా ప్రకటించిన ఈ జాబితాలో బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో ఐఐఎం-అహ్మదాబాద్ ప్రపంచవ్యాప్తంగా టాప్-25 సంస్థల్లో స్థానం దక్కించుకుంది. ఐఐఎం-బెంగళూరు, ఐఐఎం-కోల్‌కతా టాప్-50లో ఉన్నాయి. ఇండియాలో చూస్తే జేఎన్‌యూ అత్యున్నత ర్యాంకు కైవసం చేసుకుంది.

మీ క్షమాపణలు మాకొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఫిబ్రవరిలో ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులకు జవాబివ్వకపోవడంతో.. బాబా రాందేవ్, బాలకృష్ణ తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది. దీంతో పతంజలి ఎండీ బాలకృష్ణ కోర్టుకు క్షమాపణలు చెబుతూ ఒక అఫిడవిట్ దాఖలు చేశారు. కానీ, అందులో ఆయన డ్రగ్స్ అండ్ మ్యాజికల్ రెమెడీస్ (అబ్జెక్షనబుల్ అడ్వర్టైజ్‌మెంట్స్) యాక్ట్, 1954ను పాత చట్టంగా అభివర్ణించారు. ఆయుర్వేదం శాస్త్రీయత రుజువుకాని సమయంలో రూపొందించిన చట్టంగా పేర్కొన్నారు. దీంతో సుప్రీంకోర్టు ఆ అఫిడవిట్‌ను తిరస్కరించి.. మరో అఫిడవిట్ దాఖలు చేయడానికి అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలోనే రాందేవ్ బాబా, బాలకృష్ణ.. సుప్రీంకోర్టుకు క్షమాపణ చెబుతూ తాజా అఫిడవిట్ దాఖలు చేశారు. బుధవారం ఈ కేసు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ధర్మాసనం పతంజలి సంస్థపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీంతో ఆ సంస్థ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ.. 'మనుషులన్నాక తప్పులు చేస్తారు' అంటూ నచ్చజెప్పే ధోరణిలో మాట్లాడబోయారు. ఆ సమయంలో జోక్యం చేసుకున్న జస్టిస్ హిమా కోహ్లీ.. "అందుకు వారు బాధపడాల్సిందే. ఈ కేసులో మేం ఉదారంగా వ్యవహరించదల్చుకోలేదు" అని తేల్చిచెప్పారు. క్షమాపణలు కేవలం కాగితం మీదే ఉన్నాయి తప్ప వారి ఆలోచనల్లో మార్పు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేయబోమంటూ గతంలో కోర్టుకు వాగ్దానం చేసి దాన్ని తప్పారు. ఇప్పుడు మీరు చెప్పే క్షమాపణను కూడా అలాంటిదేనని మేం ఎందుకు భావించకూడదు?" అని నిలదీశారు. "ఈ క్షమాపణ విషయంలో మేం కన్విన్స్ కాలేదు. దీన్ని తిరస్కరిస్తున్నాం" అని కుండబద్దలుగొట్టారు. దీనిపై బహిరంగ క్షమాపణ చెప్పేందుకు తన క్లయింట్లు సిద్ధంగా ఉన్నారని రోహత్గీ చెప్పినప్పటికీ.. కోర్టు అందుకు అంగీకరించలేదు. "మీరు కోర్టు పట్ల ఎలా నిర్లక్ష్యంతో వ్యవహరించారో, అలాగే మీ క్షమాపణల పట్ల మేమెందుకు వ్యవహరించకూడదు. మాకు క్షమాపణలు చెప్పడానికి ముందే మీరు అఫిడవిట్లను మీడియాకు పంపారు. అంటే, మీకు న్యాయస్థానాల కంటే ప్రచారమే ముఖ్యమని అర్థమవుతోంది" అని జస్టిస్ హిమా కోహ్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశీ పర్యటనల పేరుతో వ్యక్తిగత హాజరు నుంచి తప్పించుకొనే ప్రయత్నం చేశారన్నారు.



బుధవారం సుప్రీంకోర్టు ఆవరణలో బాబా రాందేవ్

లైసెన్సింగ్ అధికారులపైనా ధ్వజం

పతంజలి ఆయుర్వేద సంస్థ ఔషధాలకు అనుమతులిచ్చిన ఉత్తరాఖండ్ లైసెన్సింగ్ అథారిటీ తీరుపైనా ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఆ సంస్థ తప్పుదోవ పట్టించే ప్రకటనలపై చర్యలు ఎందుకు తీసుకోలేదు. పదే పదే ఉల్లంఘనలు జరుగుతుంటే అథారిటీ అధికారులు చేతులు కట్టుకుని కూర్చున్నట్టు కనిపిస్తుంది. హెచ్చరికలు జారీ చేసి వదిలేస్తే సరిపోతుందని అనుకున్నారా? పతంజలి సంస్థతో అధికారులు కుమ్మక్కు అయ్యారని ఎందుకు భావించకూడదు? లైసెన్సింగ్ అథారిటీలో ఉన్న అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోకూడదు. ఇది కేవలం ఒక కంపెనీకి సంబంధించిన వ్యవహారం మాత్రమే కాదు. న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘిస్తే ఏం జరుగుతుందో సమాజానికి తెలియాల్సిన అవసరం ఉంది. ఈ కేసులో 2018 నుంచి ఇప్పటి వరకూ జిల్లా ఆయుర్వేద, యునాని అధికారులుగా విధులు నిర్వహిస్తున్న అధికారులందరూ తాము తీసుకున్న చర్యలపై న్యాయస్థానానికి సమాధానం చెప్పాలి. ఈ కేసులో ఏప్రిల్ 16వ తేదీన ఆదేశాలు జారీ చేస్తాం" అని న్యాయస్థానం తెలిపింది. అలాగే.. 2018 నుంచి ఇప్పటిదాకా ఉత్తరాఖండ్ స్టేట్ లైసెన్సింగ్ అథారిటీలో జాయింట్ డైరెక్టర్లుగా వ్యవహరించినవారందరూ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. పతంజలి సంస్థ తప్పుడు ప్రకటనలపై కేంద్ర ఆయుష్ శాఖ ఉత్తరాఖండ్ లైసెన్సింగ్ అథారిటీకి లేఖ రాస్తే.. అథారిటీ ఆ లేఖను కంపెనీకి పంపిందని.. ఇలా ఆరుసార్లు జరిగినా లైసెన్సింగ్ యంత్రాంగం మౌనంగా ఉండిపోయిందని గుర్తు చేసింది. "మీరు ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారు" అని ఆందోళన వెలిబుచ్చింది. ఉత్తరాఖండ్ లైసెన్సింగ్ అథారిటీ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది ధ్రువ్ మెహతా.. అధికారుల నిజాయితీ గురించి ప్రస్తావించగా.. వారి విషయంలో ఆ పదాన్ని వాడొద్దని కోర్టు కఠినంగా వ్యాఖ్యానించింది. ఆ ప్రస్తావన తెస్తే చీల్చిచెండాడుతామని వ్యాఖ్యానించింది.

ఇదీ కేసు నేపథ్యం

2020 జూన్‌లో.. ప్రపంచమంతా కొవిడ్ దెబ్బకు అతలాకుతలమవుతున్న వేళ కరోనా మందుల పేరిట 'కరోనిల్, 'స్వసరి' పేరుతో పతంజలి సంస్థ రెండు ఔషధాలను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 2022 జులైలో పత్రికలకు ఇచ్చిన ఓ ప్రకటనలో.. బీపీ, మధుమేహం, థైరాయిడ్ వంటి ఆటో ఇమ్యూన్ వ్యాధులను అల్లోపతి నయం చేయలేదని, తాము ఆయుర్వేదంతో ఆయా వ్యాధులను నయం చేశామని పేర్కొంది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ ప్రచారం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని కోర్టుకు నివేదించింది. దీంతో పాటు రామ్‌దేవ్ బాబా పలు సందర్భాల్లో కొవిడ్ వ్యాక్సిన్లపై చేసిన దుష్ప్రచారాన్ని కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. కోర్టు నోటీసులు ఇవ్వడంతో.. ఇకముందు అలాంటి ప్రకటనలు ఇవ్వబోమని, అల్లోపతిపై యథాలాప వ్యాఖ్యలు చేయబోమని పతంజలి సంస్థ కోర్టుకు హామీ ఇచ్చింది. కానీ, ఆ తర్వాత కూడా సంస్థ తన ధోరణిని యథాతథంగా కొనసాగిస్తూ, ప్రకటనలు ఇవ్వడంతో.. సుప్రీంకోర్టు ఆ సంస్థకు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది.



ఓరి 'ఈడీ' వేషాలో..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: మద్యం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన ఈడీ అధికారులు ఆయన ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే! ఆ ఫోన్‌లో ఈ కేసుకు సంబంధించిన వివరాలున్నాయని.. కానీ, ఆయన ఆ ఫోన్ పిన్ నంబర్ చెప్పట్లేదని ఈడీ అధికారులు కోర్టుకు వెల్లడించారు. కానీ.. ఐఫోన్ క్రాకింగ్ తమకు సాధ్యం కాదన్నట్టు కోర్టుకు అమాయకంగా వెల్లడించిన ఈడీ.. ఢిల్లీలోని నెక్స్‌టెక్నోజెన్ అనే సైబర్ ఫోరెన్సిక్ సంస్థ క్లయింట్ అని తాజాగా వెల్లడైంది. ఐఫోన్ క్రాకింగ్‌లో దిట్టగా పేరొందిన ఇజ్రాయెల్ సంస్థ సెల్‌బ్రైట్‌తో ఈ నెక్స్‌టెక్నోజెన్‌కు సంబంధాలున్నాయని పేర్కొంటూ 'హిందూ' పత్రిక ఒక కథనాన్ని ప్రచురించింది. అంటే.. ఈడీ పరోక్షంగా సెల్‌బ్రైట్ సేవలు పొందే అవకాశం ఉన్నట్టే. నిజానికి ఐఫోన్ క్రాకింగ్.. అంత వీజీ కాదు! వినియోగదారులు తమ ఫోన్లకు పెట్టిన పిన్‌ను తాము కూడా క్రాక్ చేయలేమని సాక్షాత్తూ యాపిల్ సంస్థే గతంలో ప్రకటించింది. అమెరికాలో ఒక నేరగాడి ఐఫోన్‌లో ఏముందో చూడ్డానికి దర్యాప్తు సంస్థలు కోరినా.. అలా చేయలేమని, చేసే అవకాశం లేదని తేల్చిచెప్పింది!! ఇప్పుడు కేజ్రీవాల్ విషయంలోనూ అదే పరిస్థితి ఎదురైనట్టు ఈడీ వ్యవహరిస్తోంది. కానీ నెక్స్‌టెక్నోజెన్‌కు సెల్‌బ్రైట్‌కు మధ్య సంబంధాలను చూస్తే కేజ్రీ ఫోన్‌ను ఈడీ క్రాక్ చేసి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే.. ఈ విషయాన్ని ధ్రువీకరించడానికి సెల్‌బ్రైట్ నిరాకరించినట్టు 'హిందూ' పత్రిక వెల్లడించింది. కాగా.. నెక్స్‌టెక్నోజెన్ వెబ్‌సైట్ ప్రకారం ఆ సంస్థ క్లయింట్లలో ఒక్క ఈడీనే కాదు, బిహార్ పోలీస్, కేరళ పోలీస్, ఢిల్లీ ఫోరెన్సిక్ లేబొరేటరీ, భారత సైన్యం, కోల్‌కత పోలీస్, నేపాల్, మాల్దీవులకు చెందిన దర్యాప్తు సంస్థలు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రముఖ టెక్ పోర్టల్ మీడియానామా ప్రకారం.. 2022లో హైదరాబాద్ పోలీసులు కూడా సెల్‌బ్రైట్ సేవలను వినియోగించుకున్నట్టు సమాచారం.

కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టులో నిరాశ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సీఎం కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో తక్షణ ఊరట లభించలేదు. తన అరెస్టును సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. పిటిషన్‌ను వచ్చే సోమవారం పరిశీలిస్తామని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్.. కేజ్రీవాల్ తరఫు న్యాయవాది వివేక్ జైన్‌కు తెలిపారు. ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ మార్చి 21న కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఆయన పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం కొట్టేసింది. హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ కేజ్రీవాల్ బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కాగా, తన లాయర్లను కలిసేందుకు వారానికి ఐదుసార్లు అవకాశం ఇవ్వాలని కేజ్రీవాల్ చేసిన విజ్ఞప్తిని రౌస్ అవెన్యూ కోర్టు తోసిపుచ్చింది. దీంతో ఇప్పుడున్న ప్రకారం వారానికి రెండుసార్లు మాత్రమే కేజ్రీవాల్ తన లాయర్లను కలవొచ్చు.

ఆప్ మంత్రి రాజ్‌కుమార్ రాజీనామా

సీఎం కేజ్రీవాల్ అరెస్టుతో పీకల్లోతు ఇబ్బందుల్లో కూరుకుపోయిన ఆమ్ ఆద్మీ పార్టీకి(ఆప్) భారీ షాక్ తగిలింది. ఢిల్లీ సాంఘిక సంక్షేమశాఖ మంత్రి రాజ్‌కుమార్ ఆనంద్ బుధవారం మంత్రి పదవితో పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. "అవినీతికి వ్యతిరేకంగా ఆప్ జరిపిన పోరాటానికి ఆకర్షితుడినై ఆ పార్టీలో చేరాను. కానీ, ఇప్పుడు ఆ పార్టీ ప్రభుత్వమే కూరుకుపోయింది. అందువల్లే మంత్రి పదవికి, ఆ పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నా" అని చెప్పారు. గతేడాది నవంబరులో మనీలాండరింగ్ కేసులో రాజ్‌కుమార్ ఇంట్లో ఈడీ సోదాలు నిర్వహించింది. రాజ్‌కుమార్ అరెస్టుపై బీజేపీ స్పందిస్తూ.. ఆప్ మంత్రి రాజీనామా ఆ పార్టీ అవినీతిని తేటతెల్లం చేసిందని ఆరోపించింది. తమ ఎమ్మెల్యేలను బెదిరించడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐలను వాడుకుంటోందని ఆప్ ఆరోపించింది.

భవిష్యత్తు చూడాలంటే భారత్‌కు రండి

- అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి



న్యూఢిల్లీ, వాషింగ్టన్, ఏప్రిల్ 10: భవిష్యత్తును చూడాలని అనుకునే వారు భారతదేశానికి రావాలని భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి అన్నారు. న్యూఢిల్లీలో బుధవారం జరిగిన ఓ సదస్సులో పాల్గొన్న గార్సెటి.. భారతదేశం సాధించిన పురోగతి, ప్రపంచ భవిష్యత్తును నిర్దేశించడంలో భారత్ పాత్రను కొనియాడారు. ఈ సదస్సులో మాట్లాడుతూ "మీరు భవిష్యత్తును చూడాలనుకుంటే.. భవిష్యత్తును ఆస్వాదించాలి అనుకుంటే..భవిష్యత్తు కోసం పని చేయాలని అనుకుంటే భారత్‌కు రండి. భారత్‌లో అమెరికా రాయబారిగా ఉన్న నేను నిత్యం దానిని ఆస్వాదిస్తున్నాను" అని గార్సెట్టి పేర్కొన్నారు. తాను ఈ సదస్సుకు వచ్చింది పాఠాలు చెప్పడానికి కాదని నేర్చుకునేందుకని వెల్లడించారు. వివిధ రంగాల్లో భారత్, అమెరికా అనుబంధం కొత్త శిఖరాలకు చేరిందని అమెరికా జాతీయ భద్రత సలహాదారు జేక్ సలివాన్ అన్నారు. మరోపక్క, మోదీ భారతదేశ ముఖచిత్రంగా మారారని అమెరికా చట్టసభ సభ్యుడు బ్రాడ్ షెర్మన్ ప్రశంసించారు.

జైన ముని లోకేశ్‌కు యూఎస్ పురస్కారం


వాషింగ్టన్, ఏప్రిల్ 10: భారత్‌కు చెందిన ప్రముఖ జైన ఆధ్యాత్మిక వేత్త ఆచార్య లోకేశ్ ముని ప్రతిష్ఠాత్మక అమెరికా అధ్యక్షుడి గోల్డెన్ వాలంటీర్ సేవ పురస్కారాన్ని అందుకున్నారు. మానవత్వం, ప్రజాశ్రేయస్సు కోసం చేస్తున్న కృషిగాను ఆయనకు ఈ అవార్డును 'అమెరికార్ప్స్' అనే స్వచ్ఛంద సంస్థ మంగళవారం అందించింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పందించారు. "ప్రజా సేవ చేస్తున్నందుకు, భారత్ వంటి గొప్ప దేశానికి, మానవాళికి సేవలు అందజేస్తున్నందుకు మీకు అభినందనలు" అని జో బైడెన్ అన్నారు. "ఈ అవార్డు నాకు దక్కడం గర్వకారణం. ఈ పురస్కారంతో బాధ్యత మరింత పెరిగింది" అని లోకేశ్ ముని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యం భారత్ మూలాల్లోనే

బలమైన ఆర్థిక శక్తిగా చైనాతో భారత్ పోటీపడుతోంది

- వరుసగా రెండుసార్లు అధికారంలో ఉన్నా మాకు ప్రజాదరణ పెరుగుతోంది
- 'న్యూస్‌వీక్'తో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: ప్రజాస్వామ్యం అనేది భారత్ దేశ మూలాల్లోనే ఉందని.. అన్ని మతాల్లోని మైనారిటీలు అభివృద్ధి చెందుతున్నారని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. వరుసగా రెండుసార్లు అధికారంలో ఉన్నా తమ ప్రభుత్వంపై ప్రజాదారణ పెరుగుతోందని సగర్వంగా వ్యాఖ్యానించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో 'న్యూస్‌వీక్'తో మోదీ మాట్లాడారు. ఇందిరాగాంధీ తర్వాత 'న్యూస్‌వీక్' కవర్ పేజీపై కనిపించనున్న మొట్టమొదటి ప్రధానిగా మోదీ నిలుస్తారు. 'న్యూస్‌వీక్' మ్యాగజైన్ ఎడిటర్లతో మోదీ మాట్లాడుతూ భారత్‌లో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ లేకుండా పోయిందంటూ ఇటీవల విపక్షాలు చేసిన ఆరోపణలను ప్రస్తావించారు. భారత్ ఓ ప్రజ్యాస్వామ్యదేశం అని రాజ్యాంగంలోనే కాదు.. దేశ మూలాల్లోనే ఉందని చెప్పారు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బలమైన ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగిందని, ఆ క్రమంలో చైనాతో పోటీపడుతోందని చెప్పారు. ఉపఖండంలో శాంతిభద్రతలను నెలకొల్పామని పలితంగా ఉగ్రవాదం, హింస నుంచి విముక్తి కలిగిందని పాక్ పేరును ప్రస్తావించకుండా వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370ని ఎత్తివేయడంతో జమ్మూకశ్మీర్ ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు చిగురించాయని అన్నారు. 370 ఆర్టికల్‌ను ఎత్తివేసిన తర్వాత అక్కడ ఫార్ములా-4 రేసింగ్ ఈవెంట్లు, మిస్ వరల్డ్, జీ-20 సమావేశాల వంటి ప్రపంచ స్థాయి కార్యక్రమాలు జరిగాయని చెప్పారు నాయకుడికి వినడం అనేది గొప్ప లక్షణం అని, ఇది తనకు ఇది భగవంతుడు ఇచ్చిన వరం అని పేర్కొన్నారు. కాగా, ప్రజాధనాన్ని దోచుకోవడంలోనూ, అవినీతి, అక్రమాలకు పాల్పడటంలోను పేటెంట్ హక్కులు కలిగిన ఏకైక పార్టీ డీఎంకే అని మోదీ దుయ్యబట్టారు. బుధవారం తమిళనాడులో ఎన్నికల ప్రచారంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.



న్యూస్‌వీక్ మ్యాగజైన్‌పై మోదీ(ఊహాత్మక చిత్రం)

బీజేపీకి ఎంఎన్ఎస్ బేషరతు మద్దతు

మహారాష్ట్ర రాజకీయాలు కీలక మలుపు తిరిగాయి. మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) బీజేపీకి బేషరతుగా మద్దతు తెలిపింది. ముంబై లోని శివాజీ పార్కులో బుధవారం జరిగిన ర్యాలీలో ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ ఠాక్రే మాట్లాడుతూ.. ప్రధానిమోదీకి, బీజేపీకి బేషరతుగా మద్దతు తెలుపుతున్నామని ప్రకటించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తాము పోటీ చేయడం లేదని, త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికలు దేశ భవిష్యత్తును నిర్దేశిస్తాయన్నారు. "మనం అభివృద్ధి చెందాలా? కష్టాలు కొనితెచ్చుకోవాలా? అనేది ఈ ఎన్నికలే తేల్చేస్తాయి" అని రాజ్ ఠాక్రే వ్యాఖ్యానించారు. కాగా, రాజ్ ఠాక్రే నిర్ణయాన్ని ఏక్‌నాథ్ షిండే స్వాగతించారు.

ఐరాస ఎన్నికల్లో భారత్ జయభేరి!

ఐరాస, ఏప్రిల్ 10: ఐక్యరాజ్యసమితిలోని పలు విభాగాల్లో నామినీలు/ప్రతినిధుల నియామకానికి మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో భారత్ ఘన విజయం సాధించింది. అత్యంత కీలకమైన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ బోర్డు(ఐఎన్‌సీబీ), వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్, యూఎన్‌డీపీ, యూఎన్ పాపులేషన్ ఫండ్‌తో పాటు మరికొన్ని విభాగాలకు ఇండియా తరఫున పోటీ చేసిన నామినీలు ఎన్నికయ్యారు. ఐఎన్‌సీబీ ప్రతినిధిగా భారత్ నుంచి జగ్జీత్ పావడియా మూడోసారి ఎన్నికవడం విశేషం. సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించిన ఈ ఎన్నికలో మొత్తం 53 ఓట్లకు గాను ఆయనకు 41 ఓట్లు వచ్చాయి. జగ్జీత్ ఐఎన్‌సీబీ బోర్డులో 2030 వరకు ఉంటారు. వీటితో పాటు యూఎన్ చిల్డ్రన్స్ ఫండ్ ఎగ్జిక్యూటివ్ బోర్డుకు కూడా భారత నామినీ ఎన్నికయ్యారు. భారత నామినీలు ఎన్నికవడంపై ఐరాసలోని భారత శాశ్వత రాయబార కార్యాలయం హర్షం వ్యక్తం చేసింది. "ఈ రోజు భారత్ గొప్ప విజయం సాధించింది" అని ఎక్స్‌లో పోస్టు చేసింది. "వసుధైవ కుటుంబకం అన్న భావనకు కట్టుబడి భారతదేశం ఐరాస విభాగాల్లో పనిచేస్తుంది" అని యూఎన్‌లో ఇండియా శాశ్వత ప్రతినిధి రుచిరా కాంబోజ్ అన్నారు. యూఎన్ ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్ ఐరాసలోని వివిధ విభాగాల్లో ప్రతినిధుల భర్తీకి మంగళవారం ఎన్నికలు నిర్వహించింది.

ఇజ్రాయెల్ దాడిలో హమాస్ చీఫ్ కుమారులు, మనవళ్లు మృతి

కైరో, ఏప్రిల్ 10: గాజాపై బుధవారం ఇజ్రాయెల్ మరోసారి వైమానిక దాడి జరిపింది. ఈ దాడిలో హమాస్ అధినేత ఇస్మాయిల్ హనియా ముగ్గురు కుమారులు, ఇద్దరు మనవళ్లు మరణించారు. ఈ విషయాన్ని హమాస్ తెలిపింది. బుధవారం హనియా కుమారులు గాజాలోని శిబిరానికి కారులో వెళ్తున్న సమయంలో ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడిలో వారితో పాటు ఇద్దరు చిన్నారులు మరణించారు. ఈ ఘటనపై ఇస్మాయిల్ హనియా స్పందించారు. "నా కుమారులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా యుద్ధం బలహీనపడుతుందనుకోవడం వారి భ్రమే. పాలస్తీనాను విముక్తి చేసే మార్గంలో నా కుమారులు, మనవళ్లు అమరులయ్యారు. నవంబర్‌లో జరిగిన దాడిలో ఇజ్రాయెల్ నా ఇంటిని నేలమట్టం చేసినా భయపడలేదు" అని అల్ జజీరా న్యూస్ చానెల్‌కు తెలిపారు.

ఐఫోన్.. కేరాఫ్ ఇండియా

- ప్రతి 7 ఫోన్లలో 1 భారత్‌లో తయారీ
- భారత్‌లో మూడు యూనిట్లలో అసెంబ్లింగ్

(సెంట్రల్ డెస్క్)

అగ్రరాజ్యం అమెరికాలో ఐఫోన్ కొన్నా.. దానిపై ఉండేది 'మేడిన్ చైనా'..! ఇది ఒకప్పటి ముచ్చట..! ఇప్పుడు క్రమంగా 'మేడిన్ ఇండియా' ఐఫోన్లు పెరుగుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం(2023-24)లో ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయిన ఐఫోన్లలో భారత్ వాటా 14%. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. ఇది రెట్టింపు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) భారత్ వాటా 25 శాతాన్ని దాటనుందని అంచనా..! మూడు దిగ్గజ కంపెనీలు భారత్‌లో యాపిల్ ఐఫోన్ అసెంబ్లింగ్ చేస్తున్నాయి. వీటిల్లో ఫాక్సాన్ టెక్నాలజీ గ్రూప్ వాటా 67% కాగా.. పెగట్రాన్ కార్ప్ మరో 17% ఐఫోన్లను ఉత్పత్తి చేస్తున్నాయి. మిగతా వాటా టాటా గ్రూప్(గతంలో విస్ట్రాన్ కార్ప్)ది. క్రమంగా ఈ కంపెనీలు తమ ఉత్పాదకతను పెంచే దిశలో చర్యలు తీసుకుంటున్నాయి. 2017 నుంచే భారత్‌లో ఐఫోన్ల అసెంబ్లింగ్ ప్రారంభమైంది. అప్పటి నుంచి ఐఫోన్ అన్ని రకాల మోడల్స్ 'మేడిన్ ఇండియా' లేబుల్‌తో ఇక్కడే అసెంబ్లింగ్ అయ్యేవి. ప్రస్తుతం ప్రో, ప్రోమ్యాక్స్ మినహా.. ఐఫోన్ 13 నుంచి ఐఫోన్ 15 మోడళ్ల అసెంబ్లింగ్ జరుగుతోంది. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్‌గోయల్ గత ఏడాది భారత్‌లో యాపిల్ పెట్టుబడుల గురించి మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఐఫోన్ అసెంబ్లింగ్‌లో భారత్ వాటా 25 శాతానికి చేరుకోనున్నట్లు అంచనా వేశారు.

చైనాకు క్రమంగా దూరం.. దూరం..!

కొవిడ్ విజృంభణకు ముందు వరకు ఐఫోన్‌ల అసెంబ్లింగ్ 100% చైనాలోనే జరిగేది. రోజుకు 5 లక్షల ఐఫోన్లు తయారయ్యేవి. సుదీర్ఘ లాక్‌డౌన్ల వల్ల ఐఫోన్ల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడింది. అప్పట్లోనే యాపిల్ క్రమంగా ఇతర దేశాల్లో అసెంబ్లింగ్‌కు ప్రయత్నాలు చేసింది. భారత్‌లో అసెంబ్లింగ్‌ను పెంచాలని నిర్ణయించింది. ఇందుకు భారత పారిశ్రామిక విధానాలు, ప్రోత్సాహకాలు కూడా దోహదపడ్డాయి. ప్రస్తుతం ఐఫోన్-15 ఉత్పత్తిలో చైనా వాటా కేవలం 7%. పొరుగుదేశాలతో డ్రాగన్ కవ్వింపు చర్యలు, అమెరికాతో కయ్యం కూడా చైనా నుంచి యాపిల్ బయటకు రావడానికి కారణంగా తెలుస్తోంది. కాగా, భారత్‌లో స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు క్రమంగా పెరుగుతున్నట్లు 'ఇండియన్ సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్' వెల్లడించింది. భారత్ ఎగుమతుల్లో మొబైల్‌ఫోన్లు ఐదో స్థానానికి చేరుకున్నట్లు తెలిపింది. యాపిల్‌తోపాటు.. సామ్‌సంగ్ వంటి దిగ్గజ కంపెనీల ఉత్పత్తి భారత్‌లో జరగడమే ఇందుకు కారణమని పేర్కొంది.



విడి భాగాల ఉత్పత్తి ఎక్కడెక్కడ?

- యాపిల్ తన ఐఫోన్‌కు కావాల్సిన విడిభాగాలను వేర్వేరు దేశాల్లోని సంస్థలతో ఉత్పత్తి చేయిస్తుంది. అయితే.. వాటి అసెంబ్లింగ్ మాత్రం ఒకప్పుడు చైనాకు మాత్రమే పరిమితమయ్యేది. ఇప్పుడు భారత్, వియత్నాం తదితర దేశాల్లో ఐఫోన్ అసెంబ్లింగ్ యూనిట్లు పుంజుకున్నాయి.
- కాలిఫోర్నియాలోని క్యూపెర్టినోలో యాపిల్ హెడ్‌క్వార్టర్స్ ఉంది.
- జపాన్, కొరియా, తైవాన్‌లలో ఐఫోన్ స్క్రీన్‌లు తయారవుతాయి. జపాన్‌లోని షార్ప్ కంపెనీ ఎల్‌సీడీ ప్యానెల్స్‌ను, టచ్‌స్క్రీన్/టచ్‌ప్యాడ్‌లను జపాన్‌తోపాటు.. కొరియన్ కంపెనీలు తయారు చేస్తున్నాయి.
- దక్షిణ కొరియాకు చెందిన ఎల్‌జీ సంస్థ ఐఫోన్ కోసం ఇన్-సెల్ డిస్‌ప్లే టెక్నాలజీని అందజేస్తుంది. దక్షిణ కొరియాకు చెందిన సామ్‌సంగ్ కంపెనీ ఐఫోన్‌కోసం మైక్రోచిప్స్‌ను, బ్యాటరీలను రూపొందిస్తోంది.
- తైవాన్‌కు చెందిన టీఎస్ఎంసీ, ఎస్‌కే హైనిక్స్ సంస్థలు చిప్స్, డీ-ర్యామ్, ఫ్లాష్ మెమొరీని ఉత్పత్తి చేస్తాయి. జెనీవా కేంద్రంగా పనిచేస్తున్న ఎస్టీ మైక్రోఎలక్ట్రానిక్స్ సంస్థ ఐఫోన్లలో ట్రాకింగ్ వ్యవస్థకు అవసరమైన గైరోస్కోప్‌ను అందజేస్తోంది. మలేసియా, ఇండోనేషియా, థాయ్‌లాండ్, ఫిలిప్పైన్స్ దేశాల్లోనూ పలు విడిభాగాలు తయారవుతాయి.

ఈ సారి 'హిట్' కొట్టేస్తాం!

నా అనుభవం.. పవన్ పవర్.. మోదీ సంకల్పం.. అగ్నికి వాయువు తోడైంది.. వైసీపీ కొట్టుకుపోవడం ఖాయం

విధ్వంసకర పాలన కావాలా?.. అభివృద్ధి చేసే పాలన కావాలా?

ఆలోచించి ఓటేయండి.. భవిత కోసం గెలిపించండి: చంద్రబాబు

ప్రశ్నించేవాడు లేకపోతే బెదిరించేవాడిదే రాజ్యం : పవన్

తణుకు, నిడదవోలుల్లో ఉమ్మడి గర్జన





తణుకు సభకు హాజరైన జన సందోహం, నిడదవోలు సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, వేదికపై పవన్, పురందేశ్వరి

(భీమవరం/తణుకు/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'నాకు అనుభవం ఉంది. పవన్‌కు పవర్ ఉంది. ప్రధాని మోదీకి దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా చేయాలన్న సంకల్పం ఉంది. ఇది ప్రారంభం మాత్రమే. అగ్నికి వాయువు తోడైంది. ప్రజాగ్రహానికి వారాహి జత కలిసింది. జగన్ అనే అహంకారాన్ని బూడిద చేస్తుంది. ఐదు కోట్ల మంది ఆంధ్ర ప్రజలకు చెబుతున్నా.. సైకిల్ స్పీడుకు తిరుగులేదు.. గ్లాస్ జోరుకు ఎదురులేదు.. కమల వికాసానికి అడ్డే లేదు.. రాష్ట్రానికి అన్నీ మంచిరోజులే. యువత భవిష్యత్‌కు, రాష్ట్రాభివృద్ధికి తిరుగుండదు. ఎన్నికల తర్వాత జగన్‌కు చిప్పే గతి. పవన్, నేను కలిసి ఆయన్ను ఎక్కడకు పంపుతామో చూడండి' అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీ కొట్టుకు పోవడం ఖాయమని స్పష్టం చేశారు. 'చంద్రబాబు గుండె ధైర్యం ఉన్న నాయకుడు. అనుభవం ఉన్న వ్యక్తి. అభివృద్ధి కోసం పరితపించే మనిషి. ఉద్దానంలో కిడ్నీ సమస్యపై చంద్రబాబుకు చెబితే 24 గంటల్లోనే నిపుణులతో సంప్రదించి పరిష్కార మార్గాన్ని చూపారు. అటువంటి పట్టుదల, నైపుణ్యం, అనుభవం ఉన్న వ్యక్తి రాష్ట్రానికి అవసరం' అని జనసేనాని పవన్ కల్యాణ్ చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు, నిడదవోలు బహిరంగ సభల్లో వీరిద్దరూ ప్రసంగించారు. భారీ రోడ్‌షోలు నిర్వహించారు. నిడదవోలు సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి లోక్‌సభ స్థానంలో ఎన్డీయే అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి కూడా హాజరయ్యారు.

పొత్తు మా కోసం కాదు.. మీ కోసమే: చంద్రబాబు

'అనుభవం ఉన్న నేను.. తపన ఉన్న పవన్ కల్యాణ్, దేశాన్ని నంబర్ వన్ చేయాలన్న మోదీ చేతులు కలిపాం. రాష్ట్ర భవిష్యత్ కోసం పొత్తు పెట్టుకున్నాం. మా కోసం కాదు. ఇది ఐదు కోట్ల ఆంధ్ర ప్రజల కోసం. పవన్‌పై వ్యక్తిగత దాడులు చేసినా సరే నిలబడ్డారు. నేను కష్టాల్లో ఉన్నప్పుడు వచ్చి బేషరతుగా మద్దతు ప్రకటించారు. మన సంకల్పానికి కేంద్ర సహకారం అవసరం. అందుకే తెలుగుదేశం, బీజేపీ, జనసేన కలిసి వచ్చాయి. యువత కన్నెర్ర చేస్తే జగన్ లండన్‌కు పోతాడు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు ప్రతి క్షణం అభివృద్ధి కోసం పరితపించాం. రాజధాని అమరావతిని తీసుకొచ్చాం. ప్రతి ఎకరానికి సాగునీరు ఇవ్వాలని పోవలరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేశాం. 18 కేంద్ర విద్యా సంస్థలు తీసుకొచ్చాం. పేదలకు వంద సంక్షేమ పథకాలు అమలు చేశాం. యువతకు ఉద్యోగాలు కల్పించాం. మళ్లీ జాబు రావాలంటే కూటమి గెలవాలి. కూటమి రావాలంటే ప్రతి ఒక్కరూ 30 రోజులు పనిచేయండి. రాష్ట్రంలో 175 అసెంబ్లీ సీట్లు, 25 పార్లమెంట్ స్థానాలను గెలిపించాలి అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో విధ్వంసకర పాలన కావాలా.. అభివృద్ధి చేసే పాలన కావాలా? సంక్షేమ పాలన కావాలా.. సంక్షోభ పాలన కావాలా? ఉద్యోగాలు లభించే పాలన కావాలా.. ఉన్మాద పాలన కావాలా? దారుణమైన రహదారులు కావాలా.. రహదారి భద్రత కావాలా? అప్పులు కావాలా.. సంపద సృష్టించే ప్రభుత్వం కావాలా? రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి మే 13న ఆలోచించి ఓటేయండి.. కూటమిని గెలిపించండి' అని చంద్రబాబు కోరారు. 'వలంటీర్లూ.. రాజీనామాలు చేయొద్దు.. మేం అధికారంలోకి వచ్చాక మీకు రూ.10 వేలు పారితోషికంగా ఇస్తాం. ఏటా రూ.లక్ష సంపాదించే లా వనరులు సమకూరు స్తాం. వచ్చే ఐదేళ్లలో యువతకు 20 లక్షలు ఉద్యోగాలు కల్పిస్తాం. అధికా రంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకం మెగా డీఎస్సీపైనే. కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతోపాటు బీసీలకు రక్షణ చట్టం తీసుకు వస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తాం. వృద్ధులకు, వి తంతువులకు రూ.4వేల పెన్షన్‌ను ఇంటికే అందజేస్తాం. వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ ఇస్తాం'అని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

ఉద్యోగులకు సీపీఎస్: పవన్ కల్యాణ్

'జగన్ సీఎం అయ్యాక అన్ని వర్గాలూ దెబ్బతిన్నాయి. ఆయన క్లాస్ వార్ అంటున్నాడు. క్లాస్ వార్ అంటే పేదలకు-ధనికులకు మధ్య యుద్ధం. కానీ రాష్ట్రంలో అన్ని వర్గాలను దెబ్బతీసిన వ్యక్తి జగన్. ఉద్యోగులను నిండా ముంచాడు. 73 వేల మంది పోలీసులకు సరెండర్ లీవ్‌లు, డీఏలు ఇవ్వలేదు. టీఏలు లేవు. వారిని పూర్తిగా నష్టపెట్టారు. ఉద్యోగులను మోసం చేశాడు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌పై ఆలోచించాలి. చంద్రబాబుకు ఇదే విజ్ఞప్తి చేస్తున్నా. కష్టమే అయినా సరే ఏడాదిలోగా ఉద్యోగులకు సహకారం అందించాలి. ఓపీఎస్ అమలుకు కృషి చేస్తాం. ఏ ప్రభుత్వమూ మధ్యతరగతి వర్గాన్ని పట్టించుకోవడం లేదు. ఆ వర్గాన్ని పట్టించుకునేది జనసేన. ప్రశ్నించేవాడు లేకపోతే బెదిరించేవాడిదే రాజ్యం. రాష్ట్ర భవిష్యత్ కోసం కోట్లాది మంది యువతకు ఉపాధి కల్పించడం కోసం చంద్రబాబు, నేను మా సైజు తగ్గించుకుని ఉమ్మడిగా నిలబడ్డాం. ఇది మీ భవిష్యత్ కోసమే. వైఎస్ వివేకానందరెడ్డిని చంపేసిన హంతకులను వెనకేసు కొస్తున్నారు. ఇంట్లో వారికి రక్షణ లేదు. సొంత చెల్లెళ్లకు రక్షణ లేదు. సొంత చెల్లెలినే గోడకువేసి కొట్టినోడికి మన ఆడబిడ్డలెంత?' అని పవన్ ప్రశ్నించారు.

టీడీపీకి అధికారుల 'ముందస్తు' శుభాకాంక్షలు

అమరావతి: రాష్ట్రంలో గాలి మారుతోందని అఖిల భారత సర్వీసు అధికారులు గ్రహించినట్లుగా కనబడుతోంది. అందుకే స్వరం సవరించుకుంటున్నారు. మారుతున్న రాజకీయ వాతావర ణానికి అనుగుణంగా పాత సంబంధాల పునరుద్ధరణకు ప్రయ త్నాలు చేస్తున్నారు. కొద్ది రోజులుగా ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీకి చెందిన ముఖ్య నేతలకు కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికా రుల నుంచి ఫోన్లు వస్తున్నాయి. మామూలు ఫోన్ నుంచి కాకుండా ఐఫోన్లలో ఫేస్ టైం యాప్ ద్వారా కాల్ చేసి మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో వాతావరణం గమనిస్తున్నామని, రాబోయే ఎన్నికల్లో గెలు వబోతున్నారంటూ ముందస్తు అభినందనలు చెబుతున్నారు. గత వారం రోజుల్లో ముగ్గురు మాజీ మంత్రులకు అర డజను మంది అధికారులు ఫోన్లు చేశారు. తాము గమనిస్తున్న విషయాలు వారితో పంచుకుంటూ.. ఎన్నికల ప్రచారంలో టీడీపీ ఎక్కడెక్కడ దృష్టి కేంద్రీకరించాలో సలహాలు కూడా ఇస్తున్నారు.



డీజీ రాజీవ్ రతన్ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న రేవంత్‌రెడ్డి

అధికారిక లాంఛనాలతో ముగిసిన డీజీ రాజీవ్ రతన్ అంత్యక్రియలు

▸ సీఎం రేవంత్, మంత్రులు, సీఎస్, డీజీపీ, ప్రముఖుల నివాళి

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ రాజీవ్ రతన్ అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో షేక్‌పేట్ మహాప్రస్థానంలో బుధవారం నిర్వహించారు. ఆయన అంతిమ సంస్కారాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు హాజరై నివాళులర్పించారు. రాజీవ్ రతన్ కుటుంబ సభ్యులను సీఎం ఓదార్చారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, ఏసీబీ చీఫ్ సీవీ ఆనంద్, ఎన్‌పీఏ డైరెక్టర్ అమిత్‌గార్గ్, ఇతర ప్రముఖులు నివాళులు అర్పించారు. రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజ్(ఆర్ఐఎంసీ) నుంచి జాతీయ పోలీస్ అకాడమీ వరకు రాజీవ్ ప్రయాణం క్రమశిక్షణతో ఎంతో హుందాగా కొనసాగిందని డీజీపీ రవిగుప్తా గుర్తు చేసుకున్నారు. ఎన్‌పీఏలో శిక్షణ సమయంలో తోటివారి కంటే భిన్నంగా రాజీవ్ శిక్షణ తీరు ఉండేదని, ఆయన ప్రభావం తోటివారిపై ఎంతగానో ఉండేదని గుర్తుచేశారు. పోలీస్ అధికారిగా తాను సరైంది అని నమ్మిన సిద్ధాంతానికి రాజీవ్ ఎప్పుడు రాజీపడలేదన్నారు. ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయినందుకు తాను విచారిస్తున్నానని, రాజీవ్ రతన్ ఆకస్మిక నిష్క్రమణ అంత తేలికగా పూరించలేని శూన్యాన్ని మిగిల్చిందని డీజీపీ రవిగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలి ఆత్మహత్యాయత్నం

▸ మాజీ హెచ్‌ఎంతో పాటు తోటి టీచర్ల వేధింపులే కారణం

▸ వరంగల్ జిల్లా ఖానాపురంలో ఘటన

ఖానాపురం, ఏప్రిల్ 10: మాజీ హెచ్‌ఎంతో పాటు తోటి ఉపాధ్యాయుల వేధింపులు తట్టుకోలేక మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు దోమల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని బుధరావుపేట ప్రభుత్వ మోడల్‌స్కూల్‌లో బుధవారం చోటుచేసుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత ఉపాధ్యాయురాలు హారిక తన ఆవేదనను మీడియాతో పంచుకున్నారు. 'పాఠశాలకు చెందిన మాజీ ప్రిన్సిపాల్, టీజీటీ సివిక్స్ ఉపాధ్యాయుడు రాజేందర్, సహచర ఉపాధ్యాయులు డి.రాజు, మౌలాలి, సోషల్ ఉపాధ్యాయురాలు అంతా బృందంగా ఏర్పడి నన్ను టార్గెట్ చేసి వేధింపులకు గురిచేస్తున్నారు. రాజేందర్ స్కూల్‌లో నన్ను అసభ్యకరంగా ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరిస్తున్నారు. రాజేందర్ వేధింపులు తాళలేక పలువురు మహిళా టీచర్లు గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇటీవల విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారమిచ్చే నిమిత్తమై క్లాస్‌లో సెల్‌ఫోన్ తీయగా.. రాజేందర్ వీడియో తీసి, క్లాసులో ఫోన్ వినియోగిస్తున్నానని మీడియాకు సమాచారమిచ్చారు. 15 రోజుల క్రితమే ప్రిన్సిపాల్ రాజేందర్ స్థానంలో సదాకర్ బాధ్యతలు స్వీకరించారు. అయినా నాపై కోపం పెంచుకున్న రాజేందర్.. తోటి టీచర్లతో కలిసి మరింతగా వేధించసాగారు' అని వెల్లడించారు. ఈ నేపథ్యంలో మండల విద్యాశాఖ నోడల్ అధికారి స్కూల్‌ను సందర్శించి వివరాలు సేకరించారు. దీనిపై రాజేందర్‌ను వివరణ కోరగా.. తాను హారికను వేధించలేదని.. ఆమె నిరాధార ఆరోపణలు చేస్తోందని చెప్పారు.

ఎన్నికల వేళ... హోర్డింగులపై ఈసీ కొరడా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసే హోర్డింగుల విషయంలో ఈసీ కఠినంగా వ్యవహరించనుంది. ప్రచారంలో భాగంగా ఉపయోగించే పోస్టర్లు, హోర్డింగుల మీద ప్రచురణ కర్తల పేరు తప్పనిసరిగా ముద్రించాలని బుధవారం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం, ప్రచార నిమిత్తం ఉపయోగించే కరపత్రాలు, బ్యానర్ల వంటి వాటిపై ప్రచురణకర్త పేరు ముద్రించి తీరాలని, అభ్యర్థుల ఖర్చులు అంచనా వేసేందుకు కూడా ఇది ఉపయోగపడుతుందని స్పష్టం చేసింది. అధికారంలో ఉన్న పార్టీలు ప్రభుత్వ ఖర్చులతో రాజకీయ ప్రకటనలు ఇవ్వడం నిషేధమని తెలిపింది. పార్టీలు తమ ప్రకటనల్ని ముందుగానే సర్టిఫికేషన్ చేయించుకోవాలని ఆదేశించింది.

24 గంటల్లో శశిథరూర్ క్షమాపణ చెప్పాల్సిందే..

▸ కాంగ్రెస్ నేతకు కేంద్రమంత్రి చంద్రశేఖర్ లీగల్ నోటీసు

తిరువనంతపురం, ఏప్రిల్ 10: కేరళలోని తిరువనంతపురం లోక్‌సభ బరిలో నిలిచిన కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ మధ్య మాటల యుద్ధమే నడుస్తోంది. అయితే తన పరువుకు భంగం కలిగించేలా ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రకటనలు చేశారంటూ శశిథరూర్‌కు చంద్రశేఖర్ బుధవారం లీగల్ నోటీసులు పంపారు. నోటీసు అందిన 24 గంటల్లోగా తనపై చేసిన వ్యాఖ్యలను శశిథరూర్ ఉపసంహరించుకుని బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 6న ఓ టీవీ చానెల్ ఇంటర్వ్యూలో శశిథరూర్ తనపై చేసిన వ్యాఖ్యలు విని షాక్ అయ్యానని చంద్రశేఖర్ తెలిపారు. నియోజకవర్గంలో కీలకమైన ఓ వర్గానికి చెందిన పెద్దలకు డబ్బులిచ్చి ప్రలోభాలకు గురి చేస్తున్నానని.. తనపై నిరాధార ఆరోపణలు చేశారని మండిపడ్డారు.

ఆరుగురిని మింగిన రోడ్డు ప్రమాదాలు

▸ డివైడర్‌ను ఢీ కొని ఇద్దరు.. బైక్‌లను కార్లు ఢీకొని నలుగురి మృతి

▸ నాగర్ కర్నూల్, హన్మకొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఘటనలు

బిజినేపల్లి/వనపర్తి రూరల్, ఏప్రిల్ 10: రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందగా, 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటకలోని బీజాపూర్ జిల్లా రాంపూర్ గ్రామానికి చెందిన 12 మంది క్రూయిజర్ వాహనంలో శ్రీశైలం వచ్చారు. మల్లన్న దర్శనం అనంతరం మంగళవారం రాత్రి వారంతా తిరిగి వెళ్తుండగా నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లి వద్ద వీరు ప్రయాణిస్తున్న వాహనం.. నూతనంగా నిర్మిస్తున్న డివైడర్లను అతివేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో వందన(55), భారతి (44) మృతి చెందగా, మరో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నూతనంగా నిర్మిస్తున్న డివైడర్ల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్లే ప్రమాదం చోటు చేసుకుందని అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో ఘటనలో హన్మకొండ జిల్లా కాజీపేటకు చెందిన సయ్యద్ అశ్రఫ్(23), వాహిద్(23) రంజాన్ పండుగ నేపథ్యంలో వస్త్రాలు కొనుగోలు చేసేందుకు మంగళవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. వడ్డేపల్లి క్రాస్ వద్ద వీరి బైక్‌ను ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన అశ్రఫ్, వాహిద్‌లను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మహబూబ్‌నగర్ జిల్లా ధర్మాపూర్ గ్రామానికి చెందిన వెంకటయ్య(45), జడ్చర్ల మండలం ఆలూరుకు చెందిన రవికుమార్(28)లు వనపర్తి నుంచి బైక్‌పై తిరిగి వెళ్తుండగా వనపర్తి మండలం రాజపేట గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న కారు డ్రైవర్ కుక్కను తప్పించబోయి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకటయ్య, రవికుమార్‌లుఅక్కడికక్కడే మృతి చెందారు.

బీట్ ఆఫీసర్‌పై పోడుసాగుదారుల దాడి

▸ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘటన..

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



గాయపడిన వెంకన్ననాయక్

ములకలపల్లి, ఏప్రిల్ 10: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండల పరిధిలోని గుండాలపాడు పంచాయతీ చలమన్ననగర్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీవో) వెంకన్ననాయక్‌పై బుధవారం చలమన్ననగర్ గ్రామానికి చెందిన పోడుసాగుదారులు మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ దాడిలో వెంకన్ననాయక్‌కు గాయాలయ్యాయి. ఇటీవల పోడు భూములకు సరిహద్దులో అటవీశాఖ కొత్తగా చెరువు పనులు ప్రారంభించింది. ఈ విషయమై స్థానిక పోడుసాగుదారులకు బీట్ ఆఫీసర్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో విధుల్లో ఉన్న వెంకన్ననాయక్‌పై సుమారు 15 మంది పోడుసాగుదారులు కర్రలతో దాడి చేసినట్లు అటవీశాఖ ఉద్యోగులు తెలిపారు. వెంకన్ననాయక్‌కు తీవ్రగాయాలు కాగా సిబ్బంది వెంటనే పాల్వంచ ఆస్పత్రికి తరలించారు. దాడి చేసిన వారిపై అటవీశాఖాధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అధికారంపై కాంగ్రెసోళ్లకే నమ్మకం లేదు

▸ వాళ్ల కుర్చీలను వాళ్లే లాక్కుంటారు: ఎన్వీ సుభాష్

హైదరాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తమ ప్రభుత్వం పూర్తికాలం అధికారంలో ఉంటుందన్న నమ్మకం కాంగ్రెస్ పార్టీ నేతలకే లేదని, వాళ్ల కుర్చీలు వాళ్లే లాక్కుంటారని బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ ఎద్దేవా చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరువు అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే కరువు అని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌కు మద్దతు పలికారని.. ఇప్పుడు బీఆర్‌ఎస్ తరఫున గెలిచిన వారు కాంగ్రెస్‌కు మద్దతు పలుకుతున్నారని.. వారి విధానం క్విడ్ ప్రోకోను తలపిస్తోందని విమర్శించారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ విఫలమ్యాయని తెలిసిన కాంగ్రెస్‌కు.. కరువు నివారణ కోసం ముందస్తు చర్యలు తీసుకోవడంలో ఎందుకు విఫలమైందని సుభాష్ ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్, ఎంఐఎం రెండూ కలిసి బీజేపీని ఓడించాలని చూస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఎంఐఎంను పెంచిపోషించాయని మండిపడ్డారు. కాంగ్రెస్ మేనిఫెస్టో దేశ అభివృద్ధి కంటే విభజనకు రూట్‌మ్యాప్‌లా ఉందని అన్నారు.

తేమ, తాలు సాకు.. క్వింటా వడ్లకు రూ.1,551

▸ జనగామ వ్యవసాయ మార్కెట్లో వ్యాపారుల నిర్వాకం

▸ ఆగ్రహించిన అన్నదాతలు

▸ ట్రేడర్లపై కేసులు, మార్కెట్ కార్యదర్శి సస్పెన్షన్‌కు అదనపు కలెక్టర్ ఆదేశం

జనగామ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి మార్కెట్‌కు తెస్తే ఇష్టారాజ్యంగా వ్యాపారులు ధరలను నిర్ణయించడం పట్ల అన్నదాతలు భగ్గుమన్నారు. వ్యాపారులు, మార్కెట్ అధికారులు కుమ్మక్కై ధాన్యానికి తక్కువ ధర చెల్లిస్తున్నారంటూ ఆందోళనకు దిగారు. జనగామ వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం పెద్దఎత్తున వస్తోంది. బుధవారం 250 మంది రైతులు ధాన్యాన్ని మార్కెట్‌కు తెచ్చారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ధాన్యం బిడ్డింగ్ జరిపి 3 గంటలకు కాంటాలు ప్రారంభించాలి. కానీ ట్రేడర్లు సాయంత్రం 5 గంటలకు బిడ్డింగ్ నిర్వహించారు. ధాన్యంలో తేమ, తాలు సాకుతో క్వింటా ధాన్యానికి రూ.1,551, రూ.1,569, రూ.1,659 చొప్పున ధర నిర్ణయించారు. దీంతో రైతులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేస్తూ మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు నిరసనకు దిగారు. ప్రభుత్వం క్వింటాకు రూ.2,203 ధర నిర్ణయిస్తే తమకు రూ.1,500 ఇవ్వడమేంటని వ్యాపారులు, అధికారులను నిలదీశారు. మద్దతు ధర చెల్లించకుంటే ధాన్యాన్ని తగలబెడతామని హెచ్చరించారు. సమాచారం అందుకున్న అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్‌సింగ్ జనగామ మార్కెట్‌కు వచ్చి రైతులతో మాట్లాడారు. మార్కెట్ అధికారులు ఇచ్చిన ధాన్యం చీటీలపై ట్రేడర్లు రాసిన ధరలను చూసి నివ్వెరబోయారు. ట్రేడర్ల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్కువ ధర నిర్ణయించిన నలుగురు ట్రేడర్లపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, దీనిపై ఫిర్యాదు ఇవ్వాలని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు ప్రసాద్‌ను ఆదేశించారు. అలాగే రైతుల సమస్య పట్ల స్పందించడంలో నిర్లక్ష్యం వ్యవహరించిన మార్కెట్ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. రైతులు ఆందోళన చెందవద్దని, కనీస మద్దతు ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేయిస్తామని హామీ ఇచ్చారు. మార్కెట్లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి విగతా ధాన్యాన్ని కొంటామని చెప్పడంతో రైతులు శాంతించారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'సుప్రీం' చెప్పిన హక్కు

పర్యావరణ పరిరక్షణకోసం కృషిచేస్తున్న వ్యక్తులకు, సంస్థలకు మంచి ఉత్తేజాన్ని, ఊతాన్నీ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు ఉపకరిస్తుంది. వాతావరణమార్పుల వల్ల సంభవించే దుష్ప్రభావాలకు లోనుగాకుండా జీవించేహక్కు ఈ దేశపౌరుడికి ఉన్నదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టంచేయడం ఈ తీర్పులో విశేషమైన అంశం. వాతావరణమార్పులు మన నిత్యజీవితం-మీద విశేషమైన ప్రభావం చూపుతున్న నేపథ్యంలో, వాటినుంచి రక్షణపొందే హక్కు పౌరులకు ఉన్నదని సుప్రీంకోర్టు నిర్ధారించడం, దానిని ప్రత్యేక-ప్రాథమిక హక్కుగా గుర్తించడం ప్రశంసనీయమైన విషయం. రాజ్యాంగం కల్పించిన సమానత్వపు హక్కు, జీవించే హక్కుల పరిధిలోకే ఇది కూడా వస్తుందని చెప్పడం వల్ల పర్యావరణ పరిరక్షణ విషయంలో ఇక ప్రభుత్వాలు గతమంత నిర్లక్ష్యంగా ఉండలేవని చాలామంది నమ్ముతున్నారు.

మూడేళ్ళనాటి కేసులో, మార్చి 21న ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ, మొత్తం తీర్పు పాఠాన్ని మొన్న శనివారం సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంతో దానిమీద విశ్లేషణలు, చర్చలు క్రమంగా జోరందుకుంటున్నాయి. అభివృద్ధిపేరిట మానవుడు సాగిస్తున్న విధ్వంసవల్లనూ, క్లైమేట్ ఛేంజ్ కారణంగానూ అంతరించిపోతున్న అరుదైన పక్షిజాతుల్లోకి చేరిపోయిన బట్టమేకపక్షి, గడ్డి నెమలి పరిరక్షణకు ఉద్దేశించిన కేసు ఇది. గుజరాత్, రాజస్థాన్‌లలోని కొన్ని ప్రాంతాల్లో జీవించే ఈ అరుదైన పక్షిజాతుల రక్షణ-నిమిత్తం మూడేళ్ళక్రితం అక్కడ ఎత్తయిన విద్యుత్ టవర్ల నిర్మాణంమీద సుప్రీంకోర్టు నిషేధం విధించింది. సౌర, పవన విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి ఎంతగానో వీలైన, కీలకమైన ప్రాంతాలు ఇవి. సోలార్ ఎనర్జీ కంపెనీలు నిర్మించిన ఎత్తయిన టవర్లకు, విద్యుత్ సరఫరా లైన్లకు ఢీకొనడం వల్లనూ, వాటి-పరోక్షప్రభావంతోనూ ఈ పక్షులు మరణిస్తుండటంతో పర్యావరణప్రేమికులు కేసులు వేశారు. దీనితో, ఇకపై విద్యుత్‌లైన్లను భూగర్భంలోనే నిర్మించాలని, ఇప్పటికే ఉన్నవాటిని భూగర్భంలోకి మార్చాలని కోర్టు మూడేళ్ళక్రితం ఆదేశించింది. ఇది సాంకేతికంగా సాధ్యం కాదని, విపరీతమైన ఖర్చుదారీ వ్యవహారమని సదరు కంపెనీలు ఆ తరువాత కోర్టుకు నివేదించుకున్నాయి. దాని ఆదేశాలవల్ల పునర్వినియోగ ఇంధన రంగం ఎంతగా దెబ్బతినిపోతుందో చెప్పుకొని బావురుమన్నాయి. దీనికితోడు, మూడు కేంద్రప్రభుత్వ మంత్రిత్వశాఖలు వాటిపక్షాన కోర్టులో ఆ తీర్పుమీద తమ అభ్యంతరాలను, అభ్యర్థనలను దాఖలుచేశాయి. దీనితో ఇప్పుడు న్యాయస్థానం విద్యుత్ తరలింపునకు భూగర్భంలో వేసిన కేబుల్స్ మాత్రమే వాడాలన్న తన గత ఆదేశాలు స్వచ్ఛ ఇంధన లక్ష్యాల సాధనలో భారత్ వెనుకబాటుకు కారణమవుతాయని గుర్తించింది. తన గతకాలపు ఆదేశాలను పూర్తిగా ఉపసంహరించుకొని ఈ ప్రాంతాల్లో అరుదైన పక్షిజాతుల రక్షణ, టవర్లు, కేబుల్స్ నిర్మాణంతో ముడిపడిన స్వచ్ఛ ఇంధనవృద్ధి విషయంలో ఏం చేయాలో చెప్పమంటూ ఓ నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది.

సౌరవిద్యుత్ మీద నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధపెడుతూండటం, అదానీ, అంబానీ సహా బడా కార్పొరేట్ సంస్థలు ఇప్పుడు సౌరవిద్యుత్ రంగంలో పెట్టుబడులు పెడుతూండటం, దేశవ్యాప్తంగా విస్తరిస్తూండటం తెలిసిందే. స్వచ్ఛ ఇంధనం పేరుతో సాగుతున్న ఈ వ్యవహారం పర్యావరణానికి ఏ మేరకు మేలుచేస్తుందన్నది అటుంచితే, సర్వోన్నతన్యాయస్థానం గతంలో తాను ఇచ్చిన తీర్పును ఇప్పుడు సవరించుకుంటూనే పర్యావరణానికీ, మనిషి మనుగడ హక్కుకూ మధ్య సంబంధం విషయంలో నాలుగు మంచిమాటలు చెప్పింది. పునర్వినియోగ ఇంధనం దేశానికి ఎంతో అవసరమని చాలాలెక్కలు, లక్ష్యాలు, అంతర్జాతీయ ఒప్పందాలు ఏకరువుపెడుతూనే స్వచ్ఛమైన పర్యావరణం లేకపోతే సమానత్వ హక్కు, జీవించే హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని వివరించింది. పర్యావరణమార్పులకు సంబంధించి భారతదేశంలో ఓ చట్టం లేదన్న విషయాన్ని గుర్తుచేస్తూ, చట్టంలేనంతమాత్రాన దుష్ప్రభావాలనుంచి భద్రంగా ఉండే హక్కు భారతీయులకు లేకపోలేదని హెచ్చరించింది. ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించడానికి ప్రజలకున్న ప్రాథమిక హక్కును కాపాడాలన్నది సందేశం. పర్యావరణ పరిరక్షణ ఎవరో కొంతమంది ఉద్యమకారులకు పరిమితమైన వ్యవహారం కాదని, అది ప్రభుత్వాల విధి అంటున్న ఈ తీర్పు పాలకులను కదిలిస్తుందని ఆశిద్దాం.

యూపీ వద్దని ఎందుకు పారిపోతున్నావ్, రాహుల్?



"రాజకీయ వాదులు మాట్లాడితే జవాబు చెబుతాం, కన్సల్టెంట్ల మాటలకు చెప్పేదేముంటుంది?" అంటోంది కాంగ్రెస్. తాజాగా ప్రశాంత్ కిశోర్ (పీకే) లోక్‌సభ ఎన్నికల ఫలితాల మీద చెప్పిన అంచనాలను, పనిలో పనిగా కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీకి చేసిన వడ్డింపులను కాంగ్రెస్ ప్రతినిధి ఆ విధంగా తేలికగా తీసిపారేశారు. ఎవరు చెప్పారన్న దాన్ని పక్కకు పెట్టి, ఏమి చెప్పారన్న-దాన్ని పరిశీలనకు తీసుకుంటే తప్పేమీ లేదు. 'వినదగు నెవ్వరు చెప్పిన' అన్న సుభాషితం కాంగ్రెస్ నాయకత్వానికి పరిచయమో లేదో తెలియదు.

రాజకీయాలలో వృత్తి వ్యూహనిపుణుల ఉనికి మీద, ఎవరు ఎక్కువ కిరాయి ఇస్తే, వారి గెలుపు కోసం పనిచేయడం మీద ఎవరికీ గౌరవం ఉండనక్కరలేదు కానీ, ఆ తరహా పనిమంతులు రంగంలో స్థిరపడ్డారని, కొనసాగుతారని గుర్తించాలి. అమెరికా అధ్యక్ష ఎన్నికలలో, పార్టీ అభ్యర్థిత్వ పోటీల దగ్గర నుంచి వేషం, భాష, అన్నిటికీ ఈ తరహా నిపుణులే ఎప్పటినుంచో దర్శకత్వం వహిస్తున్నారు. క్షేత్రస్థాయి నుంచి రాజకీయాలలో తలమునకలై పనిచేసేవారి కంటె ఈ సర్వేయర్లకు, సెఫాలజిస్టులకు, టాక్టీషియన్లకు ఎక్కువ తెలుసునా అన్న ప్రశ్నలో కొంత న్యాయముంది కానీ పూర్తి ఆచరణాత్మకత లేదు.

ప్రశాంత్ కిశోర్ విజయాలు ఎన్ని ఉన్నా, 2014లో మోదీని అధికారానికి తెచ్చిన ప్రచార నిర్వహణ వాటన్నిటిలో కలికితురాయి. నిజానికి, భారతీయ జనతాపార్టీకి వెనుక ఉన్న రకరకాల బలాలను దృష్టిలో పెట్టుకుంటే, బయటినుంచి సలహాదారులు ఇమడడం, విజయవంతంగా పనిచేయడం ఎంతో కష్టం. ఇప్పుడు, కన్సల్టంట్ల మాటలను పట్టించుకోనక్కరలేదంటున్న కాంగ్రెస్ పార్టీ కూడా ప్రశాంత్ కిశోర్ సేవలను కొనుగోలు చేసింది. ఇండియా కూటమిలో భాగమైన ఆప్, డీఎంకె, టీఎంసి పార్టీలు కూడా పీకే సేవలు తీసుకున్నాయి. ఆయనతోనే పనిచేసి బయటకు వచ్చిన సునీల్ కనుగోలు అనే మరో వృత్తి వ్యూహనిపుణుడి సేవలను కూడా కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలోను, తెలంగాణలోను వినియోగించుకుని, విజయవంతమైన ఫలితాలను సాధించింది. మధ్యప్రదేశ్‌లోను, రాజస్థాన్‌లోను తలపండిన కాంగ్రెస్ నాయకులకు ఈ సునీల్ వ్యూహం మేరకు పనిచేయడం రుచించలేదని, అందువల్ల ఆ రెండు రాష్ట్రాలకు వృత్తినిపుణత అందుబాటులోకి రాలేదని విన్నాము. అక్కడ వచ్చిన ఫలితాలేమో ప్రతికూలంగా ఉన్నాయి. 2017లో పంజాబ్‌లో ఫలితమిచ్చిన ప్రశాంత్ కిశోర్ నైపుణ్యం, ఉత్తరప్రదేశ్‌లోను, ఉత్తరాఖండ్‌లోను పనికిరాలేదు. ఆ తరువాత కొంతకాలం ఆయన సొంత రాజకీయాల అన్వేషణ ప్రారంభించి భంగపడ్డారు. రాష్ట్రాల వారీగా కాంగ్రెస్‌ను గెలిపించడం కంటె, ఆ పార్టీని పునాదుల నుంచి పునర్నిర్మించడమే ఉత్తమం అని భావించి, 2024 ఎన్నికలనాటికి అనుసరించవలసిన ఒక వ్యూహాన్ని పీకే నిర్మించారు. కాంగ్రెస్ పెద్దలు ఆ ప్రెజంటేషన్‌ను ఆసక్తిగా తిలకించారు. కలసి పనిచేద్దామని చెప్పారు. గ్రాండ్ ఓల్డ్ పార్టీ కదా, కాంగ్రెస్‌లో నిర్ణయాలు ఒక పట్టాన తెమలవు. కార్పొరేట్ సంస్థలలో మాదిరి వేగంగా తేల్చేయడం కుదరదు. ప్రశాంత్ కిశోర్‌ను ఏదో ఒక ఉన్నతస్థాయి బృందంలో సభ్యుడిని చేసి, సేవలను పొందాలనుకున్నారు. నిజానికి, ఆయన పార్టీలో భాగమై పార్టీకి అంకితమై పనిచేద్దామనుకున్నారు. కాంగ్రెస్ తనకు పెద్ద పదవి ఇచ్చి నెత్తి మీద కూర్చోబెట్టుకుంటుందని ఆశించారు. అది కుదరలేదు. నా సంగతి వదిలేయండి, నేను చెప్పిన సలహాలనన్నా పాటించండి అని పీకే గంభీరంగా చెప్పి వెనక్కి వచ్చేశారు.

2024 ఎన్నికల్లో కూడా ఓడిపోతే గనుక, ఇక మీరు కొంతకాలం తప్పుకుని వేరేవారికి నాయకత్వం అప్పగించండి, అని రాహుల్ గాంధీని ఉద్దేశించి ప్రశాంత్ కిశోర్ ఇచ్చిన సూచన, కాంగ్రెస్ పార్టీకి ఉక్రోషం తెప్పించి ఉంటుంది. పేరుకు ఖర్గేయే కాంగ్రెస్ అధ్యక్షులు, కానీ, వ్యవహారమంతా రాహుల్ గాంధీ చేతిమీదే నడుస్తోంది కదా అని పీకే అన్న మాటలో అసత్యం లేదు. దిద్దుకోవాలంటే ఎవరో ఒకరు ఆ మాట అనాలి కదా? యూపీలో పోటీచేయకుండా పారిపోయి, వైనాడ్‌లో యుద్ధం చేస్తే ఏమి ఉపయోగం? ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ వదిలేసి, మణిపూర్, మేఘాలయ తిరుగుతావేమిటి? గడచిన ఐదేళ్లలో మోదీ తమిళనాడుకు ఎన్నిసార్లు వెళ్లాడో చూశావా? నీకు ఎందుకు పట్టుదల లేదు?.. ఇటువంటి ప్రశ్నలన్నీ రాహుల్‌కు, కాంగ్రెస్‌కు గురిపెట్టి పీకే చికాకు పెట్టారు.



■ కె. శ్రీనివాస్

సందర్భం

తన మాట వినలేదని, తనకు పెద్దపీట వేయలేదని ప్రశాంత్ కిశోర్‌కు కొంత కోపం కూడా ఉండి ఉండవచ్చు. కానీ, ఆయన చెబుతున్నవి ఆలోచించదగ్గవే. గడచిన రెండు ఎన్నికలలో ఏయే రాష్ట్రాలలో బీజేపీ విజయాలు సాధించలేకపోయిందో, ఆ తరువాత వాటి మీద బీజేపీ ప్రత్యేకంగా దృష్టి పెట్టి పనిచేస్తూ వచ్చింది. దక్షిణ, తూర్పు రాష్ట్రాలలో ఉండిన ప్రతికూల పరిస్థితులను చాలా వరకు బీజేపీ అధిగమించగలుగుతుందని పీకే అంటున్నారు. 2019 ఎన్నికలలో ఉత్తర, మధ్య పశ్చిమ భారతాలలో పతాక స్థాయి విజయాలను పొందిన బీజేపీ, ఈ సారి వాటిలో తరుగునే తప్ప, మరింత పెరుగుదలను ఆశించలేదు. అక్కడ ఏర్పడే అవకాశం ఉన్న కొరతను భర్తీ చేసుకోవడానికి సాంప్రదాయికంగా, తనకు అనువుగాకుండా ఉన్న దక్షిణ, తూర్పు రాష్ట్రాల మీద బీజేపీ ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. అది మంచి ఫలితాలు ఇవ్వబోతోందని ఆ వ్యూహనిపుణుడు అభిప్రాయపడుతున్నారు. తమిళనాడు, కేరళల్లో ఓటుశాతంలోను, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, బెంగాల్‌లలో సీట్లసంఖ్యలోను బీజేపీకి మంచి బలం సమకూరుతుందని, అది ఉత్తరాది నష్టాలకు పరిహారంగా పనికి వస్తుందని ప్రశాంత్ కిశోర్ అంటున్నారు. ఏపీలో ఎన్డీయేకు మంచి సానుకూలత ఉన్నదని అన్నారు. ఇంత చేసి కూడా బీజేపీకి 370 స్థానాలు రావడం కష్టమని తేల్చారు. కానీ, ఈ జోస్యాలు నిజమవుతాయని చెప్పలేమని, దక్షిణాదిలో బీజేపీకి కొంత ఓటు శాతం పెరగడమో, నామమాత్రంగా సీట్లు పెరగడమో జరగవచ్చును తప్ప, ఇప్పుడున్న స్థితి నుంచి ఆ పార్టీ పెద్దగా ఎగువకు వెళ్లజాలదని ఇతర పరిశీలనలు చెబుతున్నాయి. కీలకంగా చెబుతున్న ఈ ఏడు దక్షిణ, తూర్పు రాష్ట్రాలలో మొత్తం 192 లోక్‌సభ స్థానాలున్నాయి. వీటిలో 55 స్థానాలను మాత్రమే గత ఎన్నికలలో బీజేపీ గెలుచుకోగలిగింది. అందులో 25 కర్ణాటకలోనే లభించినవి. ఈ సారి కూడా ఆ స్థానాలలో గెలిచి, ఒడిశాలో బలం పెంచుకోగలిగితే, నామమాత్రపు ఎదుగుదల ఉంటుంది. బెంగాల్‌లో గతంలో కంటె ఎక్కువ సీట్లు వచ్చే అవకాశాన్ని అనేక క్షేత్రస్థాయి పరిశీలనలు అంగీకరించడం లేదు.

మరి కాంగ్రెస్, హిందీ బెల్ట్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నం ఎందుకు చేయడం లేదు? గుజరాత్‌కు చెందిన నరేంద్రమోదీ 2014లోనే వారణాసిలో కూడా పోటీచేసినప్పుడు, తన సొంతరాష్ట్రంలో పోటీచేయడానికి రాహుల్ గాంధీకి కలుగుతున్న సంకోచం ఏమిటి? దక్షిణాది రాష్ట్రాలు అనువుగా ఉన్నాయని చెప్పి అక్కడే తలదాచుకుంటే, దేశనేత ఎట్లా అవుతారు? అసెంబ్లీ ఎన్నికలను గెలవడానికి సర్వశక్తులు ధారపోసిన కర్ణాటక కాంగ్రెస్, ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలలో ఎందుకు చతికిలపడుతున్నట్టు కనిపిస్తోంది? అగ్రనాయకత్వం మాత్రం ఎందుకు కర్ణాటకను పట్టించుకోకుండా వదిలేస్తున్నది? కర్ణాటకలో గత ఎన్నికల్లో 28కి 27 సాధించిన బీజేపీ కూటమి, ఈసారి కూడా ఆ దరిదాపుల్లోనే గెలుపు సాధిస్తుందని అనుకుంటున్నారు. ముఖాముఖీ పోటీ ఉన్న చోట, గట్టి ప్రయత్నం చేస్తే, తన బలం పెరగడం, బీజేపీ బలం తగ్గడం అన్న రెండు ప్రయోజనాలు సిద్ధిస్తాయి. తెలంగాణలో బీజేపీ మొదటి లేదా రెండో స్థానంలో ఉంటుందని పీకే చెప్పిన మాటను ఇతర విశ్లేషకులు నిరాకరిస్తున్నారు. ఒకవేళ రెండో స్థానంలో వచ్చినా, అది కొన్ని జిల్లాలకే పరిమితం అని, తెలంగాణ అంతటికీ విస్తరించగల బలం ఆ పార్టీకి లేదని చెబుతున్నారు. ఇప్పటి వరకు అయితే, తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల వాతావరణం ప్రాంతీయ అంశాల చుట్టూనే తిరుగుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పూర్తిస్థాయిలో ప్రచారంలోకి దిగినప్పుడు కానీ, స్పష్టత రాదు.

> గుజరాత్‌కు చెందిన నరేంద్రమోదీ 2014లోనే వారణాసిలో కూడా పోటీచేసినప్పుడు, తన సొంతరాష్ట్రంలో పోటీచేయడానికి రాహుల్ గాంధీకి కలుగుతున్న సంకోచం ఏమిటి? దక్షిణాది రాష్ట్రాలు అనువుగా ఉన్నాయని చెప్పి అక్కడే తలదాచుకుంటే, దేశనేత ఎట్లా అవుతారు?

ఎంతటి బలశాలి అయిన పార్టీ అయినా సరే, అజేయమైనది కాదని, ఒడుపుతెలిసి పోరాడితే గెలవవచ్చునని ప్రశాంత్ కిశోర్ అంటారు. వృత్తినిపుణుడిగా ఆ అంశాన్ని నమ్మడం, ప్రచారం చేయడం ఆయనకు అవసరం. కానీ, కష్టపడితే ఫలితం ఉంటుందని, చరిత్రలోని అనేక కఠినమైన సందర్భాలను సమాజాలు అధిగమించగలిగాయని తెలుసుకోవడానికి లోకజ్ఞానం చాలు. కాంగ్రెస్ పార్టీలో పరాజిత మనస్తత్వానిది పైచేయిగా ఉంటోందా? 370 బీజేపీ అందుకోలేనప్పుడు, దాన్ని మరికొంత దిగువకు లాగగలిగే కనీసవ్యూహమేదో ప్రతిపక్షాలకు ఉండాలి కదా?

రాహుల్ గాంధీ నిజంగానే అనాసక్తయోగంలో ఉంటేగనుక, దాని భారం ప్రజలెందుకు మోయాలి? ధరలు, నిరుద్యోగం, ఆర్థిక అంతరాలు, ఆశ్రిత కుబేరులు, నిరంకుశత్వం, దమనకాండ, వనరుల అపహరణ, మనుగడల ఆక్రమణ ఇన్ని బండరాళ్లను ఏ జనరంజకత్వంలోనో, మతంమత్తులోనో భరించడానికి సిద్ధంగా లేమని ప్రజలు స్పష్టంగా ఇస్తున్న సంకేతాలను గుర్తించని ప్రతిపక్షం ఎందుకు?

> కాంగ్రెస్ పార్టీలో పరాజిత మనస్తత్వానిది పైచేయిగా ఉంటోందా? 370 బీజేపీ అందుకోలేనప్పుడు, దాన్ని మరికొంత దిగువకు లాగగలిగే కనీసవ్యూహమేదో ప్రతిపక్షాలకు ఉండాలి కదా? రాహుల్ గాంధీ నిజంగానే అనాసక్తయోగంలో ఉంటే గనుక, దాని భారం ప్రజలెందుకు మోయాలి? ధరలు, నిరుద్యోగం, ఆర్థిక అంతరాలు, ఆశ్రిత కుబేరులు, నిరంకుశత్వం, దమనకాండ, వనరుల అపహరణ, మనుగడల ఆక్రమణ ఇన్ని బండరాళ్లను ఏ జనరంజకత్వంలోనో, మతంమత్తులోనో భరించడానికి సిద్ధంగా లేమని ప్రజలు స్పష్టంగా ఇస్తున్న సంకేతాలను గుర్తించని ప్రతిపక్షం ఎందుకు?

ధరణి మార్పులో ఎందుకీ తాత్సారం?

ధరణి పోర్టల్ వలన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నివృత్తి చేసేందుకు కొత్త ప్రభుత్వం ముందుకెళుతోంది. ముఖ్యమంత్రి, వారి మంత్రివర్గ సహచరులు, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు, సిసిఎల్ఎ వంటి ఉన్నత స్థాయి అధికారులు అధికారికంగా క్యాబినెట్ నిర్ణయాలలో భాగంగా ధరణి పోర్టల్‌లో సమూల మార్పులు తీసుకురావాలని నిర్ణయించారు. ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తర్వాతి నుంచి అందులోని లోపాలను ప్రజలకు ఎత్తి చూపుతూ గత ప్రభుత్వ హయాం నుంచి కూడా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల ద్వారాను, వివిధ రకాల సభలు, సమావేశాలు, టీవీ డిబేట్ల ద్వారాను, సోషల్ మీడియాలోను తరచుగా మాట్లాడుతున్న వారిని, రెవెన్యూ శాఖలో పనిచేసిన వారిని ప్రజా ప్రతినిధులతో కలిపి ఒక కమిటీగా ఏర్పాటు చేశారు. వీరు కూడా పలు దఫాలుగా సమీక్షలు, సమావేశాలు జరుపుతున్నట్లు మీడియా ద్వారా తెలుస్తున్నది. కానీ వివిధ సందర్భాల్లో చేసిన చర్చలకు, రాసిన వ్యాసాలకు అనుగుణంగా కమిటీ పనులు ముందుకు సాగడం లేదనిపిస్తోంది. ఈ కమిటీకి ఎంతమేరకు పని చేసే అధికారాలు ఇచ్చారనేది తెలీదు. రాష్ట్రంలో భూమికి కొలతలు వేసి ప్రతి ఇంచు భూమికి బాధ్యత వహిస్తూ ఖచ్చితమైన లెక్క తీయాలని అనుకున్నారు. కానీ అది జరిగే సూచనలు కనపడటం లేదు.

కేసీఆర్ ప్రభుత్వం దిగిపోవడానికి చాలా కారణాలలో ధరణి కూడా ముఖ్యమైన పాత్ర నిర్వహించిందని మరిచిపోరాదు. కాంగ్రెస్ కూడా అదే కొనసాగిస్తే ఈ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుంది. ఒకటి నుండి 35 వరకు మాడ్యూల్స్ (టీఎమ్ 1 నుంచి టీఎమ్ 35 వరకు) తీసుకువచ్చారు. ఇన్ని ఎందుకు అవసరమో ఎవరూ చెప్పలేకపోతున్నారు. కొన్ని మాడ్యూల్స్ కేవలం కొన్ని సమస్యల గుర్తించడానికి పనికి వస్తున్నాయి. ఒక్కో సమస్యకు ఒక్కొక్క టీఎమ్ ద్వారా పరిష్కారం లభించాలి. కానీ చాలా మందికి ఏ మాడ్యూల్ వలన ఏ ప్రయోజనం జరుగుతుంది అనేది అవగాహన లేదు. ప్రతి పనికి రూ.1100 వసూలు చేశారు.

కొత్త ప్రభుత్వం ఇప్పుడు వాటి పని పద్ధతులను బ్రేక్ చేసి తహసీల్దారు గారికి, రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డిఓ) గారికి, జాయింట్ కలెక్టర్ గారికి కొన్ని పనులు కొన్ని బాధ్యతలు కేటాయించారు. ఆదేశాలు ఉన్నప్పటికీని ఇంతవరకు ఎవరికీ లాగిన్ పాయింట్ నిర్ణయాధికారాలు రాలేదు. దరఖాస్తులు అన్నీ పై స్థాయిలోనే ఉంటున్నాయి. కిందిస్థాయి సిబ్బంది లేరు, పంచాయతీ సెక్రటరీ, వ్యవసాయ విస్తరణ అధికారి పొలాన్ని చూడగలరు కానీ రెవెన్యూపరమైన విచారణ నివేదిక ఇవ్వలేరు. రెవిన్యూ శాఖ నుంచి డిప్యూటీ తహసీల్దారులు కూడా ఒక టీమ్‌గా తీసుకున్నారు.



కేసీఆర్ ప్రభుత్వం దిగిపోవడానికి చాలా కారణాలలో ధరణి కూడా ముఖ్యమైన పాత్ర నిర్వహించిందని మరిచి పోరాదు. కాంగ్రెస్ కూడా అదే కొనసాగిస్తే ఈ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుంది. గ్రామీణ ప్రజలకు, వ్యవసాయం చేసుకునే వారికి, ధరణి పోర్టల్ బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలను బట్టే మంచి ఫలితాలు అందుతాయి.

ఇకపోతే మాడ్యూల్స్‌వారీగా అసైన్‌మెంట్ భూమి సహా అన్ని రకాల విరాసతులకు, స్పెషల్ జీపీఏ, జీపీఏ, భూ సంబంధిత ఖాతాలను మర్జ్ (సమన్వయం) చేయటం వంటివి తహసీల్దారుకు అప్పజెప్పారు. వ్యవసాయేతర భూములకు, చట్టబద్ధంగా భూసేకరణ చేసిన భూములకు, విదేశీయులు కొనుగోలు చేసిన భూముల లావాదేవీలకు, కొత్త పాస్ పుస్తకాలకు, కోర్టు వ్యాజ్యాలు, ముఖ్యంగా ధరణిలో నమోదు కాని పట్టా భూముల విస్తీర్ణం దిద్దుబాట్లు... ఇవన్నీ ఆర్‌డీఓ స్థాయి అధికారులు చూడాలి. మ్యుటేషన్లు, నిషేధిత భూముల జాబితా కలెక్టర్ ఆధీనంలో ఉంచారు. భూమి విలువ స్థానిక సబ్ రిజిస్టర్ ధర ఆధారంగా ఐదు లక్షల వరకు ఒక స్థాయి అధికారికి, అంతకంటే ఎక్కువ ఖరీదు చేసే భూములకు కలెక్టర్ సమక్షంలో సమస్యను చూడమని సూచనలు వచ్చాయి.

విచారణ నివేదికలు వాటిపై నిర్ణయం తీసుకుని ధరణి పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేయాలంటే కంప్యూటర్ ముందు కూర్చుని తహసీల్దార్ లేదా రెవెన్యూ డివిజన్ అధికారి తన బయోమెట్రిక్ లాగిన్ ద్వారా సవరణలు చేయటానికి అధికారాలు బదిలీ కావలసి ఉంది. ఈ ప్రక్రియ మొదలు కాకముందే గడువు ముగిసిపోతుంది.

పట్టా భూములు, అసైన్‌మెంట్ భూములు, చెరువులు, కుంటలు, పోరంబోకు, గ్రామకంఠం అసైన్‌మెంట్, సీలింగ్, వక్ఫ్, భూదాన భూములు, దేవుడి భూములు అన్నీ బయటికి వస్తాయని అన్ని సందర్భాలలో అనుకున్నదే. అంతే కాదు, విలువైన ప్రభుత్వ భూములను నిషేధిత జాబితా నుంచి తీసి పట్టాలుగా మార్చి లావాదేవీలు జరిగినట్లు పలు సందర్భాలలో అనుకున్నాం. అవి బయటికి రావాలి. ఇంతవరకు ధరణి సంబంధిత సాఫ్ట్‌వేర్ లేదా ప్రధాన సర్వర్ నడుపుతున్న సంస్థ ఇండియా నుండి ఆపరేట్ అవుతుందా అన్నది కూడా ప్రధాన ప్రశ్న, అది ఇక్కడే ఉందా ఉంటే హైదరాబాదులోని ఎన్.ఐ.సి (నేషనల్ ఇన్ఫర్మేటివ్ సెంటర్) వద్ద ఉంచితే అది మన ఆధీనంలో ఉంటుంది. లేదంటే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంటుంది.

గ్రామీణ ప్రజలకు, వ్యవసాయం చేసుకునే వారికి, ధరణి పోర్టల్ బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలను బట్టే మంచి ఫలితాలు అందుతాయి. ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. కమిటీలతో కాలయాపనలు చర్చలు ఫలితాలు ఇవ్వవు. ఎంత చెప్పినా వినని కేసీఆర్ ప్రభుత్వాన్ని చూసాం, వినలేదని ప్రజలే వద్దనుకున్నారు. మీరు ఏదో చేస్తారని అనుకోకపోయినా కొంత చేస్తారని భరోసాతో అన్ని వర్గాల ప్రజలు కలిసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరి తెచ్చుకున్నారు. మీరూ గత ప్రభుత్వం లాగే చేస్తే ప్రజలకు మేలు జరగకపోగా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి మనుగడ కూడా కష్టమే అవుతుంది.

■ వి. బాలరాజు
తహసీల్దారు రిటైర్డు

ఫూలే వాయిస్

ఆగిపోవడానికి
నేను తోపుడు బండిని, రైలు కూతను కాను
ఎండిపోవడానికి
చెరువును కాను, చేనును కాను
అలిగిపోవడానికి అల్లున్ని గాను
నేను అస్తిత శ్వాసను!

నా ఆశయాలు
తెప్పల్లా తేలిపోయే పడవలు కావు
విస్మృతులు విజేతలుగా నిలిచేదాక
కర్తవ్యాన్ని నిలబెట్టే మహాసంకల్పాలు
సమతా పూలతో పులకించిపోవాలి

నా సహచరి
సావిత్రిబాయి మొక్కపోని ధీరత్వం
నావెంటేకాదు
కఠిన చీకట్లకెదురీది లక్ష్యం వెంబటే నడిచిన సాహసి
పనిలోను నిద్రలోను నలుగురిలోనూ
కిందికులాల అక్షర కిరణాలకై కలత
అభాగ్యుల ఆకలి ముద్దకు
పొయ్యిలో కట్టెలా మాడి బువ్వమెతుకైంది
క్షయవ్యాధి పీడితులకు చేయూతై నడిచింది

మిత్రులారా
నా పట్ల గాని సావిత్రిబాయి పట్లగానీ
సానుభూతి చినుకులొద్దు పూలమాలల జోహార్లొద్దు
పూలు పుయ్యాల్సిన మట్టిమీద
చాదస్తాల దురాచారాలు పరుచుకున్నవి!
ఆత్మగౌరవ స్వరమై
గులాంగిరిని వదిలి సత్యశోధక్‌ను తలకెత్తుకో!

— వనపట్ల సుబ్బయ్య

(నేడు జ్యోతిరావు ఫూలే జయంతి)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com


కాళేశ్వరానికి ఒక పాత రష్యన్ ప్రాజెక్ట్ గుణపాఠం

ప్రపంచంలోనే అతి పెద్ద భారీ నీటి ఎత్తిపోతల ప్రాజెక్టుకు దాదాపు 75 సంవత్సరాల క్రితం పూర్వపు సోవియట్ యూనియన్‌లో అంకురార్పణ జరిగింది. కానీ సుదీర్ఘకాలం (దాదాపు 30 సంవత్సరాల పాటు) దీని సాధ్యాసాధ్యాల గురించి అధ్యయనాలు చేయించి ప్రణాళికలు రూపొందించడానికే దాదాపు నాలుగు బిలియన్ అమెరికన్ డాలర్లు (ప్రస్తుత విలువ ప్రకారం రూ.35వేల కోట్లు) ఖర్చు చేసిన అనంతరం 1986లో ఈ ప్రాజెక్టును పూర్తిగా నిలిపివేశారు. ఆ తర్వాత ఈనాటి వరకు అలాంటి అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టును ఏ దేశమూ నిర్మించాలన్న ఆలోచనే చేయలేదు. కానీ 2015లో గత బీఆరఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ఆనాటి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేసి కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును ప్రారంభించి ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టుగా చెప్పుకుంది. కానీ నిర్మించిన అతికొద్ది కాలంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు సమాజానికి ఎలాంటి ప్రయోజనాలను ఇవ్వకుండానే సాంకేతిక సమస్యలతో తాత్కాలికంగా నిలిపివేయబడింది. రాబోయే కాలంలో కాళేశ్వరంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకునే ముందు, పూర్వపు సోవియట్ యూనియన్ ప్రారంభ దశలోనే నిలిపివేసిన భారీ ఎత్తిపోతల ప్రాజెక్టు అనుభవాలను పరిగణలోకి తీసుకుంటే మంచిది.

పూర్వపు సోవిట్ యూనియన్ దక్షిణ భాగంలో ఉన్న ప్రస్తుత సెంట్రల్ ఏషియా ప్రాంతంలో వ్యవసాయానికి అనుకూలంగా ఉన్న సారవంతమైన భూములు, 75శాతం జనాభా ఉన్నప్పటికీ కేవలం 16శాతం నీటి లభ్యత మాత్రమే ఉండేది. అదేవిధంగా పూర్వపు సోవియట్ యూనియన్ ఉత్తర భాగంలో ఉన్న ప్రస్తుత ఉక్రెయిన్, బెలారస్, యూరోపియన్ ప్రాంతంలో ఉన్న కేవలం 25శాతం జనాభాకి దాదాపు 84శాతం నీటి వనరుల లభ్యత ఉండేది. కాబట్టి ఈ విధమైన జల వనరుల వైవిధ్యం, జనాభా వైవిధ్యం ఉన్న సోవియట్ యూనియన్‌లో నీటి లభ్యత అధికంగా ఉన్న దిగువ ఉత్తర ప్రాంతం నుండి ఎగువన నీటి కొరత ఉన్న దక్షిణ ప్రాంతానికి భారీ ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా నీటిని తరలించాలని సోవియట్ యూనియన్ ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనికి అనుగుణంగా 1940వ దశకం చివరి కాలంలో ఎం.ఎం. దేవిడోవ్ అనే నీటిపారుదల ఇంజనీర్ ఈ భారీ ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా ఉత్తరాన దిగువ ప్రాంతంలోని మిగులు నదీ జలాలను దక్షిణాన సాగునీటి ఎద్దడి ఉన్న మెట్ట ప్రాంతానికి తరలించడానికి ప్రణాళికను రూపొందించారు. ఎం.ఎం. దేవిడోవ్ ప్రణాళిక ప్రకారం ఉత్తరాన ఉన్న సైబీరియన్ ఓబి మరియు యెన్నిసి నదుల నుంచి దక్షిణాన ఉన్న అరల్, కాస్పియన్ సీ, అజోవ్ సరస్సులకు నీటిని మరలించడం ప్రధాన అంశం. ఈ ప్రణాళికను అనుసరించి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని మరలించడానికి భారీ నుంచి అతి భారీ డ్యాములు, రిజర్వాయర్లు అవసరపడ్డాయి. దీనికి అదనంగా, 1950వ దశకం చివరి కాలంలో, భారీ ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని మరలించడానికి మరో ప్రతిపాదనను ముందుకు తీసుకొచ్చారు. ఈ ప్రతిపాదన ప్రకారం పూర్వపు సోవియట్ యూనియన్ ఉత్తర భాగంలోని పెచోరా, వైచేంగడా నదుల నుంచి దక్షిణ భాగంలో గల కాస్పియన్ సీ అనే అతిపెద్ద సరస్సులోకి నీటిని మరలించడం. దీన్నిబట్టి చూస్తే ఈ భారీ ఎత్తిపోతల ప్రాజెక్టును రెండు భాగాలుగా విభజించినట్టు తెలుస్తుంది. మొదటిది యూరోపియన్ భాగం అనగా పూర్వపు సోవియట్ యూనియన్‌లోని ఉత్తరాన ఉన్న ప్రస్తుత ఉక్రెయిన్, బెలారస్, ఇంకా యూరోపియన్ ప్రాంతం నుంచి దక్షిణాన ఉన్న సెంట్రల్ ఏసియా, కజకిస్తాన్ ప్రాంతాలకు సుమారు 4 అమెరికన్ బిలియన్ డాలర్ల ఖర్చుతో ప్రాజెక్టులు నిర్మించి 674 టిఎంసిల నీటిని మరలించడం. రెండవది సైబీరియన్ భాగం అనగా సైబీరియన్ ఓబి, ఎనీసి నదుల నుండి అరల్, క్యాస్పియన్, అజోవు లాంటి సరస్సులకి 53 బిలియన్ డాలర్ల ఖర్చుతో 960 టిఎంసిల నీటిని 130 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోస్తూ సుమారు 2200 కిలోమీటర్ల దూరం అతి భారీ ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, సొరంగ మార్గాలు, గ్రావిటీ కెనాల్స్ నిర్మించి వాటి ద్వారా నీటిని మరలించడం. ఈ భారీ నదీ జలాల మరలింపు ప్రాజెక్టు కోసం మొత్తంగా 60 బిలియన్ అమెరికన్ డాలర్లు (దీని ప్రస్తుతం విలువ రూపాయలు ఐదు లక్షల కోట్లతో సమానం) ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే 1960వ దశకం ప్రారంభంలో ఈ భారీ ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని మరలించడం అసాధ్యమని భావించి కొంతకాలం ఈ నిర్ణయాన్ని అటకెక్కించారు.

> గత సోవియట్ ప్రభుత్వపు అనుభవాలను పరిశీలించినట్లయితే, కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇంకా అదనపు పెట్టుబడులు పెట్టి ముందుకు తీసుకెళ్లినట్లయితే ఇది కేవలం వృథా ప్రయాస తప్ప సమాజానికి ఎలాంటి ఉపయోగం ఉండదని అర్థమవుతుంది. తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధికి కాళేశ్వరం ప్రాజెక్టు ఆర్థికంగా ఒక పెద్ద అడ్డుగోడగా నిలిచే ప్రమాదం ఉంది.

ఆ తర్వాత కొన్నేళ్ళకు అనగా 1960 దశకం చివర్లో మళ్లీ ఈ భారీ నీటి వనరుల మరలింపును లియోనిడ్ బ్రిజినవ్ అధ్యక్షునిగా ఉన్న సోవియట్ ప్రభుత్వం తెరపైకి తీసుకువచ్చి 1970వ సంవత్సరంలో ఈ సంక్లిష్టమైన ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రతిపాదనలకు అనుమతి తెలిపింది. ఆ తర్వాత 1976లో ఈ భారీ నదీ జలాల తరలింపు సాధ్యాసాధ్యాలపై శాస్త్రీయ అధ్యయనాలు జరపాల్సిందిగా వివిధ సంస్థలను సోవియట్ ప్రభుత్వం కోరింది. తదనుగుణంగా పదవ పంచవర్ష ప్రణాళిక కాలం అనగా 1976–80 మధ్యకాలంలో దాదాపు 120 ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అధ్యయన సంస్థలు, నిపుణులు వివిధ అంశాలపై దాదాపు పదేళ్లపాటు అధ్యయనం కొనసాగించారు. ఈ అధ్యయనాల కోసమే నాలుగు బిలియన్ల అమెరికన్ డాలర్లు (ప్రస్తుత విలువ రూపాయలు 32 వేల కోట్లు) ఖర్చు చేశారు. ముఖ్యంగా ఈ పరిశోధనలు భారీ ఎత్తిపోతల ప్రాజెక్టు



నిర్మాణంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలు, ఆర్థిక భారం, నిర్మాణం పూర్తయిన తర్వాత నిర్వహణ వ్యయం, సమాజానికి వచ్చే లాభం లాంటి వంటి కీలకమైన అంశాలపైన నిర్వహించారు. ఆ తర్వాత ఆయా పరిశోధన సంస్థలు పరిశోధించిన అధ్యయనాల నివేదికలను పంచవర్ష ప్రణాళిక బోర్డుకి సమర్పించారు. తర్వాత 11వ పంచవర్ష ప్రణాళిక (1981–85) ప్రారంభ కాలంలో కూడా ఈ పరిశోధనలను కొనసాగించారు.

ఆ తర్వాత 1984 అక్టోబర్‌లో కమ్యూనిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ ప్లీనరీ సమావేశంలో ఈ భారీ నదీ జలాల ఎత్తిపోతల పథకం గురించి విస్తృతంగా చర్చ జరిపి ముసాయిదాను రూపొందించారు. ఈ ముసాయిదా ప్రకారం భారీ నీటి ఎత్తిపోతల ప్రాజెక్టు మొదటి దశలో భాగంగా యూరోపియన్ ప్రాంతం నుండి నదీ జలాల మరలింపును 2000 సంవత్సరం నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా సోవియట్ ప్రభుత్వం పెట్టుకుంది. రెండవ భాగమైన సైబీరియన్ నది నుంచి నీటిని ఎత్తిపోసే ప్రాజెక్టు విషయంలో ఏ విధమైన పురోగతి జరగలేదని ముసాయిదాలో పేర్కొనబడింది. ఆ సమయంలోనే సోవియట్ నాయకత్వంలో మార్పు వచ్చి మైకేల్ గేర్ బచావో 1984లో సోవియట్ యూనియన్ నాయకత్వ పగ్గాలను చేపట్టారు. ఈ నూతన నాయకత్వం సోవియట్ భారీ నదీ జలాల మరలింపు ప్రణాళికకు సంబంధించిన అన్ని అధ్యయన సంస్థలు, నిపుణులు నివేదికలలోని అంశాలను పూర్తిస్థాయిలో విశ్లేషించి చివరికి 1986లో ఈ భారీ నదీ జలాల మరలింపు ప్రాజెక్టు శాస్త్రీయంగా అసాధ్యమని, ఆర్థికంగా భారమని, పర్యావరణానికి ముప్పని తేల్చి చెప్పారు. అంతేకాకుండా ఈ భారీ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి సామాన్య ప్రజలు, మేధావులు, శాస్త్రవేత్తల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఆ తర్వాత కమ్యూనిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ, మంత్రి మండలి అధికారికంగా ఈ భారీ ఎత్తిపోతల ప్రాజెక్టును విరమిస్తున్నట్లు, 12వ పంచవర్ష ప్రణాళికలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అంశాలను తొలగించినట్లు ప్రకటించడం జరిగింది. అనంతరం 1986లో సోవియట్ యూనియన్ ప్రభుత్వం ఈ భారీ నదీ జలాల మరలింపు ప్రణాళికను పూర్తిస్థాయిలో విరమించుకుంది. ఈ భారీ నీటి ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా దక్షిణ సోవియట్ మెట్ట ప్రాంతానికి సాగునీరు అందించడం ముఖ్య ఉద్దేశం అయినప్పటికీ, ఈ ప్రాజెక్టుకి అయ్యే ఖర్చు కంటే ఈ ప్రాజెక్టు ద్వారా సాగులోకి వచ్చే నూతన ఆయకట్టు ద్వారా వచ్చే సంపద చాలా తక్కువగా ఉండటం ఈ ప్రాజెక్టుని నిలిపివేయడానికి ప్రధాన కారణం. అంతేకాకుండా పూర్వపు సోవియట్ యూనియన్ భవిష్యత్తు అభివృద్ధికి ఈ భారీ ఎత్తిపోతల ప్రాజెక్టు అయ్యే ఆర్థిక భారం ఒక పెద్ద అడ్డుగోడగా నిలుస్తుందని భావించారు.

కావున గత సోవియట్ ప్రభుత్వపు అనుభవాలను పరిశీలించినట్లయితే, కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇంకా అదనపు పెట్టుబడులు పెట్టి ముందుకు తీసుకెళ్లినట్లయితే ఇది కేవలం వృథా ప్రయాస తప్ప సమాజానికి ఎలాంటి ఉపయోగముండదని అర్థమవుతుంది. అంతేకాకుండా తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధికి కాళేశ్వరం ప్రాజెక్టు ఆర్థికంగా ఒక పెద్ద అడ్డుగోడగా నిలిచే ప్రమాదం ఉంది. కావున ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై సమగ్ర శాస్త్రీయమైన పరిశోధనలు జరిపి ముమ్ముందు ఆర్థిక వనరులను ప్రాజెక్టుపై వెచ్చించాలా లేదా అనే నిర్ణయాన్ని తీసుకొని ముందుకు పోవాలి.

● ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య
వ్యవసాయ ఆర్థికవేత్త



సమన్వయమే సవాల్!

- కాంగ్రెస్‌లో కడియంతో కలిసిరాని ఆశావహులు, దిగువ కేడర్
- కడియం కావ్య.. తమ అవకాశాలకు గండి కొట్టారని నిర్వేదం
- శ్రీహరిపై 'గులాబీ ఫండ్' మరకలు
- రేవూరికి పార్లమెంటు బాధ్యతలపై పాత నేతల కినుక
- కొండా, నాయినిలను విస్మరించారని అనుచరుల అలక
- సీఎం రేవంత్‌రెడ్డి బుజ్జగించినా తగ్గని అసంతృప్తి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని' చందంగా మారింది కడియం శ్రీహరి కాంగ్రెస్ రాజకీయ ప్రయాణం. కాంగ్రెస్ అధిష్ఠానం ఫుల్‌సపోర్టు చేస్తూ ఆయన కూతురికి వరంగల్ ఎంపీ టికెట్ ఇచ్చింది. కానీ, ఏ మాత్రం రాజకీయ అనుభవం లేని కావ్యను తమపై బలవంతంగా రుద్దారనే భావనలో ఉన్న కేడర్.. ఆమె రాకతో తమ అవకాశాలకు గండిపడిందని పలువురు ఆశావహులు తీవ్ర నిర్వేదంలో ఉన్నారు. అంతేకాదు ఎన్నో ఏళ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా ఉంటున్న మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కాదని, ఎన్నికల ముందు పార్టీలో చేరిన పరకాల ఎమ్మెల్యేకు పార్లమెంట్ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వటంపై కూడా కేడర్ నారాజ్ అవుతోంది. మరోవైపు బీఆర్ఎస్ నుంచి ఫండ్ తీసుకుని కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యారనే ఆరోపణలు కూడా కడియం శ్రీహరికి మచ్చలా మారుతున్నాయి. అయితే ఈ పరిణామాలను గమనించిన సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి కడియంతో సయోధ్య కుదిర్చేందుకు చేసిన ప్రయత్నాలు అంతగా ఫలించలేదన్న చర్చ జరుగుతోంది. ఇన్ని పరిణామాల నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల వేళ కాంగ్రెస్ అధిష్ఠానానికి సమన్వయం ఓ సవాల్‌గా మారనుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కావ్యతో కలవని కేడర్

కాంగ్రెస్ వరంగల్ ఎంపీ టికెట్ కోసం 42 మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో చాలా మంది కాంగ్రెస్ కోసం అనేక త్యాగాలు చేసిన వారు, పార్టీకి వీరవిధేయులు ఉన్నారు. కొందరైతే ఏకంగా తమ ప్రభుత్వ ఉద్యోగాలు కూడా వదులుకుని.. కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే ప్రధానంగా సీనియర్ నేతలు దొమ్మాటి సాంబయ్య, శనిగపురం ఇందిరలలో ఒకరికి టికెట్ దాదాపు ఖాయమనే ప్రచారం జరిగింది. అయితే అనూహ్యంగా వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ఖరారైన కడియం కావ్య తన తండ్రి స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి కాంగ్రెస్‌లో చేరటమే కాకుండా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా జాక్‌పాట్ కొట్టేశారు. దీంతో కాంగ్రెస్ టికెట్‌పై ఆశలతో ఉన్న నేతలు, వారి అనుచర వర్గంలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. రాజకీయంగా ఎలాంటి అనుభవం లేని కావ్యను తమపై బలవంతంగా రుద్దారని కేడర్ మదనపడుతోంది. ఆయా ఏరియాల్లోని కాంగ్రెస్ వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాలో కడియం ఎపిసోడ్‌పై నిరసనలు వైరల్ అవుతున్నాయి. కనీసం టికెట్ ఆశించిన ముఖ్య నేతలతో చర్చించకుండా ఏకపక్షంగా కావ్య పేరు ఖరారు చేయటంతో తామెందుకు సహకరించాలనే తిరుగుబాటు ధోరణి అటు నేతల్లోనూ, ఇటు కార్యకర్తల్లోనూ కనిపిస్తోంది. పేరుకు అభ్యర్థి కావ్య అయినప్పటికి బాధ్యతలు మొత్తం కడియం శ్రీహరి తన భుజస్కందాలపై వేసుకున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరి ఇళ్లకు వెళ్లి తన కూతురును ఆశీర్వదించాలని కోరుతున్నారు. కొందరు మొహమాటానికి సరే అని చెప్పిన, వెనుక మాత్రం ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కావ్యకు కొందరు ఎమ్మెల్యేలతో పాటు కేడర్ నుంచి పూర్తిస్థాయి సహకారం అనుమానమేనన్న ప్రచారం జరుగుతోంది.



ఇటీవలి ఉమ్మడిజిల్లా సమీక్షలో సీఎంతో నేతలు

కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ ఫండ్ ఆరోపణలు

తొలుత బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం కావ్య పేరును మార్చి 13న ఆ పార్టీ అధినేత ప్రకటించారు. దీంతో కడియం శ్రీహరి బీఆర్ఎస్ ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహించటమే కాకుండా ప్రచారానికి కావాల్సిన ఏర్పాట్లను కూడా చేసుకున్నారు. ఈ క్రమంలోనే పార్టీ.. పార్లమెంట్ ఎన్నికలకు కావాల్సినంతా డబ్బులను ఫండ్ రూపంలో శ్రీహరికి అప్పగించిందనే ప్రచారం జరుగుతోంది. అయితే గులాబీ ఫండ్ చేతికి వచ్చిన తరువాతే కారు దిగు కాంగ్రెస్‌లో చేరారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు సరపడా ఫండ్ అంటే భారీ మొత్తంలోనే

మిగతా 7వ పేజీలో..

సమన్వయం సాధ్యమేనా..?

లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో కాంగ్రెస్‌లో సమన్వయం ఓ సవాల్‌గా మారింది. కడియం కావ్య అభ్యర్థిత్వంపై కేడర్‌తో పాటు కొందరు ఎమ్మెల్యేల్లో ఉన్న అసంతృప్తిని తగ్గించడానికి కడియం శ్రీహరి సూచన మేరకు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ఓ సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలతో పాటు ఇద్దరు, ముగ్గురు టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు కూడా హాజరయ్యారు. కావ్యను గెలిపించాలని సీఎం చెప్పిన మాటలకు సరేనన్న నేతలు బయటకు వచ్చిన తర్వాత గెలుపు బాధ్యతలను తమ భుజస్కంధాలపై వేసుకునేందుకు ముందుకు రావటం లేదన్న చర్చ జరుగుతోంది. జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖను మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా నియమించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి ఎలాంటి బాధ్యతలు ఇవ్వకపోవటంతో కేడర్‌ను, లీడర్‌ను సమన్వయం చేసేది ఎవరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసిన స్టేషన్‌ఘనపూర్‌కు చెందిన టీపీసీసీ కార్యదర్శి శనిగపురం ఇందిరా ఇప్పటికే కడియంకు సహకరించేది లేదం టూ ప్రకటనలు ఇస్తున్నారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి కొండా సురేఖ మెదక్ ఎంపీ స్థానంపై దృష్టిపెట్టి అటు వైపే ఎక్కువ ఫోకస్ చేస్తున్నారు. మిగతా నియోజకవర్గాల్లో కడియం సహకారం అంతంతే అనే చర్చ జరుగుతోంది. ఇక పాతికేళ్లకు పైగా రాజకీయాల్లో చక్రం తిప్పిన శ్రీహరి తన కుమార్తె రాజకీయ భవిష్యత్తు కోసం... తనపై పడిన గులాబీ ఫండ్ మరక కనుమరుగు చేసుకోవడంతో పాటు సొంత పార్టీలో అసంతృప్తులను సమన్వయం చేసుకోవడంలో ఏ మేరకు విజయవంతమవుతారన్న చర్చ జరుగుతోంది.





అశ్రప్ మృతదేహం (ఫైల్)

వాహిద్ మృతదేహం (ఫైల్)

పండుగకు దుస్తులు కొనేందుకు వెళుతూ..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి
- కలెక్టరేట్ వద్ద బైక్‌ను ఢీకొన్న కారు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 10: రంజాన్ పండుగ సందర్భంగా నూతన వస్త్రాలను కొనుగోలు చేసుకునేందుకు వెళుతున్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని కారు వేగంగా ఢీకొనడంతో మరణించారు. ఈ సంఘటన హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని వడ్డెపల్లి క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

కాజీపేటకు చెందిన సయ్యద్ అశ్రప్(23), వాహిద్(23) అనే ఇద్దరు యువకులు ఐటీఐ పూర్తి చేశారు. మరో రెండు రోజుల్లో రంజాన్ పండుగ ఉండడంతో వరంగల్‌కు దుస్తులు కొనేందుకు బుధవారం అర్ధరాత్రి 2గంటల సమయంలో ద్విచక్రవాహనంపై కాజీపేట నుంచి బయలుదేరారు. కాగా, అదే సమయంలో పోచాల సచిన్‌నేత్ర అనే వ్యక్తి కారులో హనుమకొండ నుంచి కాజీపేట మార్గంలో వెళుతున్నాడు. వడ్డెపల్లి క్రాస్ వద్దకు రాగానే కారుతో వేగంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో క్షతగాత్రులను 108లో ఎంజీఎంకు తరలించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు యువకులు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఇద్దరు యువకుల మృతి వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. అశ్రప్ తండ్రి సలీం హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఈ విషయాన్ని సీఐ సత్యనారాయణరెడ్డి ధ్రువీకరించారు.

మండే ఎండలో విధులా?

- మధ్యాహ్నం 1గంట వరకు పారిశుధ్య సిబ్బందికి పనులు
- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్

7

హెల్త్ ఇన్సూరెన్స్‌లో నయా మోసం

- ఏజెంట్లతో కుమ్మక్కై ఓ ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యం కక్కుర్తి
- 18నెలల్లో రూ.2.67లక్షల స్వాహా

జాతి భవష్యత్ కోసం మాదిగలు ఏకమవ్వాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

కాజీపేట జంక్షన్, ఏప్రిల్ 10: మాదిగ జాతి భవిష్యత్ కోసం మాదిగలంతా కంకణ బద్దులు కావాలని, రాజకీయంగా మాదిగల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్న పార్టీలకు బుద్ధి చెబుదామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. వరంగల్ లోక్‌సభ స్థానంలో మాదిగలకు జరుగుతున్న అన్యాయంపై మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు వీవీ వెంకటరత్నం అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ.. మాదిగల హస్తిత్వాన్ని కాపాడుకోవడానికి సమాజంలో మేధావి వర్గమైన న్యాయవాదుల పాత్ర కీలకంగా ఉంటుందని, అందుకు మాదిగ లాయర్లంతా తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని కోరారు. మతపరంగా అందరికీ వివిధ విశ్వాసాలు ఉంటాయని, మత విశ్వాసాలను మార్చుకోవచ్చన్నారు. కానీ కులం మారదని ఆయన గుర్తు చేశారు. దేశంలోకి క్రైస్తవం రాకముందు మనమంతా మాదిగలమే కదా అని అన్నారు. మాదిగల్లో కూడా వివిధ రాజకీయ పార్టీల సానుభూతి పరులుంటారని, రాజకీయాలు మారినా కులం మారదని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ హిందువు అయినప్పటికీ తాను హిందువునని ఎప్పుడూ చెప్పుకోలేదని, తాను ఓబీసీని అంటారని అన్నారు. దేశంలో ప్రధానమంత్రులుగా వ్యవహరించిన వారందరూ అగ్రకులాలకు చెందిన వారేనని, మొదటిసారిగా నరేంద్రమోదీ మాత్రమే ఓబీసీ వర్గానికి చెందిన వారని అన్నారు. మాదిగలు ఏ పార్టీలో ఉన్నప్పటికీ ఆ పార్టీలకు రాజీనామా చేయమనడం లేదని, మాదిగ జాతి ప్రయోజనాలను కాపాడుకునేందుకు బీజేపీకి ఓటు వేయమంటున్నానని అన్నారు. కేసీఆర్ మంత్రివర్గంలో తాటికొండ రాజయ్యను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశాక 9 యేళ్లు మాదిగ మంత్రి లేకుండానే పాలన కొనసాగించారన్నారు. ఉమ్మడిజిల్లాలో మాదిగల అస్థిత్వం ప్రమాదంలో పడిందన్నారు.

మత రాజకీయాలు పక్కనబెట్టి వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా అరూరి రమేష్‌ను గెలిపించడంపైనే మాదిగలు దృష్టి పెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామంటున్నారని ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారానికి పూనుకుంటున్నాయని, బీజేపీ ప్రభుత్వంపై ఏ విమర్శ చేయలేని స్థితిలో ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారానికి పూనుకున్నాయన్నారు. పేదల సంక్షేమంపై నిబద్ధత గల ప్రధాని నరేంద్ర మోదీ రిజర్వేషన్లు ఎత్తేసే అవకాశం లేదని మందకృష్ణ మాదిగ వివరించారు. మాదిగల వర్గీకరణ మొదలుకొని దేశ భవిష్యత్ గురించి ఆలోచించేది నరేంద్రమోదీ మాత్రమేనన్నారు. ఈ సమావేశంలో మాదిగ లాయర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ అమృతరావు, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షు డు మాతంగి రమేష్‌బాబు, వరంగల్ జిల్లా అధ్యక్షు డు కొంగర పూర్ణచందర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాగభూషణం, హనుమకొండ అధికార ప్రతినిధి మంద సుభాష్, వరంగల్ అధికార ప్రతినిధి గోపికరాణి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిర్ణయాలతో ఎండుతున్న పంటలు

- 5 వేల క్యూసెక్కుల నీరు సముద్రం పాలు
- ఎకరానికి రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలి
- కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపెల్లి వినోద్‌కుమార్



గోపాల్‌పూర్‌లో ఎండిన వరి పంటలను పరిశీలిస్తున్న బోయినపెల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్


ఎల్కతుర్తి, ఏప్రిల్ 10: సాగు నీటి సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల పంటలు ఎండిపోయి రైతులకు కడుపు కోత మిగిలిందని మాజీ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, కరీంనగర్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బోయినపెల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామంలో దేవాదుల కాలువ ఆయకట్టులో ఎండుతున్న వరి పంటలను ఆయన మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్‌లతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగితే మిడ్ మానేరు, వరుద కాలువలు నింపడానికి అడ్డంకిగా మారింది కానీ.. మేడిగడ్డకు దిగువన ఉన్న దేవాదుల లిఫ్టుకు అడ్డంకి ఎక్కడుందన్నారు. గోదావరి నదిలో నిత్యం నీరు ప్రవహిస్తున్నా విద్యుత్ బిల్లు వస్తోందని దేవాదుల పంపింగ్ చేయని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వమని విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నాయకుల అనాలోచిత నిర్ణయంతోనే తెలంగాణ వెనుక పడిందన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా జలకళ సంతరించుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో గోదావరి నది నుంచి 5వేల క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతోందన్నారు. పంపింగ్‌కు కావలసినంత నీరు ఉన్నప్పటికీ ధర్మసాగర్ రిజర్వాయర్ ఎందుకు నింపలేదని ప్రశ్నించారు. ముందు చూపుతో ఆలోచిస్తే దేవాదుల పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తి ధర్మసాగర్ రిజర్వాయర్ నింపినట్లైతే పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చేది కాదన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టును అడ్డుపెట్టుకుని కేసీఆర్‌ను బదునాం చేయడానికి రైతులకు కడుపు కోత మిగుల్చుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. రైతులు అధైర్య పడవద్దని, బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కేవలం గోపాల్‌పూర్ గ్రామ శివారులో సుమారు 200 ఎకరాలకు పైగా వరి పంటలు ఎండిపోయాయన్నారు. వరి పంట ఎండిన రైతులకు ఎకరాకు రూ. 25 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో దేవాదుల కాలువ ద్వారా ధర్మసాగర్ రిజర్వాయర్ నింపి ఉత్తర కాలువ ద్వారా ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించామన్నారు. కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తే వ్యవసాయ బావుల్లో సైతం భూగర్భ జలాలు పెరిగి సాగు నీటికి ఇబ్బంది లేకుండా పోయిందన్నారు. అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని నమ్మించిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఆ ఊసెత్తడం లేదన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, ఎల్ఎస్‌సీఎస్ చైర్మన్ శ్రీపత రవిందర్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు కడారి రాజు, రైతు సంఘం నాయకుడు హింగె భాస్కర్, నాయకులు ఎల్తూరి స్వామి, రాజేశ్వర్‌రావు, కార్తీక్, ప్రతాప్‌రెడ్డి, కొమురయ్య, శ్రీనివాస్‌రెడ్డి, చదిరం నగేష్, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నేడు ఈద్ ఉల్ ఫిత్ర్

- నెలవంక దర్శనంతో రంజాన్ సందడి
- నమాజ్ కోసం ఈద్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు
- ముగిసిన 30రోజుల కఠిన ఉపవాస దీక్షలు



హనుమకొండ రాగన్నదర్వాజ మసీదు వద్ద కనిపించిన నెలవంక

మహబూబాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గత నెల 11న నెలవంక దర్శనంతో 12వ తేదీ నుంచి ప్రారంభమైన రంజాన్ ఉపవాసాలు సమాప్త మయ్యాయి. బుధవారం నెలవంక దర్శనంతో సుమారు 30రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలను పాటించిన ముస్లింలు గురువారం ఈదుల్‌ఫిత్ర్ (రంజాన్)ను జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు అన్నిచోట్ల బుధవారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.30 గంటల మధ్య నెలవంక దర్శనంతోనే మసీదులలో సైరన్‌లు మోగించి గురువారం రంజాన్ జరుపుకొంటున్నట్లు ప్రకటించారు. ఇక ఎండల తీవ్ర దృష్ట్యా ఉమ్మడి జిల్లాలోని వివిధ మసీదులలో ఆయా ప్రాంతాలను బట్టి ఉదయం 8.30 నుంచి 9.30 వరకు నమాజ్‌లు జరుపుతుండగా.. ఈద్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మత సామరస్యం, భక్తిభావం...

పవిత్ర మాసం రంజాన్ సందర్భంగా ముస్లింలు.. నెల రోజుల పాటు ఉపవాసాలు ఉండి పేదల ఆకలి గుర్తెరుగుతూ ఆపై రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకుంటారు. మత సామరస్యానికి, భక్తి భావానికి ప్రతీకగా నిలిచే విశిష్టమైన శుభప్రదమైన రంజాన్ మాసానికి స్వాగతం పలకడానికి షాబాన్ మాసం నుంచే అన్ని విధాల సిద్ధపడి ఉంటారు. చంద్రదర్శనాన్ని బట్టి ఉపవాసాలు 29 లేదంటే 30 రోజుల పాటు కొనసాగుతాయి. గతేడాది 29రోజుల దీక్షలు కొనసాగగా.. ఈ ఏడాది 30 రోజులు జరిగాయి. 'రమ్జ్' అంటే అరబిక్ భాషలో 'కాలడం' అని అర్థంగా పెద్దలు విశ్లేషిస్తారు. ఈ 30 రోజుల ఉపవాస దీక్షలో శరీరాన్ని సుష్కింపజేయడం ద్వారా ఆత్మప్రక్షాళనతో సర్వపాపాలు సమసిపోతాయని ముస్లింల విశ్వాసం. ఆ క్రమంలోనే అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అదుపులో ఉంటాయని.. దీనికి తోడు

మిగతా 8వ పేజీలో..

శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సురేఖ

వరంగల్ కల్చరల్ : రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లింలకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ ఉపవాస దీక్షలు, ఖురాన్ పఠనం, పేదవారికి దానం లాంటివి జీవితం పట్ల సానుకూల దృక్పథాన్ని కలిగిస్తాయన్నారు. ముస్లింల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అల్లా దయతో రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

బుధవారం ఉష్ణోగ్రత	గరిష్ఠం : 36.5° C	కనిష్ఠం : 23.5° C

WANTED TEACHERS

Applications are invited from Qualified and Experienced Teachers with Excellent Communication Skills for 1st to 10th Class

- High School Teachers for all Subjects - Salary upto 50,000/-
- Primary School Teachers for all Subjects - Salary upto 30,000/-
- IIT & NEET Foundation:- Maths, Physics, Chemistry & Biology - Salary upto 50,000/-
- PET's (M/F) must stay in Residential - Salary upto 30,000/-
- Computer Teachers, Tutors (10) & Wardens (10) (Male & Female) Salary upto 20,000/-
- Non Teaching Staff: Accountant, వంట మనుషులు, బట్టలు ఉతికేవారు, జనరల్ వర్కర్స్ కావలెను (ఉచిత భోజనం మరియు వసతి కల్పించబడును)

Interview & Demo on 11th, 12th & 13th of April 2024, 10.00 am to 5.00 pm

Disney Land Residential School (E/M)
Oglapur, Damera, Hanumakonda. Cell: 7659980002, 98497 85506.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

సహజ నారపట్టు ప్రదర్శన మరియు విక్రయం

12 నుండి 17 ఏప్రిల్

చీరలు | వస్త్రాలు | దుస్తులు | హోమ్ లెనిన్ | యాక్సిసరీస్

తాజా వివాహ సేకరణలు

ధృవీకృత శ్రేష్ఠమైన పట్టు ఉత్పత్తుల తయారీదార్లచే దేశం నలుమూలల నుండి ఒకేచోట బనారస్, కాంచీపురం, బీహార్ తాస్సార్, గుజరాత్, బంధిని & పటోలా, పశ్చిమ బెంగాల్ బైలు, హ్యాండ్ పెయింటెడ్ చీర, ధాకాయ్ జమ్దానీ, పైథాని, చందేరి, ఏరి (అహింస) చీర, షిబోరి & అజ్రాక్ ప్రింట్, హ్యాండ్ కలంకారి, డ్రెస్ మెటీరియల్ & మరెన్నో చేనేతదారులు అద్భుతాలు ప్రదర్శించబడును.



UP TO 50% DISCOUNT BY WEAVERS

హోటల్ హరిత కాకతీయ
నక్కలగుట్ట, హనుమకొండ, వరంగల్
సెల్ : 9441987009 | అన్ని డెబిట్ & క్రెడిట్ కార్డ్‌లు స్వీకరించబడతాయి | ప్రవేశం ఉచితం

Economy Classified Display COLOUR CLASSIFIED DISPLAY

ఆంధ్రజ్యోతి లో ప్రకటన ఇవ్వండి - అధిక ప్రచారం పొందండి

బ్లాక్ & వైట్ స్క్వేర్ సెం.మీ. Rs.170/-


ప్రతి మంగళవారం & శుక్రవారం కలర్ స్క్వేర్ సెం.మీ. మాత్రమే Rs. 220/-

సింగిల్ మరియు డబుల్ కాలమ్స్ మాత్రమే...

వివరాలకు సంప్రదించగలరు

హన్మకొండ : 9985411677, 9985411676,
వరంగల్ : 9985406150, 9985408173
జనగామ : 9866431354, మహబూబాబాద్ : 9985418040
తొర్రూరు : 9985408003 జయశంకర్ : 9985401232

SUMMER FAMILY ENTERTAINER నేడే చూడండి



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.00,9.30

ఈశ్వర్ 70ఎంఎం - అత్తాపూర్ 11.00,2.30,6.00,9.30
శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.30,2.30,6.30,9.30
సంగీత్ 70ఎంఎం - ఆర్.సి.పురం 11.00,2.30,6.00,9.15
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15

నేడు కేయూలో పూలే జయంతి సంబురాలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 10: మహాత్మజ్యోతిరావు పూలే 197వ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 11వ తేదీ ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయ దూరవిద్య ప్రాంగణంలోని పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వర్సిటీ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ విచ్చేస్తారని, అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి బోధన, బోధనేతర సిబ్బంది పరిశోధకులు,విద్యార్థులు పాల్గొనాలని ఆయన కోరారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసుల దాడులు


మహదేవపూర్‌లో ఓ ఇంట్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 10: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పలువురు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు బుధవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. లైసెన్సు లేకుండా ఫైనాన్స్ వ్యాపారం చేయడమే కాకుండా అధిక వడ్డీకి రుణాలు ఇస్తున్న వారి ఇళ్లను సోదాలు చేసినట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో వేంనూరి వెంకటరెడ్డి, సూరారం గ్రామంలో నాగిళ్ల మనోజ్ కుమార్ ఇళ్లను తనిఖీ చేసి విలువైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. లైసెన్సులు లేకుండా ఫైనాన్స్ దందా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

కాటారంలో..

కాటారం : అధిక వడ్డీలు, తనఖాలు పెట్టుకుని అప్పులు ఇచ్చే వారి ఇళ్లపై పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. మండల కేంద్రంలో కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు నేతృత్వంలో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు అభినవ్, నరేష్, మహేందర్, హరిశేఖర్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడి సోదాలు చేసి పలు విలువైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. అధిక వడ్డీలకు అప్పులిస్తున్న వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. వీరిలో పలువురిపై కేసులు నమోదు చేస్తున్నట్లు సీఐ నాగార్జునరావు తెలిపారు.

నేడే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.15,2.30,6.30,9.30
శివశక్తి 70ఎంఎం - కాప్రా 11.15,2.30,6.00,9.30
అర్జున్ 70ఎంఎం - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30
మేఘా 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00

రేపే బ్రహ్మాండమైన విడుదల



అల్లి 70 - సంఘీనగర్ 11.00,2.00,6.00,9.00
లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్ 11.30 am
జెమిని 70 - మంచిర్యాల 11.00,2.00,6.00,9.00
సాయి డీలక్స్ - నర్సాపూర్ 11.00,2.00,6.00,9.00
SRI LAKSHMI GAYATRI FILMS 9391176659

రేపే బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ 11.00,2.00,6.00,9.00
ఇంద్రనాగేంద్ర 70 - కర్మన్‌ఘాట్ 6.00pm
తార్నాక - జిసివిల్ 6.00pm
మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 6.00pm
వెంకటరమణ పద్మావతి - కాచిగూడ
GLOBAL CINEMAS RELEASE

నేడే బ్రహ్మాండమైన విడుదల




సప్తగిరి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
MYTHRI THEATRES జగదాంబ 70 - ఘట్‌కేసర్ 11.30,2.30,6.30,9.30
First Air Conditioned theatre with Dolby atmos in hyderabad (Single Screen)
రాజధాని 70 - దిల్‌సుఖ్‌నగర్ 2.30,9.30
కుమార్ - కాచిగూడ 11.30,2.30,6.30,9.30
అంజలి - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00
ఇంద్ర పద్మావతి 70 - కాచిగూడ 2.30pm
MYTHRI MOVIE DISTRIBUTORS LLP

రేపే బ్రహ్మాండమైన విడుదల



వెంకటేశ్వర 70 - గుమ్మడిదల 11.00,2.00,6.00,9.00
లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్
మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట
SHIVA SAI FILMS 9030161717

ADVENTUROUS BLOCKBUSTER నేడే చూడండి



సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
రాజధాని 70 ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్ 11.30,6.30
సినీటౌన్ ఇంద్ర నాగేంద్ర 70 ఎంఎం - కర్మన్‌ఘాట్ 2.15 pm
MYTHRI MOVIE DISTRIBUTORS LLP

సమన్వయమే సవాల్!

(5వ పేజీ తరువాయి)

చేతులు మారాయనే ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై కడియం శ్రీహరి ఏప్రిల్ 2న వివరణ ఇచ్చారు. బీఆర్ఎస్ నుంచి ఒక్క రుపాయి ఫండ్ తీసుకున్నట్లు నిరూపించిన శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు. అయినప్పటికి గులాబీ పార్టీతో పాటు కాంగ్రెస్ లోనూ ఈ ఫండ్ విషయమై చర్చ జరుగుతోంది. ఏ పార్టీలోనైనా అభ్యర్థి ఖరారు కాగానే పార్టీ ఫండ్ ఇస్తారని, ఎన్నికల సమయంలో డబ్బులు తీసుకెళ్లటం సాధ్యం కాదు కాబట్టి ముందుగానే ఇస్తారనే చర్చ జరుగుతోంది. కావ్యకు టికెట్ మార్చి 13న బీఆర్ఎస్ టికెట్ ఖరారవగా.. ఆమె 27వ తేదీన రాజీనామా చేశారు. అంటే ఈ రెండు వారాలు బీఆర్ఎస్‌లో కడియం ఎపిసోడ్ ఏం జరిగిందనే చర్చ అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్‌లో జరుగుతుంది. రాజకీయాల్లో నీతి, నిజాయితీ పరుడిగా పేరున్న కడియంపై గులాబీఫండ్ ఆరోపణలు ఓ మరకలా మారిందనే చర్చ జరుగుతోంది.

రేవూరికి బాధ్యతలపై కేడర్ నారాజ్..

పుండు మీద కారం చల్లినట్లుగా అధిష్ఠానం వ్యవహారం కేడర్‌ను మరింతగా రెచ్చగొడుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొదట్లో వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా మంత్రి కొండా సురేఖ వ్యవహరించారు. అయితే కడియం కావ్య కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపిక కాగానే. సురేఖ స్థానంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. దీంతో కేడర్‌లో పాత మిత్రులంతా ఒక్కటవుతున్నారనే సంకేతాలు వెళ్లుతున్నాయనే చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు నెలపదిహేను రోజుల ముందే బీజేపీ నుంచి ప్రకాష్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి.. అనూహ్యంగా పరకాల ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాజకీయాల్లో సీనియర్ నేతే అయినప్పటికి కాంగ్రెస్ రాజకీయాల్లో కేవలం 4నెలల అనుభవం మాత్రమే ఉంది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా, జిల్లాల విభజన తరువాత సుదీర్ఘకాలంగా వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల అధ్యక్షుడిగా పని చేయటంతో పాటు క్యాడర్‌తో సత్సంబంధాలు ఉన్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి లేదంటే మంత్రి కొండా సురేఖనే వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా నియమించకుండా రేవూరిని నియమించడంపై కేడర్ నారాజ్ అవుతోంది. ఇదే సమయంలో గతంలో టీడీపీ పని చేసిన వారికే పెద్దపీట వేస్తున్నారనే ఆందోళనను పాత కాంగ్రెస్ నేతలు వ్యక్తం చేస్తున్నారు. వయస్సు రీత్యా ఆయనకు ప్రస్తుత రాజకీయాల్లో దూకుడుగా వ్యవహరించే పరిస్థితి లేదని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. ఇప్పటికే కడియం శ్రీహరి కుమార్తెను బలవంతంగా తమపై రుద్దారనే భావనలో ఉన్న కేడర్.. పార్లమెంట్ బాధ్యతలు కూడా పాత కాంగ్రెస్ నేతలకు ఇవ్వకపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నట్లు సమాచారం.


ఏనుమాముల మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 10: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.సంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం, శుక్రవారం రంజాన్ సందర్భంగా సెలవు, శనివారం వారాంతపు యార్డు బంద్ సెలవు, ఆదివారం సాధారణ సెలవు ఉంటుందన్నారు. మార్కెట్‌లో సోమవారం నుంచి యథావిధిగా సరుకుల క్రయవిక్రయాలు కొనసాగుతాయని చెప్పారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు, కార్మికులు గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని ఆయన కోరారు.



హెల్త్ ఇన్సూరెన్స్ పేరుతో నయా మోసం

ఏజెంట్లతో కుమ్మక్కై ఓ ప్రైవేటు ఆస్పత్రి కక్కుర్తి ● 18నెలల్లో రూ.2.67లక్షల స్వాహా



వరంగల్ మెడికల్, ఏప్రిల్ 10: హనుమకొండ బాలసముద్రం ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ప్రయివేట్ ఇన్సూరెన్స్ సొమ్ములను కాజేసేందుకు తప్పుడు మార్గాలను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. 18 నెలల కాలంలో రూ. 2.67లక్షలు కొల్లగొట్టినట్లు సమాచారం. సూపర్ స్పెషాలిటీ వైద్యులు లేకున్నప్పటికీ వారి పేర్లను ఉపయోగిస్తూ ఆపరేషన్లు చేసినట్లు రికార్డులు సృష్టించి భారీ మొత్తంలో నిధులు స్వాహా చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

రూ.67లక్షలు స్వాహా

బాలసముద్రంలోని ఈ ఆస్పత్రికి కేవలం 50 పడకలు మాత్రమే ఉన్నాయి. ఈ పడకల్లో 18-07-2022 నుంచి 31-03-2023 వరకు 143 క్లెయిమ్స్‌లో రూ. 67 లక్షలు కొల్లగొట్టినట్లు సమాచారం. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో రూ. 2 కోట్లను స్వాహా చేసినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. ఈ ఆస్పత్రికి 27 వివిధ రకాల ఇన్సూరెన్స్‌లు అనుసంధానమై ఉన్నాయి. వీటిలో ప్రధానంగా ఒక ఇన్సూరెన్స్ నుంచే ఇన్ని కొల్లగొట్టినట్లుగా మరో ఐదు ఇన్సూరెన్స్‌ల కంపెనీ నుంచి ఇంకెన్ని దిగమింగారో లెక్కలు తేలాల్సి ఉంది.

ఏజెంట్ల మాయ

ఇన్సూరెన్స్ డబ్బుల కోసం సదరు ఆస్పత్రి ఏజెంట్లను మచ్చిక చేసుకున్నట్లు సమాచారం. ఇందుకు ఒక రోగికి అయిన బిల్లుల్లో 20శాతం కమిషన్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఒక ఇంట్లో ఒకరి పేరు మీద ఆరోగ్య బీమా ఉంటే అదేఇంట్లోకి మరొక వ్యక్తికి ఏదైనా ఆరోగ్య సమస్యవస్తే ఆరోగ్య బీమా ఉన్న వ్యక్తి పేరుతో ఇక్కడ చికిత్స అందిస్తారు. ఈరకంగా ఆరోగ్య బీమా కంపెనీలను బురిడీ కొట్టిస్తున్నారు. ఇందుకు ఏజెంట్లు కూడా సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అలాగే ఓ రోగికి ఏదైనా ఆపరేషన్ చేయాలంటే ఇన్సూరెన్స్ కంపెనీలు ప్యాకేజీలు నిర్ణయిస్తాయి. అంతకంటే ఎక్కువ ఖర్చు అయితే కోపేమెంట్‌గా ఆస్పత్రి యాజమాన్యాలు డబ్బులు స్వీకరిస్తాయి. చికిత్స పొందిన రోగి డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే కొందరు ఇన్సూరెన్స్ ఏజెంట్లు బాలసముద్రంలోని ఆస్పత్రితో కుమ్మక్కై ఎలాంటి కోపేమెంట్ లేవని రోగులను ఇక్కడికి పురమాయిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రతీ రోగికి ఓపెన్ బిల్లే..

ఇన్సూరెన్స్ ప్రకారం ఏదైనా రోగికి చికిత్స అందిస్తే ఐదు రోజులు ఆస్పత్రిలో ఉంటే ఓపెన్ బిల్ విధానం అమలులో ఉంది. ఈ విధానం ప్రకారం ఎంత బిల్ అయినా క్లెయిమ్ చేయవచ్చు. ఈ నిబంధనలు ఆసరాగా తీసుకొని చక్రం తిప్పుతున్న ఓ ఆస్పత్రి అవసరం లేని రోగులను కూడా ఐసీయూ, కార్డియాక్, ఎమర్జెన్సీ విభాగాల్లో రోజులకొద్ది ఉంచుకొని ఓపెన్ బిల్లింగ్ విధానం ద్వారా బీమా క్లెయిమ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా రోగి ఒక పేరు మీద ఉంటే మరో రోగి పేరుతో చికిత్స అందిస్తున్నట్లు కూడా ఆరోపణలు వస్తున్నాయి.

సీబీసీఐడీ విచారణకు డిమాండ్

నగరంలో 250 పడకల ఆస్పత్రులు చాలా ఉన్నాయి. పైగా ఇవి చాలా సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్నాయి. ఇలాంటి ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అన్ని సిద్ధంగా ఉన్నాయి. వీటి క్లెయిమ్స్ కూడా లక్షలు దాటడం లేదు. అయితే హనుమకొండ బాలసముద్రంలోని 50 పడకల ఆస్పత్రిలో కేవలం 18 నెలల కాలంలో రూ. 2.67 కోట్ల క్లెయిమ్స్ కేవలం ఒకే సంస్థ ద్వారా జరగడం పట్ల వైద్యులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మిగతా 27 ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా ఇంకెన్ని జరిగాయోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మొత్తం ఈ లావాదేవీలపై సీబీఐచే విచారణ జరిపించాలనే డిమాండ్ వ్యక్తం అవుతోంది.

నిరుద్యోగ యువతులకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి, ఏప్రిల్ 10 : భారతీయ స్టేట్ బ్యాంక్-గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, టైలరింగ్‌లో 30 రోజుల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ మాధురి తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 45 యేళ్ల లోపు ఉండి, తెలుగులో చదవడం, రాయడం వచ్చి, తెలుపు రేషన్ కార్డును కలిగి ఉండాలన్నారు. చదువు కొనసాగిస్తున్న విద్యార్థులు, మునిసిపాలిటీకి చెందిన వారు అర్హులు కాదన్నారు. శిక్షణ ఈ నెల 15 నుంచి ప్రారంభమవుతుందన్నారు. శిక్షణకాలంలో అభ్యర్థులకు ఉచిత వసతితో పాటు భోజనం ఉంటుందని, శిక్షణ కాలంలో కోర్స్‌కు సంబంధించిన మెటీరియల్ కూడా ఉచితంగా అంచనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, విద్యార్హతల జిరాక్స్ కాపీలతో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి సంస్కృతీ విహార్‌లో గల ఎస్‌బీఐ ఆర్ఎస్ఈటీఐ నందు ఈ నెల 14 లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 97040 56522, 98493 07873, 62812 60878, 99491 08934 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

మే 6 నుంచి డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 10: కాకతీయ యూనివర్సిటీ రెగ్యులర్ బీఏ, బీకామ్, బీఎస్సీ ఇతర డిగ్రీ కోర్సుల 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలు మే 6 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం. తిరుమలదేవి షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేశారు. రెండో సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 23, 25 తేదీల్లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు అలాగే నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 7, 9, 15, 17, 20, 22, 24, 27తేదీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. 6వ సెమిస్టర్ పరీక్షలు 7, 9, 15, 17, 20, 22, 24,27 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. వీటితోపాటు బీసీఏ, బీ వోకేషనల్, బీహెచ్ఎం-సీటీ, పీడీసీ సెమిస్టర్ కోర్సుల పరీక్షలను కూడా నిర్వహిస్తామని షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

డీసీసీ ఎస్టీ సెల్ చైర్మన్‌గా రవీంద్రనాయక్

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 10: కాంగ్రెస్ కమిటీ వరంగల్ జిల్లా ఎస్టీ విభాగం చైర్మన్‌గా సంగెం మండలం పెద్దతండాకు చెందిన గుగులోతు రవీంద్రనాయక్ నియమితులయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం మేరకు టీపీసీసీ ఎస్టీ విభాగం చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ జిల్లాలో ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రవీంద్రనాయక్ పేర్కొన్నారు.

ధార్మిక భవన్‌లోకి వేద పాఠశాల

● కలెక్టర్ ఆదేశాలతో ఎట్టకేలకు దిగివచ్చిన దేవాదాయ శాఖ అధికారులు ● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

హనుమకొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి దేవాలయం ప్రాంగణంలో ఉన్న వేద పాఠశాలలను ధార్మిక భవన్‌లోకి తరలించేందుకు దేవాదాయ శాఖ అధికారులు ఎట్టకేలకు అంగీకరించారు. ధార్మిక భవన్‌లో పాఠశాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పక్షం రోజుల్లో పాఠశాలను భవన్‌లోకి తరలించనున్నారు. భద్రకాళి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శేషభారతి ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో అధికారికంగా తెలిపారు. ధార్మిక భవనంలో వేద విద్యార్థుల నివాసం కోసం మొదటి అంతస్తును, తరగతి గదుల నిర్వహణకు నాలుగో అంతస్తును కేటాయించనున్నట్లు తెలిపారు. ధార్మిక భవన్‌లో వేద పాఠశాల నిర్వహణకు, విద్యార్థుల నివాసానికి అవసరమైన వసతుల కల్పనకు పనులు జరుగుతున్నాయని తెలిపారు.

ఎట్టకేకు దిగివచ్చి..

భద్రకాళి ఆలయం చుట్టూర మాడవీధుల నిర్మాణం జరుగుతున్న క్రమంలో వేద పాఠశాలను ధార్మిక భవనంలోకి మార్చాలన్న ప్రతిపాదనను దేవాదాయ శాఖ అధికారులు మొదట నిరాకరించారు. ఘోషిస్తున్న వేద పాఠశాల శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్త వచ్చిన సంగతి తెలిసిందే. దీనితో ఈ విషయం కలెక్టర్ సిక్తా పట్నాయక్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి వెళ్లింది. మంత్రి కలెక్టర్ దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను పిలిపించుకొని మాట్లాడారు. వేద పాఠశాలను ధార్మిక భవన్‌లోకి తరలించాలని ఆదేశించినట్టు తెలిసింది. దీనితో దేవాదాయ శాఖ అధికారులు వేద పాఠశాలకు ధార్మిక భవన్‌లో చోటు కల్పించేందుకు సమ్మతించారు.



వేద పాఠశాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

వేరు వేరు అంతస్తుల్లో...:

ధార్మిక భవనంలోని మొదటి అంతస్తును, నాలుగో అంతస్తును వేదపాఠశాలకు కేటాయించాలని నిర్ణయించారు. కింద అంతస్తులో విద్యార్థులు ఉండడానికి డార్మెటరీలను ఏర్పాటు చేస్తారు. వారికి అవసరమైన భోజనాల కోసం కిచెన్‌ను కిందనే ఏర్పాటు చేయనున్నారు. పైన నాలుగో అంతస్తులో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తారు. వేద పాఠశాలకు విద్యార్థుల సంరక్షణను చూసేందుకు ప్రస్తుతం ఒక కేర్ టేకర్ కూడా ఉన్నారు. ఆయన కుటుంబంతో సహా పాఠశాలలోనే నివాసముంటున్నందువల్ల ధార్మిక భవన్‌లో కూడా ఆయనకు ప్రత్యేకంగా ఒక గదిని కూడా కేటాయించాల్సి ఉంది. పాఠశాలకు సంబంధించిన వస్తువులు, పుస్తకాలు, ఇతర బోధనా సామగ్రిని భద్రపరచడానికి ప్రత్యేకంగా మరో గది (స్టోర్ రూం)ను కూడా ఏర్పాటు చేయాల్సి ఉందని పాఠశాల నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం..

వేద పాఠశాల నిర్వహణలో ఎలాంటి అసౌకర్యాలు లేవని, దేవాదాయ శాఖ సౌజన్యంతో పాఠశాల నిర్వహణకు అన్ని రకాల సహకారం అందిస్తున్నామని శ్రీ భద్రకాళి దేవస్థానం ఈవో శేషభారతి తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'ఘోషిస్తున్న వేదపాఠశాల' శీర్షికతో వచ్చిన వార్తకు స్పందించారు. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేశారు. ధార్మిక భవనంలో కేటాయించిన స్థలం వేద పాఠశాల నిర్వహణకు, విద్యార్థుల నివాసానికి అనుకూలంగా ఉంటుందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని శ్రీ భద్రకాళి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శేషభారతి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



ఉత్తమ పౌర పురస్కారాలు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

గురుధామంలో ఉగాది ఉత్తమ పౌర పురస్కారాలు

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 10: గ్రేటర్ వరంగల్ మూడవ డివిజన్ పైడిపెల్లిలోని గురుధామంలో(సప్తధామ్) ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం పలువురికి ఉత్తమ పౌర పురస్కారాలు అందజేశారు. శివానందగురు కల్చరల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన ముగ్గురికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఏటూరునాగారంకు చెందిన డాక్టర్ బండ్ల వరప్రసాద్, కూచిపూడి నాట్యాచార్యులు బొంపెల్లి సుధీర్‌రావు, హనుమకొండకు చెందిన ట్రైనీ కలెక్టర్ శ్రీసాయి అశ్రిత్‌కు రూ.5వేల నగదు, మెమొంటో అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హైదరాబాద్ విజిలెన్స్ ఏసీపీ శ్రీనివాసరావు, శివానందగురు కల్చరల్ మేనేజింగ్ ట్రస్టి త్రిపురనేని గోపిచంద్, గండ్లూరి రాజశేఖర్, బండారు సాయినారాయణ, మాదారపు సదాశివుడు, పబ్బ విశ్వేశ్వర్, వెంకటరమణ, సుదర్శన్‌రావు, స్వామి, కృష్ణచైతన్య, ఆనంద్, రాంరెడ్డి, ప్రియాంక, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర కరపత్రం ఆవిష్కరణ

కాజీపేట, ఏప్రిల్ 10: యువతలో దేశభక్తి, జాతీయభావం పెంచి హిందువుల ఏకీకరణ చేయడం కోసం విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ పని చేస్తున్నాయని వీహెచ్‌పీ వరంగల్ మహానగర్ కార్యదర్శి శ్రీరామ్ ఉదయ్ కుమార్ తెలిపారు. ఈ నెల 23న విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించనున్న వీర హనుమాన్ కరపత్రాల పోస్టర్‌ను బుధవారం కాజీపేటలోని మీడియా పాయింట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. హనుమాన్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న వీర హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీలో భాగంగా ఈ నెల 23న రంగశాయిపేట మహంకాళి దేవాలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి కరీమాబాద్, వరంగల్ చౌరస్తా మీదుగా పద్మాక్షి దేవాలయం హనుమత్‌గిరి వరకు యాత్ర సాగుతుందన్నారు. హిందూ ధర్మప్రచారకులు రాధా మనోహర్ ఈ శోభాయాత్రకు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. శోభాయాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి ఆదిత్యసాయి, దారధనుంజయ్, అరవింద్, వినయ్, అరుణ్, విజయ్, లక్ష్మణ్, నాగార్జున, సిద్దూ తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉదయ్ కుమార్

ఆర్‌వోబీపై లారీ ఢీకొని వ్యక్తి మృతి

మడికొండ, ఏప్రిల్ 10 : లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కాజీపేట మండలం కడిపికొండ రైల్వే ఓవర్ బ్రిడ్జిపై చోటు చేసుకుంది. తెల్లవారితే రంజాన్ పండుగ ఉండగా రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందడంతో ఓ కుటుంబంలో విషాదం నెలకొంది. మడికొండ ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కడిపికొండకు చెందిన ఎమ్డీ బషీరుద్దీన్(60) బుధవారం కడిపికొండ నుంచి బైక్‌పై కాజీపేటకు వెళ్తున్నాడు. ఈక్రమంలో ఆర్‌వోబీ పైకి రాగానే లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బషీరుద్దీన్ కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బషీరుద్దీన్ భార్య, బంధువులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా, మృతుడికి భార్య మాత్రమే ఉందని ఎస్సై రాజబాబు పేర్కొన్నారు.



మృతిచెందిన బషీరుద్దీన్

మండే ఎండలో విధులా?

- మధ్యాహ్నం 1గంట వరకు పారిశుధ్య సిబ్బందికి పనులు
- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్
- అసహనం వ్యక్తం చేస్తున్న కార్మికులు
- పునరాలోచించాలని వేడుకోలు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 10: భానుడు నిప్పులు కురిపిస్తున్నాయి. ఉదయం 8గంటలకే ఎండలు దంచికొడుతున్నాయి. ఈ ఎండలో బయటకు వెళ్లి రావాలంటేనే జనం భయపడుతున్నారు. అయితే బల్దియా పారిశుధ్య కార్మికులు మాత్రం మధ్యాహ్నం 1గంట వరకు పనిచేయాలని ఉన్నతాధికారులు హుకుం జారీ చేస్తున్నారు. ఈ మేరకు గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బల్దియా పరిధిలో పారిశుధ్య పనులు చేసే సిబ్బంది ఇకపై ఒక్క పూట విధులు నిర్వర్తించాలని తెలిపారు. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణ దృష్ట్యా గురువారం నుంచి ఎండాకాలం ముగిసే వరకు ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. సిబ్బంది వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పారిశుధ్య కార్మికులు నిబంధనలు పాటించాలని తెలిపారు.

గతంలో ఇలా..

యేటా జూన్ నుంచి మార్చి వరకు ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పారిశుధ్య కార్మికులు పనులు నిర్వహిస్తారు. కానీ ఎండాకాలంలో సిబ్బంది పడే ఇబ్బందిని గుర్తించి ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఉదయం 5 నుంచి 11.30 గంటల వరకు అధికారులు విధులు కేటాయిస్తారు. వేసవికాలంలో ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో పూర్తిగా ఒక్క పూట మాత్రమే పని కల్పించాలనే నిబంధన ఉంది. గత మున్సిపల్ కమిషనర్, పాలక వర్గం ఉదయం 11గంటల వరకే పారిశుధ్య కార్మికులతో పనిచేయించేవారు. కానీ ప్రస్తుత కమిషనర్ అందుకు విరుద్ధంగా మధ్యాహ్నం 1గంట వరకు పని చేయాలని సూచించడంతో చాలామంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మండేఎండలో ఎలా పనిచేయాలని అసహనం వ్యక్తం చేస్తున్నారు.



తెల్లవారుజామున విధులకు వస్తున్న పారిశుధ్య కార్మికులు(ఫైల్)

కార్మికుల అసహనం

వరంగల్ మహానగర పరిధిలోని డివిజన్లలో పారిశుధ్య కార్మికులు కాలనీలలో తిరుగుతూ చెత్త సేకరించడం నుంచి మొదలుకొని రోడ్లు ఊడ్చడం, డ్రైనేజీలు శుభ్రం చేయడం చేస్తుంటారు. ఈ వేసవిలో కమిషనర్ ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విధులు నిర్వర్తించాలని ఆదేశించింది. నగరానికి సుమారు 20, 30 కిలోమీటర్ల దూరం నుంచి ఉదయం 4 గంటలకు వచ్చి 5 గంటలకు బయోమెట్రిక్ ద్వారా హాజరు వేసుకుని 1 గంటవరకు ఎండలో విధులు నిర్వర్తించాలంటే చాలాకష్టంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క పూట అన్నట్టే గానీ.. ఎండలో పని చేయడం, భోజనహారాలు లేకుండా విధులు నిర్వర్తించడంవల్ల స్పృహతప్పి ప్రాణాలు పోయే పరిస్థితి ఉంటుందంటున్నారు. ఇళ్ల యజమానులు కనీసం మంచి నీళ్లు కూడా ఇవ్వరని వాపోతున్నారు. అయితే గతంలో మాదిరిగా ఎండాకాలంలో ఉదయం 5 నుంచి 11.30 వరకు విధులు కేటాయించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కమిషనర్, పాలక మండలి, అధికారులు పునరాలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే నిరసన, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నారు.

సంఘాలు, నాయకుల జాడెక్కడ?

బల్దియా కార్మికుల సమస్యలే మా సమస్యలు.. కార్మికుల కష్టాలే మా కన్నీళ్లు.. అని గొప్పలు చెప్పుకునే కార్మిక సంఘాలు, జేఏసీ నాయకులు ఎక్కడ అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కమిషనర్ నిర్ణయంపై ఏ సంఘం నాయకుడు స్పందించకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. పారిశుధ్య కార్మికుల నుంచి సంవత్సర చందాలు, సభ్యత్వాలు, సభలు, సమావేశాలు, ఎల్ఐసీల పేరుతో క్రమం తప్పకుండా డబ్బులు వసూలు చేసే కొన్ని సంఘాల నాయకులు అడ్రస్ లేకుండా పోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అన్ని సంఘాలు, జేఏసీ ఒక్కటై శానిటేషన్ సిబ్బంది పని వేళల్లో మార్పు వచ్చే విధంగా చూడాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

పని గంటలు తగ్గించాలి

బొట్ల భిక్షపతి మాదిగ. టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు



పారిశుధ్య కార్మికులు ఎండలో పని చేయాలంటే చాలా కష్టం. ఎండాకాలంలో కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో ఉదయం 5 గంటల నుంచి 11.30 గంటల వరకు మాత్రమే పని చేయించేవారు. కానీ ప్రస్తుత బల్దియా కమిషనర్ 1గంట వరకు పనిచేయాలని ఆదేశించడం సరికాదు. కమిషనర్ పునరాలోచించి పని గంటలు తగ్గించాలి. లేదంటే కార్మికుల పక్షాన కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతాం.



జానకీరాముడిగా రామచంద్రుడు

రుద్రేశ్వరాలయంలో జానకీరాముడిగా రామచంద్రుడు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 10: నగరంలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో పది రోజులపాటు జరిగే శ్రీరామనవమి ఉగాది పర్వదిన వేళ ప్రారంభమైన శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాల పర్వంలో భాగంగా రెండోరోజు బుధవారం ప్రత్యేక సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో సీతారామ చంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను జానకీరాముడిగా అలంకరింపజేసి పూజాదికాలు నిర్వహించారు. ఈవో వెంకటయ్య పర్యవేక్షించారు.

ముస్లింలకు పండుగ సామగ్రి పంపిణీ



షేర్‌ఖుర్మా సామగ్రిని అందజేస్తున్న మైనారిటీ నాయకులు

ఐనవోలు, ఏప్రిల్ 10 : గర్మిళ్లపల్లి గ్రామంలో ఎంపీటీసీ బీరం మౌనికదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో 72 మంది ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ షేర్‌ఖుర్మా సామాగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అల్లా ఆశీర్వాదంతో పవిత్ర రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ పండ్లు పంపిణీ

మడికొండ: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మడికొండలోని టీఎన్‌జీవోస్ కాలనీలో బుధవారం కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు ముస్లిం సోదరులకు బహుమతులు అందజేశారు. కాలనీలోని ప్రతీ ముస్లిం సోదరుల ఇళ్లకు వెళ్లి డ్రైఫ్రూట్స్, పండ్లు, హర్రీస్‌లతో కలిపి బహుమతిని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పెట్టెం సాంబయ్య, కార్యదర్శి నల్ల సతీష్‌కుమార్, కోశాధికారి బిళ్ళ లక్ష్మీనర్సయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గురుద్వార్‌లో వినయ్‌భాస్కర్ పూజలు



గురుద్వార్‌లో పూజలు నిర్వహిస్తున్న వినయ్‌భాస్కర్

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్10: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బీఆర్‌ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ బుధవారం హనుమకొండ 9వ డివిజన్ కాకతీయకాలనీలోని గురుద్వార్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రీకోధి నామ నూతన సంవత్సరంలో అన్ని కులమతాల వారికి, సమస్త మానవాళికి శుభం కలగాలని పూజలు చేశానన్నారు. అనంతరం కాకతీయకాలనీలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో గురుద్వార్ ప్రబంధ కమిటీ సభ్యులు హరిసింగ్, దీప్తిసింగ్, ఆజాద్‌సింగ్, జిత్తు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సిరిమల్లె సదానందం, దర్శన్‌సింగ్, రజనీకాంత్, ఖలీల్, రాచర్ల జగన్, అజిత్, తదితరులు పాల్గొన్నారు.

‘సఖీ’ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

న్యూశాయంపేట, ఏప్రిల్ 10: సఖి వన్‌స్టాప్ సెంటర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ అన్నారు. ఆడపిల్లలపై జరుగుతున్న అకృత్యాలు, లింగ వివక్షతపై న్యూశాయంపేట ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరోజన అధ్యక్షతన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ.. ఆడపిల్లలు సమాజం గురించి తెలుసుకుని ముందుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఈఎస్ జెండర్ స్పెషలిస్ట్ స్వర్ణలత, సఖీ సెంటర్ కేసు వర్కర్లు వినీల, స్వర్ణలతతో పాటు 150 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

మునిసిపల్ స్వీపర్‌పై దాడి

పరకాల, ఏప్రిల్ 10: ఆకారణంగా మునిసిపల్ స్వీపర్‌పై దాడి చేస్తూ దూషించిన ఒకరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రవిరాజ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పరకాల మునిసిపాలిటీలో పని చేస్తున్న స్వీపర్ చుక్క కమల విధి నిర్వహణలో భాగంగా పట్టణంలోని వెల్లంపల్లిరోడ్డు మార్గంలో చెత్తను ఊడుస్తు దాహం వేసి పక్కనే ఉన్న ఇంటి యజమానురాలు పల్లెబోయిన శశిరేఖను మంచినీళ్ల అడిగింది. దీంతో స్వీపర్‌వు నా ఇంటి ముందుకు వస్తావా అని ఆగ్రహంతో కులం పేరుతో బూతులు తిడుతూ కమలపై దాడికి పాల్పడింది. దీంతో పరకాల పోలీసు స్టేషన్‌లో కమల ఫిర్యాదు చేయగా దర్యాప్తు నిర్వహించిన అనంతరం శశిరేఖపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవిరాజ తెలిపారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉండొద్దు

పాఠశాలల్లో మరమ్మతు పనులు చేపట్టాలి

కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 10: వేసవి దృష్ట్యా తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి సీఎస్ జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటి కొరత లేకుండా ప్రతీ ఇంటికి నీరు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి పైపులైన్లు లీకేజీలు ఉన్నట్లయితే యుద్ధప్రతిపాదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. వేసవి ముగిసేవరకు తాగునీటి సమస్యలు వినిపించకుండా ఉండాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా గన్నీసంచులను అందుబాటులో ఉంచాలన్నారు. సీఎంఆర్ లక్ష్యాలు పూర్తయ్యేవిధంగా కృషి చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతులను గుర్తించి వెంటనే పనులను ప్రారంభిచాలన్నారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో మన ఊరు- మన బడి ద్వారా చేపట్టిన పనులు, వాటికి సంబంధించిన బిల్లులు, చేపట్టాల్సిన పనుల గురించి కలెక్టర్ సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమై మాట్లాడుతూ.. జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలల వివరాలను సేకరించాలని, అసంపూర్తిగా మిగిలి ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు.

ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ నాగపద్మజ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మీ, జిల్లా మేనేజర్ మహేందర్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, సీపీవో సత్యనారాయణరెడ్డి, మిషన్ భగీరథ ఈఈ రామాంజనేయులు, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, వైద్య, ఆరోగ్య శాఖధికారి సాంబశివరావు, విద్యాశాఖధికారి అబ్దుల్ హై, డీసీవో నాగేశ్వర్‌రావు, మెప్మా పీడీ భద్రనాయక్, మునిసిపల్ ఎస్‌ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ రాజయ్య, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, ఆర్ అండ్‌బీ డీఈ గౌస్ పాల్గొన్నారు.

5కే రన్‌ను విజయవంతం చేయండి

ఈనెల 16వ తేదీన నిర్వహించే 5కే రన్‌లో విద్యార్థులు, యువత, అధికారులు, ప్రజలు అధి క సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని జిల్లా కలెక్టరేట్‌లో 5కే రన్‌కు సంబంధించిన పోస్టర్లను బుధవారం జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అడిషనల్ కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్‌రెడ్డి, ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తాపట్నాయక్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో ప్రతీ ఓటరు ఓటు వేసే విధంగా చైతన్యం తీసుకువచ్చేందుకు 5కే రన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 16న ఉదయం 6గంటలకు జేఎన్‌ఎస్ గ్రౌండ్ నుంచి ఈ రన్ ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

కలెక్టరేట్‌లో చలివేంద్రం ప్రారంభం

హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ బుధవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వేసవికాలం దృష్ట్యా జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాదిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్‌డీఓ నాగ పద్మజ, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నుంచి యువతను కాపాడుకుందాం..

● వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఏప్రిల్ 10: మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా నేటి యువతను కాపాడుకుందామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. బుధవారం కమిషనరేట్‌లో తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో గంజాయి, కల్తీ కల్లు వినియోగం వలన జరిగే అనర్థాలపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. గంజాయి మహమ్మారి యువతను పట్టిపీడిస్తోందన్నారు. గంజాయి నిర్మూలనకు ప్రజలు ముందుకు వచ్చి విక్రయించే వారి సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలన్నారు. మత్తు పదార్థాల కట్టడి కోసం పోలీసులు తగు చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి రహిత కమిషనరేట్ అందరి లక్ష్యమని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, ట్రెయినీ ఐపీఎస్ శుభంనాగ్, వరంగల్ పోలీస్ కమిషనరేట్ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఏసీపీ సైదులు, సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ సురేష్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ గణేష్, శ్రీధర్‌రావు తదిత రులు పాల్గొన్నారు.

ఈద్గాలను సందర్శించిన సీపీ

రంజాన్ సందర్భంగా నగరంలోని మట్టెవాడ, హనుమకొండ బొక్కలగడ్డ ఈద్గాలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం సాయంత్రం పరిశీలించారు. ప్రార్థన సమయంలో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పోలీస్ అధికారులతో సీపీ సమీక్షించారు. కమిషనర్ వెంట స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితెందర్‌రెడ్డి, హనుమకొండ, వరంగల్ ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, నందిరాంనాయక్, సీఐలు శ్రీనివాస్, గోపి, సతీష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రమేశ్

హనుమకొండ టౌన్, ఏప్రిల్10: కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐనవోలు మాజీ ఉప సర్పంచ్ అడ్డగుడి సతీష్, న్యాయవాది బుర్ర సుధాకర్ మంగళవారం రాత్రి బీజేపీ పార్టీలో చేరారు. హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని ఆరూరి రమేశ్ నివాసంలో జరిగిన ఈ కార్యకమంలో ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ మజ్జిగ జైపాల్, రవీందర్‌రెడ్డి, కోట నర్సయ్య, పాక కుమారస్వామి, భాస్కర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

● ఐనవోలు: పంథిని గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే, వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి ఆరూరి రమేశ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు బి. సురేష్, మాజీ ఉప సర్పంచ్ డి. రాజిరెడ్డి, నాయకులు పి. కృష్ణజ్యోతి, పెద్దూరి వినోదలతోపాటు సుమారు 100 మంది బీజేపీలో చేరినట్లు ప్రకటించారు. ఆరూరి రమేశ్, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌లు బీజేపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, నాయకులు తిరుపతిరెడ్డి, మజ్జిగ జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన నిందితులపై కేసు

ధర్మసాగర్, ఏప్రిల్ 10: సీసీ రోడ్డు నిర్మాణానికి క్యూరింగ్ చేస్తున్న విషయంలో దాడికి పాల్పడిన నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై నర్సింగరావు బుధవారం తెలిపారు. ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామంలోని గాంధీనగర్ వద్ద ఇదే గ్రామానికి చెందిన మాచర్ల కిషన్‌గౌడ్ కాలనీ వాసుల కోసం సొంత నిధులు రూ.14.89 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని ఇటీవల చేపట్టారు. గోనె సంచులతో క్యూరింగ్ చేస్తున్న క్రమంలో గ్రామానికి చెందిన వ్యక్తులు క్యూరింగ్ కోసం వేసిన సంచులను తీసి తగులబెట్టారు. క్యూరింగ్ సంచులను ఎందుకు తగల బెడుతున్నారని మాచర్ల కిషన్‌గౌడ్ బంధువు మాచర్ల అనిరుధ్ కౌడిన్య మంగళవారం సంచులు తగులబెట్టిన వారిని అడిగారు. దీంతో ఇదే గ్రామానికి చెందిన 11.మంది అనిరుధ్ కౌడిన్య పై దాడి చేసి దుర్భాషలాడారు. దీంతో బాధితుడు పీఎస్‌లో ఫిర్యాదు చేయగా దేవరుప్పుల సుధాకర్, వల్లపురెడ్డి రాంరెడ్డి, గంటే కిషన్, గంటే సదానందం, మడికంటి వెంకటయ్య, బాషబోయిన రాజు, గంటే లింగమూర్తి, గంటే చంద్రమోహన్, వేములకొండ రంజిత్, దేవరుప్పుల జేలేందర్, అప్పని భాస్కర్ తదితరులపై సెక్షన్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

కంపుకొడుతున్న కేయూ 100 ఫీట్ రోడ్డు

● విచ్చలవిడిగా వ్యర్థాల పారవేత ● ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహనదారులు



రోడ్డు పక్కనేపడవేసిన వ్యర్థపదార్థాలు

హనుమకొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కేయూ 100 ఫీట్ల రోడ్డు కంపుకొడుతోంది. ఈ రోడ్డుపై వెళ్లే పాదచారులు, వాహనదారులు దుర్వాసన భరించలేకపోతున్నారు. ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోంది. ఫాతిమా జంక్షన్ నుంచి వడ్డేపల్లి చర్చి జంక్షన్ మధ్య ప్రధానంగా వడ్డేపల్లి బండ్‌ను ఆనుకొని రోడ్డుకిరువైపులా వ్యర్థపదార్థాలను విచ్చలవిడిగా పారవేస్తున్నారు. కోళ్ల వ్యర్థాలతో పాటు చెత్తను ఇక్కడే కుమ్మరిస్తున్నారు. చనిపోయిన జంతు కళేబరాలను కూడా ఇక్కడ విడిచివెళుతున్నారు.

తాగిన కొబ్బరిబోండాలను కూడా ఈ రోడ్డు పక్కనే వదిలేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు కూడా తాము సేకరించిన చెత్తను ఈ రోడ్డుపక్కనే ఉంచిన డస్ట్‌బిన్‌లలో వేస్తున్నారు. సమీపంలో ఉన్న ఫంక్షన్ హాళ్లలో మిగిలిపోయిన ఆహారపదార్థాలు, ఎంగిలి విస్తర్లను కూడా ఇక్కడే పారేస్తున్నారు. దీంతో వ్యర్థాలు కుళ్లి కంపుకొడుతున్నాయి. ఈ రోడ్డు పక్క నుంచి ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తోంది. భరించరాని దుర్వాసనతో పాదచారులు, వాహనదారులు, ముఖ్యంగా తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. వరంగల్ నగర పాలక సంస్థ అధికారులు ఈ రోడ్డు పక్కన ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించే ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

యథేచ్ఛగా మట్టి దందా

ఔసులోని కుంటలో అర్ధరాత్రి రవాణా

పట్టించుకోని అధికారులు



ఔసులోని కుంటలో మట్టి తవ్విన ప్రదేశం

భీమారం, ఏప్రిల్ 10: హసన్‌పర్తి మండలం 1వ డివిజన్‌లోని పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఔసులోని కుంటలో ఎలాంటి అనుమతులు లేకుండా అర్ధరాత్రి మట్టిదందా యథేచ్ఛగా సాగిస్తున్నారు. మట్టి దందా సాగుతున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అర్ధరాత్రి పెట్రోలింగ్ పోలీసులు సైతం చూసీచూడనట్లుగా ఉండడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. నీటి నిల్వ కోసం చేపల ఉత్పత్తి కోసం ఏర్పాటు చేసిన కుంట మట్టి తవ్వకాలతో 20 అడుగుల లోతు గుంతలమయంగా తయారైంది. సదరు వ్యాపారులు రాత్రి జనసంచారం లేని సమయంలో ట్రాక్టర్ల ద్వారా రవాణా సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా కుంటను ఆనుకొని ఉన్న పద్మశాలీ కాలనీవాసులు ఇదేమిటని ప్రశ్నిస్తే రాత్రి వేళల్లో బెదిరింపులకు దిగుతున్నారు. పోలీసులకు పలుసార్లు ఫోన్ ద్వారా సమాచారం చేరవేసినా పట్టించుకున్న వారు లేరని స్థానికులు చెబుతున్నారు.

మట్టికి గిరాకీ

హసన్‌పర్తి పరిసర ప్రాంతాల్లో భవనాల నిర్మాణం, వెంచర్లలో అధికంగా ఉండడంతో మట్టికి గిరాకీ పెరిగింది. ట్రాక్టర్ మట్టి ధర రూ.800 నుంచి 1200వరకు పలుకుతోంది. అదనుచూసి అమ్మకాలు జరుపుతూ రోజు సుమారు 40 నుంచి 60 ట్రాక్టర్ల వరకు మట్టిని తరలిస్తున్నారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 3గంటల వరకు మట్టి దందా సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి దందాను నిలువరించాలని పలువురు కోరుతున్నారు.

సమ్మయ్యనగర్‌లో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలి

వడ్డెపల్లి, ఏప్రిల్ 10: గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ సర్వే నంబర్ 266 లోని సమ్మయ్య నగర్‌లో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని ప్రజాతంత్ర ఆలోచన వేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు తుపాకుల దశరథం జిల్లా కలెక్టర్‌ను కోరారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ సమ్మయ్య నగర్‌లో ప్రజాతంత్ర ఆలోచన వేదిక రాష్ట్ర కో కన్వీనర్ పింగిళి అశోక్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రేటర్ వరంగల్ 56, 57, 58 డివిజన్లలో కూరగాయల మార్కెట్ లేకపోవడం వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమ్మయ్య నగర్‌లోని ప్రభుత్వ స్థలంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేసి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్‌తో పాటు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజును కోరారు. సమావేశంలో ప్రజాతంత్ర ఆలోచన వేదిక జిల్లా ప్రతినిధులు రమేష్, బ్రహ్మం, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష మల్లెలతో భద్రకాళి అమ్మవారికి అర్చన

రెండో రోజుకు వసంత నవరాత్రోత్సవాలు



అమ్మవారికి మల్లెపూలతో అర్చన చేస్తున్న అర్చకులు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 10: వరంగల్‌లోని శ్రీభద్రకాళి అమ్మవారి దేవస్థానంలో కొనసాగుతున్న వసంత నవరాత్రోత్సవాలు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఉత్సవాల్లో భాగంగా సుప్రభాత సేవ, నిత్యాహ్నికం, ఉత్సవ పూజ, అర్చన, అభిషేకాల అనంతరం అమ్మవారికి లక్ష మల్లెపూలతో అర్చకులు అర్చన నిర్వహించారు. తెలుపు రంగు సత్వగుణాకి ప్రతీక, వైష్ణవి శక్తి విష్ణు రూపంలో ఉండి ఈ లోకాన్ని పరిపాలిస్తూ రక్షిస్తున్నదని, ప్రజలందరు శాంతి సౌభాగ్యాలతో జీవించడానికి ఈ ఆరాధన ఉపయోగపడుతుందని ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శేషు భారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థులకు రాష్ట్రస్థాయి బహుమతులు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

హసన్‌పర్తి, ఏప్రిల్ 10: నగర పరిధిలోని చింతగట్టు హైస్కూల్‌కు చెందిన విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక నుంచి రాష్ట్ర స్థాయి బహుమతులు అందుకున్నారు. జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముఖి రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో విద్యార్థులు వరుణ్, తాజ్‌రానాలు ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. వీరికి బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిట్ విశ్రాంత ఆచార్యులు లక్ష్మారెడ్డి, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్‌లు బహుమతులను అందజేశారు. గైడ్ టీచర్ బి.రాజేందర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు శరత్, సాంబమూర్తి, అర్పిత, శేషగిరిస్వామి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రమాదేవి పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, ఏప్రిల్10: నిబంధనలు ఉల్లఘించిన 22 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు. 22 మందిని బుధవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రమేశ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 18 మందికి రూ.28,800, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ నలుగురికి రూ.2,100 జరిమానాను విధించారన్నారు.

నేడు ‘ఈద్ ఉల్ ఫిత్ర్’

(5వ పేజీ తరువాయి)




విద్యుత్ దీపాల వెలుగుల్లో కలెక్టరేట్ సమీపంలోని మసీదు

మనోనిగ్రహం కలుగుతుందని విశ్వసిస్తారు. మానవుడిలో ప్రేమాభిమానాలు, క్రమశిక్షణ, కర్తవ్యపరాయణత్వం, సహనం, దాతృత్వం, పవిత్ర జీవనం, న్యాయ మార్గానుసరణం, ఆర్థిక సమానత్వం, సర్వమానవ సౌభ్రాతృత్వం తదితర ఉత్తమ గుణాలు అలవడుతాయని చెబుతారు. ఈ అలవాటు చేసేందుకు దేవుడైన అల్లాహ్ ప్రతీయేడు మానవ జాతికి రంజాన్ మాసాన్ని ప్రసాదించాడని ముస్లింలు భావిస్తారు.

ఆకలి బాధను గుర్తెరిగే రోజా..

రంజాన్ ఉపవాస దీక్షగా వ్యవహరించే ‘రోజా’ను అరబిక్ భాషలో ‘సౌమ్’, ‘సియామ్’ అని అంటారు. సౌమ్ అంటే మానుకొనుట, ఆపుట, ఆగుట, కట్టుబడి ఉండుట అనే అర్థాలు వస్తాయి. ఉపవాసిని ‘సాయమ్’ అని అంటారు. ఇస్లామియా పరిభాషలో ప్రభాత పూర్వ సమయం నుంచి సూర్యాస్తమయం వరకు అన్నపానియాలు త్యజించడం ఈ ఉపవాస దీక్షకు పరమార్థంగా పేర్కొంటారు. ఈ ఉపవాసదీక్షల వల్ల నిర్మలమైన, నిశ్చలమైన భక్తిభావం ఏర్పడడమే కాకుండా అకలి బాధతో అల్లాడే దీనజనుల కష్టాలను స్వయంగా ఉపవాస దీక్షల ద్వారా గుర్తించే అవకాశం లభిస్తుందని విశ్వసించి నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు పూర్తి చేసుకున్నారు. ఆ క్రమంలోనే రోజూ ఐదుసార్లు దైవారాధన (నమాజ్) చేశారు. రాత్రి వేళల్లో తరావి నమాజ్‌లు చేశారు. అంతేకాకుండాపవిత్ర ఖురాన్ గ్రంథాన్ని పారాయణం చేసి, దాన్ని అర్థం చేసుకుని గురువారం (నేడు) రంజాన్ పండుగ జరుపుకుంటున్నారు.



WANTED

★ Needed Female Staff Nurse (B.Sc Nursing / GNM) Part Time / Full Time. Cont : AMSA Clinic, Near NIT 100 Ft. Darga Road, Kazipet. Cont : 9848126146, 8297263952

AJW-168013

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 18k. ఫోన్ : 9160900024 / 9640400073

AJH-14281

EDUCATION

★ రెగ్యులర్ & డిస్టెన్స్ : డిగ్రీ, PG, B.Tech, డిప్లొమా, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed, B.Ed, B.PEd, MBA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. 3 నెలల్లో కోర్స్ పూర్తి. 8866977112, 339

AJH-14265

TOLET FOR COMMERCIAL

★ 1050 Sft. each Floor (Ground, 1st & 3rd Floors) for Rent / Lease for Commercial / Corporate / Business Situated at Opp : Forest Office, Subedari, HNK. Cont : 9490594777

AJW-188065

FLATS FOR SALE

★ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్ SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్‌లో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్ : 7660008666, 8309035091

AJW-27516

HOUSE FOR SALE

★ ములుగు రోడ్ కాకతీయ కెనాల్ టేకేముల గుపతి వెంపటకి దగ్గరలో G+1 తో గల గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న Independent House అమ్మకానికి కలదు. సెల్ : 7660008666, 8309035091

AJW-27517

HOUSE FOR SALE

★ ఉర్సు గుట్ట నుండి కాజీపేట వెళ్ళు 150 ఫీట్ల రోడ్ ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్ : 7660008666, 8309035091

AJW-27518

PLOTS FOR SALE

★ Kuda Layout Plots for Sale. Ready to House Construction at Near Gorrekunta, Pothurajpally, Warangal. Contact : Srikanth. 7013397258, 8328168015

AJW-188052

PLOTS FOR SALE

★ Kuda Layout Plots for Sale. Ready to House Construction at Near KITS College, Erragattu Gutta, Ambala Road, HNK. Contact : Srikanth. 7013397258, 8328168015

AJW-188051

PLOTS FOR SALE

★ GWMC & KUDA అప్రూవ్డ్ లేఅవుట్ చింతగట్టు హన్మకొండలో అన్ని అభివృద్ధి పనులతో అమ్మబడును. కేవలం 15,000/-లకు గజం మాత్రమే. సంప్రదించు 9849992488

AJW-5865

ప్రకటనల కొరకు సంప్రదించండి

హన్మకొండ
9985400013
8978510273
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

కౌన్సెలింగ్

పిల్లల దంతారోగ్యం

డాక్టర్! మా అబ్బాయి వయసు ఆరేళ్లు. పిల్లల దంతాలు ఆరోగ్యంగా ఉండడం కోసం ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి? ఎత్తు పళ్లు రాకుండా ఉండాలంటే ఏం చేయాలి?
- ఓ సోదరి, హైదరాబాద్.

- పిల్లలు నోట్లో వేలు పెట్టుకునే అలవాటు వల్ల దంతాలు, దవడల నిర్మాణంలో పొరపాట్లు చోటుచేసుకుంటాయి. కాబట్టి ఆ అలవాటును మాన్పించాలి.
- కొంతమంది పిల్లలకు నాలుకతో దంతాలను నెట్టే అలవాటు ఉంటుంది. ఈ అలవాటును కూడా మాన్పించాలి.
- పాల దంతాలు సమయానికి ఊడకపోవడం వల్ల, ఆ ప్రదేశంలో వచ్చే శాశ్వత దంతాలు వంకరగా పెరుగుతాయి. ఇలా జరగకుండా ఉండాలంటే పాల దంతాలు సరైన సమయంలో ఊడిపోయేలా చూసుకోవాలి. ఇందుకోసం పిల్లలను దంత వైద్యుల చేత పరీక్ష చేయిస్తూ ఉండాలి.
- వంకర పళ్లను సరిచేయించుకోకపోతే, భవిష్యత్తులో వాటిలో ప్లేక్ పేరుకుని పుచ్చిపోవడం లాంటి ఇబ్బందులు తలెత్తుతాయి.



ఓరల్ హెల్త్ ఇలా క్షేమం

- పిల్లలకు చిన్నప్పటి నుంచే పండ్లు, కూరగాయలు తినడం అలవాటు చేయాలి. యాపిల్ లాంటి పండ్లతో దంతాలు, చిగుళ్లు శుభ్రపడతాయి.
- క్యాల్షియం సప్లిమెంట్లతో దంతాలు దృఢంగా ఉంటాయి.
- తీపి పదార్థాలను తగ్గించాలి. తిన్న వెంటనే దంతాలు శుభ్రం చేసుకోవాలి.
- శీతల పానీయాలకు దూరంగా ఉండాలి.
- రోజుకు రెండు సార్లు బ్రష్ చేసుకోవాలి.
- మెత్తని బ్రిసిల్స్ బ్రష్‌నే దంత ధావనానికి ఉపయోగించాలి.
- ప్రతి మూడు నెలలకోసారి టూత్‌బ్రష్‌ను మారుస్తూ ఉండాలి.
- ప్రతి ఆరు నెలలకోసారి దంత వైద్యుల చేత దంతాల ఆరోగ్యాన్ని పరీక్షించుకుంటూ ఉండాలి.

డాక్టర్ కడియాల రాజేంద్ర
ఓరల్ అండ్ మ్యాక్సిలోఫేసియల్ సర్జన్, హైదరాబాద్.


నడక సాగించండిలా..

నడక మంచిదే. ఒత్తిడి తగ్గుతుంది. శారీరకంగా గట్టిగా ఉంటారు. బరువు తగ్గుతారు. నడక కంటే ఎఫెక్టివ్ ఎక్సర్‌సైజ్ లేదు. రోజూ వాకింగ్ చేసే అలవాటున్న వాళ్లు ఈ టిప్స్ పాటించండి.



- నడవాలనే ఆలోచన ఉండొచ్చు. అయితే అమాంతం కిలోమీటర్లు నడవకూడదు. ముఖ్యంగా చిన్న గోల్స్ పెట్టుకుని నడవాలి. గాయాలు తగిలినపుడు నడక జోలికి వెళ్లకూడదు.
- వాకింగ్‌కే కదా.. ఏముందీ! అనుకోకూడదు. వయసుకు తగినట్లు మంచి వాకింగ్ షూ ధరించాలి. దీంతో పాటు కాంక్రీట్ రోడ్ల మీద ఎక్కువగా నడిచినా కండరాల సమస్యను ఎదుర్కొంటారని గుర్తుంచుకోవాలి. మరీ గరుకుగా ఉండే రోడ్డు మీద వేగంగా నడవటం, పరిగెత్తడం చేయకూడదు.
- శరీరమంతా చురుగ్గా ఉండాలంటే మార్నింగ్ వాక్ మంచిది. ముఖ్యంగా సమ్మర్‌లో అధిక దూరం నడిస్తే మాత్రం డీహైడ్రేషన్ బారిన పడతారు. అందుకే తోడుగా నీళ్ల బాటిల్‌ను తీసుకెళ్లాల్సిందే. నీళ్లు తాగకపోతే నీరసపడిపోతారు. ఎనర్జీ లెవల్స్ ఉంటేనే నడక జోలికి వెళ్లాలి. అంతే కానీ ఆరోగ్యం సరిగా లేకున్నా నడవకూడదు.
- ఉదయాన్నే నడిచే ముందు వార్మప్ చేసుకోవటం మంచిది. దీని వల్ల సోమరితనం పోతుంది. చురుగ్గా ఉంటారు.
- ఒకే ప్రాంతం కాకుండా విభిన్నమైన ప్రదేశాల్లో నడవండి. ఎనర్జిటిక్‌గా అనిపిస్తుంది.
- మరీ ఎక్కువగా నడవటం వల్ల గాయాల బారిన పడవచ్చు. శరీరం సహకరిస్తేనే నడవాలి.
- కుటుంబ సభ్యులతో, స్నేహితులతో వాకింగ్‌కు వెళ్లినా మంచిదే. తద్వారా మంచి స్నేహం ఏర్పడుతుంది.
- ఫిట్‌నెస్ ఉండాలంటే నడక తప్పనిసరి. అవసరం అనుకుంటే ఇన్ని వేల అడుగులు వేయాలని గోల్ పెట్టుకోవచ్చు. తద్వారా గోల్ ఓరియెంటెడ్ వాకింగ్ అలవడుతుంది. కొద్దిసేపు బేర్‌ఫుట్‌తో నడిచినా చక్కని ఫలితం ఉంటుంది.

వేసవిలో స్నానానికి..



రుతువుల ప్రభావం మన చర్మంపై ఎక్కువగా పడుతూ ఉంటుంది. ముఖ్యంగా వేసవిలో వేడికి చర్మం పొడిబారిపోతుంది. దీని వల్ల కొందరికి చర్మం పగిలిపోతుంది. చెమట పొక్కులు వస్తాయి. ఇలాంటి సమస్యలు రాకుండా ఆయుర్వేద శాస్త్ర ప్రకారం ఔషధ గుణాలున్న దినుసులతో పిండిని తయారుచేస్తారు. దీని వల్ల రకరకాల చర్మ సమస్యలు తొలగిపోతాయి. ఆ పిండిని ఎలా తయారుచేయాలో చూద్దాం..

కావాల్సిన పదార్థాలు: పెసలు (ఒక కేజీ), గంధకచ్చూరాలు (25 గ్రాములు), బావంచాల ు(25 గ్రాములు), వట్టివేళ్లు (25 గ్రాములు), కరక్కాయ పెచ్చులు (25 గ్రాములు), శీకాకాయ (25 గ్రాములు), ఉసిరి ఒరుగు (25 గ్రాములు), కస్తూరి పసుపు (50 గ్రాములు), ముద్ద కర్పూరం (25 గ్రాములు), వేపాకు చూర్ణం (10 గ్రాములు)

తయారీ విధానం: పెసలను బాగా ఎండబెట్టి పిండి పట్టించాలి. ముద్ద కర్పూరం తప్ప మిగిలిన వాటన్నింటినీ కూడా ఎండబెట్టుకోవాలి. వీటిని ఒక సన్నటి కన్నాలు ఉన్న వస్త్రంలో వేసి జల్లెడ పట్టాలి. దానిలో ముద్ద కర్పూరాన్ని కలపాలి. ఈ మిశ్రమాన్ని పెసరపిండిలో కలిపాలి. ఇలా తయారయిన మిశ్రమంతో స్నానం చేస్తే చర్మం నిగనిగలాడుతుంది. పైన చెప్పిన పదార్థాలన్నీ అన్ని ఆయుర్వేద షాపుల్లోను లభిస్తాయి.



అమెరికాలో మోమోస్టార్స్

ఇంటికి దూరంగా విదేశాల్లో ఉన్నప్పుడు చిన్నప్పుడు తిన్న రుచులు గుర్తుకొస్తాయి. హోటల్స్ కూడా ఆ రుచుల కొరత తీర్చలేవు. దీన్ని దృష్టిలో పెట్టుకొనే- న్యూజెర్సీకి చెందిన అంకితా నాగపాల్, ఇంప్రిత్ సోదీ అనే ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు - ఫోమో మోమో ట్రక్కును ప్రారంభించారు. తాము తిన్న రుచులను అందరికీ అందించాలనే కోరికతో ప్రారంభమయిన ఈ ఇద్దరి ప్రస్థానం ఆసక్తికరం.

"మన దేశంలో బెస్ట్ మోమోలు దొరుకుతాయి" అంటారు అంకిత. ఢిల్లీలో పుట్టి పెరిగిన అంకితకు- ఎక్కడెక్కడ ఎలాంటి ఆహార పదార్థాలు దొరుకుతాయో బాగా తెలుసు. "చిన్నప్పుడు గోల్‌గప్పాలు, ఛాట్‌లు... ఇలా అన్నీ తినేవాళ్లం. కానీ నా ఆల్‌టైమ్ ఫేవరెట్ మాత్రం మోమోనే.." అంటారు అంకిత. ఆమె అమెరికాకు వెళ్లిన తర్వాత మోమోలు తినటం తగ్గిపోయింది. దీనికి రెండు కారణాలున్నాయి. మొదటిది రుచి గొప్పగా లేకపోవటం. రెండోది శుచి, శుభ్రత లేకపోవటం. ఒకసారి ఒక డిన్నర్‌లో ఇంప్రిత్‌ను అంకిత కలుసుకున్నారు. వారి సంభాషణ చాలాసేపు మోమోల గురించే సాగింది. ఆ తర్వాత కూడా ఒకరితో మరొకరు మాట్లాడుకొనేవారు. ఆ సమయంలో వారికి- ఢిల్లీలో దొరికే అసలైన మోమోలను న్యూయార్క్‌లో ఎందుకు అందించకూడదనే ఆలోచన కలిగింది.

ఎన్నో సవాళ్లు..

"ఇంట్లో మోమోలను రుచికరంగా తయారుచేయవచ్చు. కానీ ఒక ఫుడ్ ట్రక్‌లో మోమోలను అమ్మటం చాలా కష్టం" అంటారు ఇంప్రిత్. అంతేకాకుండా మార్కెట్‌లో మంచి పేరు తెచ్చుకోవటం కూడా కష్టమేనంటారామె! "మాకు మరో సవాలు కూడా ఎదురయింది. ఉత్తర భారత దేశంలో మోమోల గురించి అందరికీ తెలుసు. దక్షిణ భారత దేశంలో మోమోలను తక్కువ మంది తింటారు. న్యూజెర్సీలో దక్షిణ భారతీయుల సంఖ్య ఎక్కువ. అంతేకాకుండా మాకు అమెరికన్ కస్టమర్లు కూడా కావాలి. వారికి కూడా మోమోలంటే తెలియదు. అందువల్ల మొదట్లో మేము ఉచిత శాంపిల్స్ ఇవ్వటం మొదలుపెట్టాం. చాలామంది 'డంప్లింగ్‌కు, మోమోకు, డిమ్‌సమ్‌కు తేడా ఏమిట'ని అడిగేవారు. వారికి ఓర్పుగా తేడాలు వివరించేవాళ్లం" అంటారు అంకిత. అంతేకాకుండా దక్షిణ భారతీయులకు ఏవి నచ్చుతాయో, ఉత్తర భారతీయులకు ఏవి నచ్చుతాయో, అమెరికన్లకు ఏవి నచ్చుతాయో జాగ్రత్తగా గమనించేవారు. వీటి ఆధారంగా అందరికీ కనీసం కొన్ని పదార్థాలైనా నచ్చేలా మెనూను తయారుచేసుకున్నారు.





తేడాలేమిటి?

డంప్లింగ్, మోమో, డిమ్‌సమ్- ఈ మూడు చూడటానికి ఒకే విధంగా ఉంటాయి. కానీ వాటి మధ్య అనేక తేడాలున్నాయి. అవేమిటో చూద్దాం..

- డిమ్‌సమ్‌లు చైనాలో పుట్టాయి. వీటిల్లో మాంసం, ఆకుకూరలు, చేపలను స్టఫింగ్‌గా వాడతారు. పై పొర చాలా సన్నగా ఉంటుంది. డంప్లింగ్స్ కూడా ఈ కేటగిరికే చెందుతాయి అయితే వీటిని ఉడకపెట్టవచ్చు, బేక్ చేయవచ్చు లేదా వేయించవచ్చు.
- ఇక మోమోల విషయానికి వస్తే- ఇవి టిబెట్‌కు చెందినవి. వీటిని టిబెటన్లు ఎక్కువగా తింటారు. దలైలామా భారత్‌కు వచ్చి స్థిరపడిన తర్వాత- అనేక మంది టిబెటన్లు సిక్కిం, డార్జిలింగ్, ఢిల్లీ, లదాఖ్, ధర్మశాలలో స్థిరపడ్డారు. వారి ద్వారా ఈ మోమోలు భారత్‌లో విస్తృత ప్రచారంలోకి వచ్చాయి.
- ఒకప్పుడు మోమోలను కేవలం ఉడకపెట్టేవారు. ప్రస్తుతం రకరకాల మోమోలు అందుబాటులోకి వచ్చాయి. తందూరీ మోమోలు, ఆఫ్ఘానీ మోమోలు, చిల్లీ మోమోలు, కోడి మోమోలు... ఇలా రకరకాలు లభిస్తున్నాయి.

కాలం మారింది..

సుమారు 20 ఏళ్ల క్రితం నుంచి అమెరికాలో ఫుడ్ ట్రక్స్‌కు ఆదరణ తగ్గుతూ వచ్చింది. ఎక్కువ మంది రెస్టారెంట్స్‌కు వెళ్లటం మొదలుపెట్టారు. దీనితో ఫుడ్ ట్రక్కులను ప్రారంభించటానికి ఎక్కువ మంది ఇష్టపడేవారు కాదు. ఈ నేపథ్యంలో- అంకిత, ఇంప్రిత్‌లు తమ వ్యాపారాన్ని ప్రారంభించారు. చాలా సమయాల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితులు వ్యాపారాన్ని దెబ్బతీసేవి. దీనికి తోడు- ఒకరు వంట చేస్తే- మరొకరు ఫుడ్ ట్రక్కు దగ్గర నిలబడి కస్టమర్లకు మోమోలు అందించాల్సి వచ్చేది. దీని వల్ల శారీరక శ్రమ ఎక్కువగా ఉండేది. అయితే - ఫుడ్ ట్రక్కు దగ్గరకు వచ్చే కస్టమర్లతో నేరుగా స్నేహ సంబంధాలు ఏర్పడటానికి అవకాశం చిక్కింది. 2021లో న్యూజెర్సీలో 'స్మోర్‌గ్యాస్‌బర్గ్ ఫుడ్ ఫెస్టివల్' జరిగింది. ఈ ఫెస్టివల్‌లో వేర్వేరు ప్రాంతాలకు సంబంధించిన స్టాల్స్‌ను పెట్టారు. "అక్కడ నేను ఒక విషయాన్ని గమనించాను. చాలామందికి మోమోలు తెలియకపోవచ్చు. కానీ వారు ట్రై చేయాలనుకుంటారు. ఒక్కసారి మోమో టేస్ట్ అలవాటు అయితే- క్రమం తప్పకుండా తింటూనే ఉంటారు" అంటారు అంకిత. ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో - బటర్ గార్లిక్ నాన్‌లకు- అమెరికన్లలో మంచి డిమాండ్ ఏర్పడింది. ఆ తర్వాత వారెప్పుడు వెనక్కి తిరిగి చూసుకోలేదు. "మొదట్లో శ్రమ ఎక్కువగా ఉంటుంది. కానీ దానికి తగిన ప్రతిఫలం కూడా ఉంటుంది. వీటన్నింటి కన్నా ముఖ్యం.. మనకు నచ్చిన రుచిని అందరికీ పంచిపెడుతున్నామనే తృప్తి. దానికి మించినది ఏదీ లేదు. మా స్నేహితులు మమ్మల్ని మోమో స్టార్స్ అని ముద్దుగా పిలుస్తారు. నా ఉద్దేశంలో మన దేశం నుంచి వచ్చిన వారు ఖాళీగా ఉండకుండా ఇలాంటి ఫుడ్ ట్రక్కులను వారి వారి ప్రాంతాల్లో ప్రారంభించుకోవచ్చు. దీని వల్ల వారికి ఆదాయం కూడా లభిస్తుంది" అంటారు అంకిత.

సవాళ్లను ఎదుర్కోవడమే ఇష్టం..



ఆమెకు నటనంటే ఆసక్తి. అందుకే తొలి సినిమాకోసమే ఏకంగా ముప్ఫయ్ కేజీల బరువు పెరిగింది. బొద్దుగా కనపడేందుకు ఆమె పడిన కష్టం అంతా ఇంతా కాదు. ఆ బాలీవుడ్ నటి పేరు భూమి పడ్నేకర్. విభిన్నమైన పాత్రలతో మెప్పించే భూమి గురించి కొన్ని విశేషాలు..

భూమి పడ్నేకర్‌కు సోషల్ మీడియాలో మంచి క్రేజ్ ఉంది. ఆమెకి ఇన్‌స్టాలోనే 93 లక్షల ఫాలోవర్లు ఉన్నారు. సౌందర్య సాధనాల ఉత్పత్తుల ప్రచారాలు, తన ఫిట్‌నెస్ సంగతులు, సినిమా విశేషాలే కాకుండా పర్సనల్ లైఫ్‌నూ షేర్ చేస్తుంటుంది. యాక్టర్, క్లైమేట్ వారియర్.. అని తన ఖాతాలో రాసుకుందామె.

అలా ఇండస్ట్రీలోకి..

భూమి పడ్నేకర్ పుట్టి పెరిగింది ముంబైలో. జుహూలో చదివింది. తన తండ్రి సతీష్ పడ్నేకర్ ఎమ్మెల్యేగా పనిచేశారు. మహారాష్ట్రలో రక్షణ, కార్మిక శాఖామంత్రిగా (1980ల్లో) కూడా పని చేశారు. ఆ తర్వాత ఆయన నోటి క్యాన్సర్‌తో చనిపోయారు. భూమి అమ్మ పేరు సుమిత్ర. తన భర్త చనిపోవటం చూసి ఆ తర్వాత యాంటీ టొబాకో యాక్టివిస్ట్‌గా పని చేస్తున్నారామె. భూమి పడ్నేకర్‌కు సినిమా అంటే ఆసక్తి కాబట్టి.. పదిహేనేళ్ల వయసులోనే.. 'విస్లింగ్ ఉడ్స్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌'లో చదివింది. తన తల్లి లోన్ తీసుకుని మరీ చదివించింది. అటెండెన్స్ లేకపోవటంతో కాలేజీకి వద్దన్నారు. కట్టిన డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో యష్‌రాజ్ ఫిల్మ్స్ దగ్గర ఉద్యోగం చేసింది. అది కూడా ఆరేళ్ల పాటు దర్శకత్వ శాఖలో పనిచేసింది. అప్పుడే ఆమెకు హీరోయిన్ అవకాశం వచ్చింది. అది కూడా యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌లోనే. 'దమ్ లగా కే హైసా'లో ఆయుష్మాన్ ఖురానా జోడీగా వచ్చిన అవకాశాన్ని వదులుకోలేదు. అలా సంధ్యా తివారి పాత్రకోసం ఏకంగా ముప్ఫయ్ కేజీల బరువు పెరిగింది. ఈ కామెడీ చిత్రంలో భూమి నటనకు గానూ ఫిల్మ్‌ఫేర్ అవార్డు వరించింది. అదీ ఆమె నటనా ప్రతిభ.

విభిన్నమైన పాత్రలతో..

'టాయిలెట్- ఏక్ ప్రేమ్ కథ' చిత్రంలో అక్షయ్ కుమార్ జోడీగా నటించింది. 'శుభ్ మంగళ్ సావధాన్', 'బాల' లాంటి విభిన్నమైన చిత్రాల్లో నటించింది. 'దుర్గామతి' తర్వాత ఆమె పవర్‌ఫుల్ పాత్రల్లో నటించాలనుకుంది. 'సినిమా అంటే పురుషులదే రాజ్యం. మేల్ డామినేటెడ్ ప్రపంచంలో ప్రతిభను చూపించాల్సిందే. వాస్తవానికి నటుల్ని జెండర్స్‌తో పోలిక పెట్టడం మంచిది కాదు. పాత్రకు న్యాయం చేసినప్పుడే స్క్రీన్‌మీద డామినేట్ చేయగలం. ఉమెన్ సెంట్రిక్ సినిమాలకు ఆదరణ అద్భుతంగా ఉండటం సంతోషకరం' అంటుంది భూమి. 'ఒక పాత్రనుంచి మరో పాత్రలోకి మారటం ఇష్టం. అలా మారటానికి ఎక్కువ సమయం కూడా తీసుకోను. నా చుట్టూ మంచి ఎనర్జీస్ ఉండేవాళ్లు ఉన్నారు. పాజిటివ్ థింకింగ్‌తో ఉంటా. అందుకే మరింత ఎనర్జీగా పని చేస్తా. సవాళ్లను ఎదుర్కోవటానికి ముందుంటాను. ఆ మాటకొస్తే సవాళ్లంటేనే ఇష్టమంటు'ందీ బాలీవుడ్ భామ.

ఓటీటీలోనూ హవా..

భూమి పడ్నేకర్ ఇటీవలే నెట్‌ఫ్లిక్స్ కోసం 'భక్షక్'లో నటించింది. ఆమె నటనకు ప్రేక్షకుల ప్రశంసలు దక్కాయి. 'దల్దాల్' అనే క్రైమ్ థ్రిల్లర్‌లో నటించింది. ఇందులో డీసీపీ పాత్రలో కనిపించింది. 'ఓటీటీలో ఇలాంటి మంచి ఆదరణ దక్కుతుందని అనుకోలేదు. ఇకమీదట ఈ ప్లాట్‌ఫామ్‌లోనూ రన్ చేయాల్సిందే' అంటుంది. 'ఏదీ ఊరికే రాదు. ఎప్పుడైనా హెల్తీ, హ్యాపీగా ఉండటమే ఇష్టం. నా గురించి ఎక్కువ ఆలోచిస్తా. ఫిట్‌నెస్ విషయంలో సీరియస్‌గా ఉంటా. హీరో డామినేటెడ్ ఫీల్డ్‌లో నేను అసలైన హీరోగా ఫీలవుతా' అంటోన్న భూమి పడ్నేకర్ మాత్రం తిరుగులేని బాలీవుడ్ యాక్టివిస్ట్ అని చెప్పుకోవచ్చు.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.? లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/uv4ynfk లో చదవండి.

జీర్ణక్రియ సాఫీగా...

వేసవిలో తినే ఆహారం పట్ల కాస్త శ్రద్ధ వహించాలి. ఏది పడితే అది తింటే కడుపు ఉబ్బరం, తిన్న ఆహారం సాఫీగా జీర్ణం కాకపోవటం, డీహైడ్రేషన్.. లాంటి సమస్యలతో ఇబ్బందులు పడే అవకాశం ఉంది. అందుకే ఇంట్లో ఉండే కొన్ని పదార్థాలను తీసుకుంటే ఉపశమనం పొందవచ్చు ఇలా..

- పుదీనా ఆకుల్లో ఉండే కొన్ని రకాల ఎంజైమ్‌ల వల్ల తిన్న ఆహారం సులువుగా జీర్ణం అవుతుంది. అందుకే నిమ్మరసంలో పుదీనా వేసి తాగటం, పుదీనా చట్నీ చేసుకోవటం లేదా పుదీనా టీ తాగితే చక్కని ఫలితం ఉంటుంది.
- ఈ ఎండాకాలంలో నాన్‌వెజ్‌ను తగ్గించటం మంచిది. దీనివల్ల అనేక సమస్యలు వస్తాయి. ఇకపోతే సోంపు చక్కని ఆయుర్వేదిక్ మెడిసిన్‌గా పని చేస్తుంది. సోంపు గింజల్ని తింటే అందులోని యాంటీ ఇన్ఫ్లమేషన్ గుణాల వల్ల తిన్న ఆహారం సులువుగా జీర్ణం అవుతుంది. ముఖ్యంగా అసిడిటీ తగ్గుతుంది.
- ధనియాలను నీళ్లలో నానబెట్టి ఆ నీళ్లను తాగితే జీర్ణాశయం ఆరోగ్యంగా ఉంటుంది. అందుకే వంటల్లో ధనియాలను వాడతారు.
- సమ్మర్‌లో తరచుగా మంచి నీళ్లను తాగాలి. దీంతో పాటు ఈ కాలంలో కొబ్బరి నీళ్లు తాగటం మంచిది. ఇందులోని మినరల్స్, ఎలక్ట్రోలైట్స్ వల్ల జీర్ణక్రియ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. కొబ్బరినీళ్లు తాగటం వల్ల డీహైడ్రేషన్‌కు గురికారు. దీంతో పాటు రక్తంలోని పీహెచ్ వాల్యూ అదుపులో ఉంటుంది.
- పొట్ట ఆరోగ్యంగా ఉండాలంటే అల్లం టీ లేదా అల్లం చట్నీ లాంటివి సమ్మర్‌లో తీసుకోవాలి. అల్లం తీసుకోవటం వల్ల చిన్నపాటి నొప్పులు తగ్గిపోతాయి. కడుపులో అసిడిటీకి సంబంధించిన డిస్‌కంఫర్ట్ రాకుండా నాన్‌వెజ్ ఆహారంలో అల్లం వాడుతుంటారు.
- పొట్ట ఉబ్బరంగా ఉంటే జీరా డ్రింక్ తాగమంటారు. ఎందుకంటే జీరా తాగటం వల్ల ఉపశమనం లభిస్తుంది. ఈ జీలకర్రను పెనంమీద వేయించి దాన్ని పొడి చేసి నీళ్లలో కలిపి తాగినా.. చక్కని ఫలితం ఉంటుంది.
- ఫైబర్‌తో పాటు పొటాషియం ఉండే అరటిపండును తినటం వల్ల ఎండాకాలంలో పొట్టకు సంబంధించిన సమస్యలనుంచి బయటపడవచ్చు. తిన్న ఆహారం సులువుగా జీర్ణమవుతుంది.
- సమ్మర్‌లో మజ్జిగతో పాటు నిమ్మరసం తాగటం వల్ల కూడా జీర్ణక్రియ సమస్యలను తగ్గించుకోవచ్చు.





'అరణ్మనై' తమిళంలో సూపర్ హిట్ ఫ్రాంచైజీ. తెలుగులో విడుదలైన అన్ని వర్షన్లు హిట్ అయ్యాయి. ఈ హారర్ కామెడీ సిరీస్ నాలుగో ఫ్రాంచైజీ తెలుగులో 'బాక్' పేరుతో వస్తోంది. స్వీయ నిర్మాణంలో సుందర్ సి నటస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో తమన్నా, రాశి ఖన్నా నటిస్తున్నారు. శివానీ పాత్రను పోషిస్తున్న తమన్నా లుక్ పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'బాక్' చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా తెలుగు హక్కుల్ని సొంతం చేసుకున్న ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ నెలలోనే భారీగా విడుదల చేయడానికి ప్లాన్ చేస్తోంది. వెన్నెల కిశోర్, శ్రీనివాసులు, ఢిల్లీ గణేశ్, కోవై సరళ కీలక పాత్రలు పోషించారు.

శివానీగా తమన్నా

ఎలాంటి సాయానికైనా సిద్ధం

- మల్లు భట్టివిక్రమార్క



నటి అంజలి నటించిన 50వ చిత్రం 'గీతాంజలి మళ్లీ వచ్చింది'. శివ తుర్లపాటి దర్శకత్వం వహించారు. రచయిత కోనవెంకట్, ఎంవీవీ సత్యనారాయణ సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. మంగళవారం సాయంత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ "మధ్య తరగతి వాళ్లని మరో ప్రపంచంలోకి తీసుకెళ్లేదే సినిమా. ప్రభుత్వపరంగా ఇండస్ట్రీకి ఎలాంటి సాయం కావాలన్నా చేసేందుకు సిద్ధం" అని చెప్పారు. దర్శకుడు శివ తుర్లపాటి మాట్లాడుతూ "ఈ మూవీలో ఇంటర్వెల్, క్లైమాక్స్‌ను అస్సలు మిస్ అవ్వద్దు" అని అన్నారు. నిర్మాత కోనవెంకట్ మాట్లాడుతూ "గీతాంజలి చిన్న కాన్సెప్ట్‌తో తీశాం. పెద్ద హిట్ అయ్యింది. సీక్వెల్ కూడా సూపర్ సక్సెస్ సాధిస్తుంది" అని ధీమా వ్యక్తం చేశారు. హీరోయిన్ అంజలి మాట్లాడుతూ "మొదటి భాగం కంటే రెండో భాగం మరింత ఎంటర్టైన్ చేస్తుంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రచయిత విజయేంద్రప్రసాద్, సిద్ధు జొన్నలగడ్డ, డైరెక్టర్స్ వశిష్ఠ, నందినిరెడ్డి, హేమంత్ మధుకర్, నిర్మాత టీజీ విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

మే 4న ఘనంగా డైరెక్టర్ డే వేడుకలు



దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతి (మే 4)ని తెలుగు దర్శకుల సంఘం డైరెక్టర్స్ డే గా సెలబ్రేట్ చేస్తోంది. ఈ ఏడాది మరింత భారీగా ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ వివరాలను అసోసియేషన్ అధ్యక్షుడు వీరశంకర్ వెల్లడిస్తూ ' డైరెక్టర్స్ డే ను ఎల్బీ స్టేడియంలో భారీగా నిర్వహించడం ఇదే మొదటి సారి. ఈ ఈవెంట్ ద్వారా వసూలయ్యే మొత్తాన్ని అసోసియేషన్ సంక్షేమం కోసం వినియోగిస్తాం. ఈ ఈవెంట్ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన కమిటీలో అనిల్ రావిపూడి, శివ నిర్వాణ, నందిని రెడ్డి తదితరులు ఉంటారు. పరిశ్రమలోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నాం' అన్నారు. దర్శకుల సంఘానికి ఇదొక బెంచ్ మార్క్ ఈవెంట్ అవుతుందని నందినీ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమం గురించి చెప్పగానే త్రివిక్రమ్, సుకుమార్ వంటి పెద్ద దర్శకులందరూ సపోర్ట్ చేయడానికి ముందుకు వచ్చారని సాయి రాజేశ్ చెప్పారు. గతంలో వజ్రోత్సవాలు ఏ స్థాయిలో జరిగాయో అంత ఘనంగా డైరెక్టర్స్ డే ను సెలబ్రేట్ చేస్తామని వశిష్ఠ చెప్పారు.

ఆధ్యాత్మికం.. సాహసోపేతం

అభిషేక్ పిక్చర్స్ అధినేత అభిషేక్ నామా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'నాగబంధం'. ది సీక్రెట్ ట్రెజర్.. అనేది ట్యాగ్‌లైన్. ఆధ్యాత్మిక, సాహసోపేతమైన అంశాలు కలిగిన ఓ పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు అభిషేక్ నామా. కేజీఎఫ్‌లో నటించిన అవినాష్‌ను అఘోరా పాత్రలో పరిచయం చేస్తూ ఓ వీడియో విడుదల చేశారు. హై బడ్జెట్‌తో, అద్భుతమైన



విజువల్స్‌తో సాహసాల ప్రపంచంలోకి ఈ సినిమా తీసుకెళుతుందని నిర్మాత మధుసూదన్‌రావు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: అభే. ఫొటోగ్రఫీ: సౌందర్‌రాజన్ ఎస్, సమర్పణ: దేవాన్ష్ నామా.

మళ్లీ అదే రోజున..




నిజాయితీ కలిగిన న్యూస్ రిపోర్టర్‌గా నారా రోహిత్ నటించిన 'ప్రతినిధి 2' చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. సరిగ్గా పదేళ్ల క్రితం 'ప్రతినిధి' చిత్రం కూడా ఏప్రిల్ 25నే విడుదల కావడం విశేషం. నారా రోహిత్ తన ఇంటెన్స్ యాక్టింగ్‌తో ఆకట్టుకుంటారని దర్శకుడు మూర్తి చెప్పారు. సిరీ లెల్లా హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని కుమార్ రజాబత్తుల, ఆంజనేయులు శ్రీ తోట, సురేంద్రనాథ్ బొల్లినేని నిర్మించారు.



భారీ మొత్తం చెల్లించి...

జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. మిక్కిలినేని సుధాకర్, కె హరికృష్ణ నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ఫస్ట్ పార్ట్ అక్టోబర్ 10న విడుదలవుతోంది. ఈ సినిమా ఉత్తరాది థియేట్రికల్ రైట్స్‌ను ధర్మ ప్రొడక్షన్స్ అధినేత కరణ్ జోహార్, ఏఏ ఫిల్మ్స్ ఫౌండర్ అనిల్ తడాని భారీ మొత్తం చెల్లించి సొంతం చేసుకున్నారు.
ఈ క్రేజీ డీల్‌తో నార్త్‌లోనూ 'దేవర' చిత్రం కలెక్షన్ల సునామీ సృష్టిస్తుందని చిత్ర బృందం, అభిమానులు ఆశిస్తున్నారు.













బిజినెస్

డీప్ ఫేక్ వీడియోలతో జర జాగ్రత్త

» ఎన్ఎస్ఈ ఎండీ

న్యూఢిల్లీ: డీప్ ఫేక్ వీడియో, ఆడియోల బెడద స్టాక్ మార్కెట్‌కీ పాకింది. ఎన్ఎస్ఈ ఎండీ, సీఈఓ ఆశిష్‌కుమార్ చౌహాన్ పెట్టుబడి సలహాల పేరుతో కొన్ని ఫేక్ వీడియోలు, ఆడియోలు మార్కెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ఇటువంటి ఫేక్ వీడియోలు, ఆడియోలపై మదుపరులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఎన్ఎస్ఈ ఉద్యోగులు ఎవరికీ పెట్టుబడి సలహాలు ఇచ్చే అధికారం లేదనే విషయాన్ని మదుపరులు గుర్తు పెట్టుకోవాలని కోరింది.

మారుతి కార్ల ధర పెంపు

న్యూఢిల్లీ: మారుతి స్విఫ్ట్, గ్రాండ్ విటారా కార్ల ధరలు పెరిగాయి. స్విఫ్ట్ కారు ధర రూ.25,000; గ్రాండ్ విటారాలో సిగ్మా వేరియెంట్ ధర రూ.19,000 పెంచినట్టు మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ ఒక రెగ్యులేటరీ సందేశంలో తెలియచేసింది. తక్షణం ఈ ధరల పెంపు అమలులోకి వచ్చింది.

మైక్రోసాఫ్ట్‌తో టెక్ మహీంద్రా జట్టు

న్యూఢిల్లీ: మైక్రోసాఫ్ట్ అనలిటిక్స్ ప్లాట్‌ఫాం 'ఫ్యాబ్రిక్' వినియోగం సులభతరం కానుంది. ఇందుకోసం మైక్రోసాఫ్ట్-టెక్ మహీంద్రా మధ్య ఒక భాగస్వామ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం రెండు కంపెనీలు మైక్రోసాఫ్ట్ ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌వేర్ వినియోగాన్ని సులభతరం చేసేలా ఏకీకృత వర్క్‌బెంచ్‌ను అభివృద్ధి చేస్తాయి. ఈ కొత్త వర్క్ బెంచ్‌తో కంపెనీలు మరింత వేగంగా ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌వేర్‌కు మారగలుగుతాయని టెక్ మహీంద్రా ఒక ప్రకటనలో తెలిపింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,110 ▲	66,100 ▲	89,000 ▲
ముంబై	71,820 ▲	65,790 ▲	82,340 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

11వ తేదీ

హైదరాబాద్	375	విజయవాడ	390
చిత్తూరు	458	విశాఖపట్నం	405
గోదావరి	390	వరంగల్	377

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	156	గోదావరి	152
వరంగల్	156	విజయవాడ	152
కరీంనగర్	156	గుంటూరు	152
మహబూబ్‌నగర్	156	ఒంగోలు	152
కర్నూలు	156	చిత్తూరు	151
విశాఖపట్నం	134		

అంబానీతో మస్క్ జట్టు!



» భారత్‌లో సంయుక్తంగా ఈవీ ప్లాంట్ ఏర్పాటు దిశగా చర్చలు!

» ఈ నెలలోనే భారత్‌కు మస్క్.. పెట్టుబడి ప్రణాళికపై ప్రకటన!

న్యూఢిల్లీ: దేశంలో ఆధునిక ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీని ప్రోత్సహించడంతోపాటు అంతర్జాతీయ కంపెనీల పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్రప్రభుత్వం కొత్త ఈవీ పాలసీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన విద్యుత్ కార్ల తయారీ కంపెనీ టెస్లా భారత ప్రవేశంపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం టెస్లా స్థానిక భాగస్వామి కోసం అన్వేషిస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి భాగస్వామ్యంలో భారత్‌లో ఈవీ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో టెస్లా చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. నెలరోజులుగా సాగుతున్న చర్చలింకా ప్రాథమిక దశలో ఉన్నాయని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఓ ఆంగ్ల దినపత్రిక కథనం పేర్కొంది. అయితే, ఈ జేవీ ద్వారా రిలయన్స్ వాహన రంగంలోకి ప్రవేశించడం లేదని.. కేవలం టెస్లా కార్ల తయారీకి అవసరమైన ప్లాంట్ నిర్మాణంతో పాటు అనుబంధ సామర్థ్యాలను సమకూర్చనుందన్నారు. ఈవీ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి టెస్లాతో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సంప్రదింపులు జరుపుతోంది. ఈ విషయంలో ఏపీ, మహారాష్ట్ర, గుజరాత్ కూడా పోటీలో ఉన్నాయి.

మోదీతో మస్క్ భేటీ

టెస్లా భారత ఎంట్రీపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి. ఈ నెలలో మస్క్ భారత్‌కు రానున్నారని, ఢిల్లీలో ప్రధాని మోదీని కలిశాక మన దేశంలోకి టెస్లా ప్రవేశంతో పెట్టుబడులు, ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రణాళికను ప్రకటించనున్నారని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ కథనం పేర్కొంది. మస్క్ భారత యాత్ర ఎజెండా ఇప్పటికీ మారే అవకాశం ఉందన్నారు. అయితే, ఈ విషయంపై స్పందించేందుకు మన ప్రధాని కార్యాలయం, టెస్లా నిరాకరించాయి. భారత్‌లోకి ప్రవేశించే ప్రయత్నాల్లో ఉన్న టెస్లా గత కొద్ది నెలలుగా ఎలక్ట్రిక్ వాహనాల దిగుమతి సుంకం రాయితీల కోసం పైరవీ చేస్తూ వచ్చింది. కాగా, టెస్లా వంటి అంతర్జాతీయ ఈవీ కంపెనీలకు మార్గం సుగమం చేసేందుకు గతనెలలో కేంద్ర ప్రభుత్వం కొత్త ఈవీ పాలసీని ప్రకటించింది. కనీసం 50 కోట్ల డాలర్ల (సుమారు రూ.4,150 కోట్లు) పెట్టుబడితో భారత్‌లో ఈవీల ప్లాంట్‌ను ఏర్పాటు చేసే గ్లోబల్ కంపెనీలకు ప్రభుత్వం దిగుమతి సుంకం రాయితీలు, ఇతర ప్రోత్సాహకాలు కల్పించనుంది.

సెన్సెక్స్.. రికార్డుల ఎక్స్‌ప్రెస్

తొలిసారి 75,000 ఎగువన ముగిసిన సూచీ.. రూ.402.19 లక్షల కోట్లకు మార్కెట్ సంపద



ముంబై: స్టాక్‌మార్కెట్లో వరుసగా మూడో రోజూ రికార్డుల మోత మోగింది. సెన్సెక్స్ తొలిసారిగా 75,000 ఎగువన ముగియగా.. నిఫ్టీ సైతం సరికొత్త శిఖరాలను అధిరోహించింది. ఎఫ్ఎంసీజీ, ఎనర్జీ, మెటల్ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్ ఒక దశలో 421.44 పాయింట్లు పెరిగి 75,105కి ఎగబాకింది. చివరికి 354.45 పాయింట్ల లాభంతో 75,038.15 వద్ద జీవనకాల గరిష్ఠ స్థాయిలో క్లోజైంది. నిఫ్టీ కూడా 133 పాయింట్లు పెరిగి ఆల్‌టైమ్ గరిష్ఠం 22,775.70ని తాకిచివరికి 111.05 పాయింట్ల లాభంతో 22,753.80 వద్ద సరికొత్త గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 21 లాభపడ్డాయి. ఐటీసీ షేరు 2.49 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. మారుతి సుజుకీ షేరు మాత్రం అత్యధికంగా 1.66 శాతం క్షీణించింది.

నేడు మార్కెట్‌కు సెలవు

రంజాన్ సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ గురువారం సెలవు పాటించనున్నాయి. మార్కెట్లో మళ్లీ ట్రేడింగ్ శుక్రవారం జరగనుంది.

బీఎస్ఈ మార్కెట్ క్యాప్..

ఈ ర్యాలీతో ఈక్విటీ మదుపరుల సంపద ఒక్క రోజులోనే రూ.2.27 లక్షల కోట్లు పెరిగి సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి రూ.402.19 లక్షల కోట్లకు (4.83 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ.400 లక్షల కోట్ల మైలురాయిని తొలిసారిగా సోమవారం చేరుకుంది.

మూడో అతిపెద్ద ఎయిర్‌లైన్స్ ఇండిగో

ఇండిగో బ్రాండ్‌నేమ్‌తో విమానయాన సేవలందిస్తోన్న ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేరు వరుసగా నాలుగో రోజు ఎగబాకి సరికొత్త రికార్డు గరిష్ఠానికి చేరుకుంది. బీఎస్ఈ ట్రేడింగ్‌లో ఈ షేరు ఒకదశలో 5 శాతం పెరిగి రూ.3,815.10 వద్ద కొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 4.54 శాతం లాభంతో రూ.3,796.55 వద్ద ముగిసింది. షేర్ల ర్యాలీతో ఎయిర్‌లైన్స్ మార్కెట్ విలువ రూ.1,46,539 కోట్లకు (17.5 బిలియన్ డాలర్లు) పెరిగింది. మార్కెట్ క్యాపిటలైజేషన్‌పరంగా ఇండిగో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఎయిర్‌లైన్స్‌గా అవతరించింది. డెల్టా ఎయిర్ (30.4 బిలియన్ డాలర్లు), ర్యాన్‌ఎయిర్ హోల్డింగ్స్ (26.5 బిలియన్ డాలర్లు) మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో ప్రపంచ నం.1, 2 ఎయిర్‌లైన్స్‌గా కొనసాగుతున్నాయి.

రూ.72,000 దాటిన తులం బంగారం

పసిడి రికార్డుల ర్యాలీ మూడో రోజూ కొనసాగింది. బుధవారం ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర మరో రూ.160 పెరిగి తొలిసారిగా రూ.72,000కు చేరుకుంది. కిలో వెండి సైతం రూ.200 పెరుగుదలతో రూ.84,700కు ఎగబాకింది. ఇంటర్నేషనల్ స్పాట్ మార్కెట్లో ఔన్స్ బంగారం 2,356 డాలర్లు, వెండి 28 డాలర్ల ఎగువన ట్రేడయ్యాయి.

ముత్తూట్ ఫిన్‌కార్ప్ రూ.360 కోట్ల సమీకరణ

నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్ల జారీ ద్వారా రూ.360 కోట్ల వరకు సమీకరించనున్నట్లు ముత్తూట్ ఫిన్‌కార్ప్ వెల్లడించింది. బుధవారం ప్రారంభమైన ఈ ఇష్యూ 25న ముగియనుంది.

ఈక్విటీ ఫండ్లలోకి రూ.22,633 కోట్లు

గతనెల ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి నికరంగా రూ.22,633 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఫిబ్రవరిలో వచ్చిన రూ.26,833 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్లతో పోలిస్తే మాత్రం 16 శాతం తగ్గాయి. అయితే, వరుసగా 37 నెలలుగా ఈక్విటీ ఫండ్లలోకి పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోందని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) తెలిపింది.

2029 నాటికి సెన్సెక్స్ 1,50,000!

1979లో 100 పాయింట్లతో ఏర్పాటైన బీఎస్ఈ సెన్సెక్స్. గడిచిన 45 ఏళ్లలో 75,000 పాయింట్లకు పుంజుకుంది. అంటే, ఏటా 15.85 శాతం చొప్పున వృద్ధి చెందుతూ వచ్చింది. అంతేకాదు, సూచీ ఐదేళ్లలోనే 37,500 స్థాయి నుంచి 75,000కు చేరుకుంది. అనగా, ఏటేటా 15 శాతం చొప్పున వృద్ధిని కనబరిచింది. మార్కెట్లో ఇదే ట్రెండ్ కొనసాగితే, మరో ఐదేళ్లలో (2029 నాటికి) సెన్సెక్స్ రెండింతలై 1,50,000 పాయింట్లకు చేరుకునే అవకాశం ఉంది.

- మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఛైర్మన్ రామ్‌దేవ్ అగర్వాల్

ఎంజీ మోటార్స్ హెక్టర్ బ్లాక్ స్టార్మ్



హైదరాబాద్: బ్రిటన్‌కు చెందిన ఎంజీ మోటార్స్ బహుళ జనాదరణ పొందిన హెక్టర్ ఎస్‌యూవీలో బ్లాక్ స్టార్మ్ ఎడిషన్‌ను హైదరాబాద్ మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఈ కారు వెలుపలి, లోపలి భాగాలన్నీ చూపరులను ఇట్టే ఆకట్టుకునేలా నల్లరంగులో ఉంటాయి. ఈ కారు 5, 6, 7 సీట్ల వేరియెంట్లలో అందుబాటులో ఉంటుంది.ఇది రూ.21.24 లక్షల ప్రవేశ ధరలో మార్కెట్లోకి వచ్చింది. ఎంజీ మోటార్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సతీందర్ సింగ్ బజ్వా ఈ కారు విడుదల చేశారు. స్మార్ట్ కీతో పుష్ బటన్ స్టార్ట్/స్టాప్ ఇంజన్ ఈ కారు ప్రత్యేకత. 100 వాయిస్ కమాండ్లు సహా 75 కనెక్టెడ్ ఫీచర్లు ఇందులో ఉన్నాయి.

మార్కెట్‌లోకి 'పల్సర్ ఎన్250' బైక్

» ఎక్స్ షోరూమ్ ధర రూ.1,50,131



హైదరాబాద్: బజాజ్ ఆటో ఎన్ సీరిస్‌లో 'పల్సర్ ఎన్ 250' పేరుతో మరో బైక్‌ను విడుదల చేసింది. ఈ 249.09 సీసీ బైక్‌లో కంపెనీ స్విచ్చబుల్ ట్రాక్షన్ కంట్రోల్, మూడు రకాల ఏబీఎస్ రైడ్ మోడ్స్, అప్‌సైడ్-డౌన్ సైడ్ ఫోర్క్ సస్పెన్షన్, బ్లూటూత్ కనెక్టివిటీతో డిజిటల్ కన్సోల్, టర్న్ బై టర్న్ నావిగేషన్ వంటి అనేక అత్యాధునిక ఫీచర్స్ జోడించింది. హైదరాబాద్‌లో ఈ బైక్ ఎక్స్‌షోరూమ్ ధర రూ.1,50,131 అని కంపెనీ ప్రతినిధి ఒకరు చెప్పారు. పన్నులతో కలిపి ఆన్‌రోడ్ ధర రూ.1.7 లక్షల వరకు ఉంటుందని అంచనా. 'పల్సర్ ఎన్ 250' బైక్ ద్వారా ప్రీమియం బైక్స్ మార్కెట్‌లో కనీసం పది శాతం వాటా సంపాదించాలని బజాజ్ ఆటో లక్ష్యంగా పెట్టుకుంది.

మే 1 నుంచి వన్ ప్లస్ ఉత్పత్తుల అమ్మకం నిలిపేస్తాం

రిటైలర్ల సంఘం హెచ్చరిక

హైదరాబాద్: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు కంపెనీ ఎలాంటి చొరవ తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ మే 1వ తేదీ నుంచి వన్ ప్లస్ ఉత్పత్తుల అమ్మకాలు నిలిపివేస్తామని దక్షిణ భారత వ్యవస్థీకృత రిటైలర్ల సంఘం (ఓఆర్ఏ) హెచ్చరించింది. వారు ఈ మేరకు వన్ ప్లస్ టెక్నాలజీ ఇండియా సేల్స్ డైరెక్టర్ రంజిత్ సింగ్‌కు ఒక లేఖ రాశారు. గత ఏడాది కాలంగా తాము ఈ సమస్యలను పలుమార్లు కంపెనీ దృష్టికి తెచ్చినా ఎలాంటి స్పందన కనిపించలేదని, ఫలితంగా తాము కఠిన నిర్ణయం తీసుకోవలసివచ్చిందని తెలిపారు. వన్ ప్లస్ ఉత్పత్తుల విక్రయంపై తమకు చాలా తక్కువ మార్జిన్లు వస్తున్నాయని, ఫలితంగా వ్యాపారం సవాలుగా మారిందని వారు వెల్లడించారు. వారెంటీ, సర్వీస్ క్లెయిమ్‌ల పరిష్కారంలో తీవ్ర జాప్యం కారణంగా కస్టమర్లు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారని ఇది తమకు అదనపు భారంగా పరిణమించిందని తెలియచేశారు. ఈ నెలాఖరు లోగా సానుకూలంగా స్పందించి ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆ సంఘం నాయకులు కోరారు.

రాజస్థాన్‌కు ఝలక్

ఆఖరి బంతికి గుజరాత్ గెలుపు

- రాణించిన గిల్
- రషీద్ మెరుపులు
- సంజు, పరాగ్ ఇన్నింగ్స్ వృథా



రషీద్ (11 బంతుల్లో 24 నాటౌట్)



గిల్ (44 బంతుల్లో 72)

జైపూర్: వరుస విజయాలతో దూసుకెళ్తున్న రాజస్థాన్ రాయల్స్‌కు గుజరాత్ టైటాన్స్ ఓటమి రుచి చూపించింది. బుధవారం ఆఖరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో గుజరాత్ 3 వికెట్లతో రాజస్థాన్‌పై గెలిచింది. తొలుత రాజస్థాన్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 196 పరుగులు చేసింది. సంజూ శాంసన్ (38 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 68 నాటౌట్), రియాన్ పరాగ్ (48 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 76) అర్ధ శతకాలు వృథా అయ్యాయి. రషీద్, ఉమేశ్, మోహిత్ తలో వికెట్ తీశారు. లక్ష్యాన్ని గుజరాత్ ఓవర్లన్నీ ఆడి 199/7 స్కోరు చేసి నెగ్గింది. శుభ్‌మన్ గిల్ (44 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 72), సాయి సుదర్శన్ (35) రాణించగా.. ఆఖర్లో రషీద్ ఖాన్ (11 బంతుల్లో 4 ఫోర్లతో 24 నాటౌట్) సత్తా చాటాడు. కుల్దీప్ సేన్ 3, చాహల్ 2 వికెట్లు పడగొట్టారు. వర్షం కారణంగా టాస్ కొంత ఆలస్యమైంది. రషీద్ ఖాన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

నడిపించిన గిల్..: ఛేదనలో సుదర్శన్, కెప్టెన్ గిల్ తొలి వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యంతో నిలకడైన ఆరంభాన్నిచ్చారు. ఫోర్‌తో ఖాతా తెరిచిన సుదర్శన్.. ఆ తర్వాత సిక్స్ బాదాడు. మరోవైపు కేశవ్ బౌలింగ్‌లో సిక్స్‌తో టచ్‌లోకి వచ్చిన గిల్.. అవేశ్ బౌలింగ్‌లో 4,6 కొట్టడంతో పవర్‌ప్లేను గుజరాత్ 44/0తో ముగించింది. అయితే, సుదర్శన్‌ను ఎల్బీ చేసిన కుల్దీప్.. రాజస్థాన్‌కు తొలి బ్రేక్ అందించాడు. ఈ దశలో వేడ్ (4), గిల్ నెమ్మదిగా ఆడడంతో సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతూ పోయింది. చివరి 10 ఓవర్లలో టైటాన్స్‌కు 120 రన్స్ కావాల్సి ఉండగా.. వర్షం కారణంగా ఆటకు చిన్నపాటి బ్రేక్ వచ్చింది. తిరిగొచ్చిన తర్వాత వేడ్, అభినవ్ మనోహర్ (1)ను సేన్ అవుట్ చేయడంతో టైటాన్స్ 79/3తో ఇబ్బందుల్లో పడినట్టు కనిపించింది. కానీ.. గిల్, విజయ్ శంకర్ (16) నాలుగో వికెట్‌కు 32 పరుగులు జోడించారు. అయితే, శంకర్‌తో పాటు హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్న గిల్‌ను చాహల్ పెవిలియన్ చేర్చాడు. టైటాన్స్ విజయానికి చివరి 24 బంతుల్లో 59 పరుగులు కావాల్సి ఉండగా.. అశ్విన్ వేసిన 17వ ఓవర్‌లో తెవాటియా (22), షారుక్ (14)లు రెండు ఫోర్లు, సిక్స్‌తో 17 పరుగులు రాబట్టారు. అయితే, ఆ తర్వాతి ఓవర్‌లో షారుక్‌ను అవేశ్ ఎల్బీ చేశాడు. 19వ ఓవర్‌లో సేన్ 20 పరుగులు సమర్పించుకోవడంతో.. మ్యాచ్ సమీకరణం మారిపోయింది. చివరి ఓవర్‌లో గుజరాత్ గెలుపునకు 15 పరుగులు కావాల్సి ఉండగా.. రషీద్ 2 ఫోర్లు బాదాడు. దీంతో లక్ష్యం 2 బంతుల్లో 4 రన్స్‌కు దిగొచ్చింది. రెండు పరుగులు తీసిన తెవాటియా రనౌట్ అయ్యాడు. చివరి బంతికి 2 రన్స్ అవసరమవగా.. రషీద్ బౌండ్రీ బాది టైటాన్స్‌ను గెలిపించాడు.

పరాగ్, సంజూ షో..: నెమ్మదిగా ఆరంభించినా.. ఫామ్‌లో ఉన్న శాంసన్, పరాగ్ అదరగొట్టడంతో రాజస్థాన్ సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. వీరిద్దరూ మూడో వికెట్‌కు 78 బంతుల్లో 130 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకొన్నారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాయల్స్‌కు ఓపెనర్లు జైస్వాల్ (24), బట్లర్ (8) దూకుడైన ఆరంభాన్ని అందించలేకపోయారు. ఐదు బౌండ్రీలు బాదిన జైస్వాల్‌ను ఉమేశ్ అవుట్ చేయగా.. గత మ్యాచ్‌లో శతకం సాధించిన బట్లర్ (8)ను రషీద్ బోల్తా కొట్టించాడు. దీంతో పవర్‌ప్లే ముగిసేసరికి రాజస్థాన్ 43/2తో నిలిచింది. అయితే, మధ్య ఓవర్లలో స్పిన్నర్లు నూర్, రషీద్ పొదుపుగా బౌలింగ్ చేయడంతో.. శాంసన్, పరాగ్ స్ట్రయిక్ రొటేట్ చేస్తూ స్కోరు బోర్డును నడిపించారు. పేలవ ఫీల్డింగ్ కారణంగా రెండుసార్లు బతికి పోయిన పరాగ్.. వీలుచిక్కినప్పుడల్లా షాట్లు ఆడుతూ పరుగుల వేగం పెంచాడు. 13వ ఓవర్‌లో నూర్ బౌలింగ్‌లో పరాగ్ రెండు సిక్స్‌లతో టీమ్ స్కోరును సెంచరీ మార్క్ దాటించాడు. అదే జోరులో మరో సిక్స్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. మరోవైపు క్రమంగా పుంజుకొన్న శాంసన్.. 15వ ఓవర్‌లో స్పెన్సర్ బౌలింగ్‌లో 4,4,6తో 15 పరుగులు రాబట్టాడు. డెత్ ఓవర్లలో వీరిద్దరూ ధాటిగా ఆడుతూ రన్స్ రాబట్టారు. అయితే, 19వ ఓవర్‌లో మోహిత్ బౌలింగ్‌లో సిక్స్ బాదిన పరాగ్.. అదే ఓవర్‌లో శంకర్ పట్టిన అద్భుత క్యాచ్‌కు వెనుదిరిగాడు. ఆఖరి ఓవర్‌లో హెట్‌మయర్ (13 నాటౌట్), శాంసన్ చెరో సిక్స్‌తో జట్టు స్కోరు 190 పరుగులు దాటింది. రాయల్స్ బ్యాటర్ల ధాటికి గుజరాత్ చివరి 5 ఓవర్లలో 62 పరుగులు సమర్పించుకొంది.

స్కోరుబోర్డు

రాజస్థాన్: జైస్వాల్ (సి) వేడ్ (బి) ఉమేశ్ 24, బట్లర్ (సి) తెవాటియా (బి) రషీద్ 8, సంజూ (నాటౌట్) 68, పరాగ్ (సి) శంకర్ (బి) మోహిత్ 76, హెట్‌మయెర్ (నాటౌట్) 13, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 196/3; వికెట్ల పతనం:** 1-32, 2-42, 3-172; **బౌలింగ్:** ఉమేశ్ 4-0-47-1, జాన్సన్ 4-0-37-0, రషీద్ ఖాన్ 4-0-18-1, నూర్ అహ్మద్ 4-0-43-0, మోహిత్ 4-0-51-1.

గుజరాత్: సుదర్శన్ (ఎల్బీ) కుల్దీప్ సేన్ 35, గిల్ (స్టంప్డ్) శాంసన్ (బి) చాహల్ 72, వేడ్ (బి) కుల్దీప్ సేన్ 4, అభినవ్ (బి) కుల్దీప్ సేన్ 1, విజయ్ శంకర్ (బి) చాహల్ 16, తెవాటియా (రనౌట్) 22, షారుక్ (ఎల్బీ) అవేశ్ ఖాన్ 14, రషీద్ (నాటౌట్) 24, నూర్ అహ్మద్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 199/7; వికెట్ల పతనం:** 1-64, 2-77, 3-79, 4-111, 5-133, 6-157, 7-195; **బౌలింగ్:** బౌల్ట్ 2-0-8-0, అవేశ్ 4-0-48-1, కేశవ్ 2-0-16-0, అశ్విన్ 4-0-40-0, చాహల్ 4-0-43-2, కుల్దీప్ సేన్ 4-0-41-3.

1 *ఐపీఎల్‌లో పిన్నవయసులో 3వేల పరుగులు చేసిన బ్యాటర్‌గా గిల్ (24 ఏళ్ల 215 రోజులు). విరాట్ (26 ఏళ్ల 186 రోజులు) రికార్డును శుభ్‌మన్ అధిగమించాడు.*

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	చాహల్ (రాజస్థాన్)
316 పరుగులు	10 వికెట్లు

నేటి మ్యాచ్

ముంబై X బెంగళూరు

వేదిక: ముంబై - రా.7.30 గం.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	5	4	1	0	8	0.871
కోల్‌కతా	4	3	1	0	6	1.528
లఖ్‌నవూ	4	3	1	0	6	0.775
చెన్నై	5	3	2	0	6	0.666
హైదరాబాద్	5	3	2	0	6	0.344
గుజరాత్	6	3	3	0	6	-0.637
పంజాబ్	5	2	3	0	4	-0.196
ముంబై	4	1	3	0	2	-0.704
బెంగళూరు	5	1	4	0	2	-0.843
ఢిల్లీ	5	1	4	0	2	-1.370

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్పోర్ట్స్



గుకేశ్

6 గంటలు.. 87 ఎత్తులు


» అబసోవ్‌ను చిత్తు చేసిన గుకేశ్

» క్యాండిడేట్స్ చెస్

టొరంటో: భారత గ్రాండ్‌మాస్టర్ డి.గుకేష్ క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో ఆధిక్యంలోకి దూసుకొచ్చాడు. ఐదో రౌండ్‌లో..భారత ఆటగాళ్లలో గుకేష్ మాత్రమే విజయం సాధించాడు. అజర్‌బైజాన్‌కు చెందిన నిజత్ అబసోవ్‌తో జరిగిన ఈ రౌండ్‌లో ఏకంగా ఆరు గంటలు.. 87 ఎత్తుల పాటు హోరాహోరీగా పోరాడిన 17 ఏళ్ల గుకేష్ అద్భుత విజయం అందుకున్నాడు. దాంతో అతడు మొత్తం 3.5 పాయింట్లతో రష్యా జీఎం నెపోమ్నియాచితో కలిసి సంయుక్తంగా టాప్‌లో నిలిచాడు. ఇతర ఐదో రౌండ్ గేముల్లో..నెపోమ్నియాచితో ప్రజ్ఞానంద, టాప్ సీడ్ కరువానాతో విదిత్ గుజ్‌రాతి డ్రా చేసుకున్నారు. ఈ రౌండ్ అనంతరం ప్రజ్ఞానంద (2.5 పాయింట్లు) నాలుగో స్థానంలో, గుజ్‌రాతీ (2) ఐదో స్థానంలో కొనసాగుతున్నారు. మహిళల్లో..గోర్యాచ్కినాతో హంపి (2), ముజిచుక్‌తో వైశాలి (2.5) తమ ఐదో రౌండ్ గేములను డ్రా చేసుకున్నారు. ఈ రౌండ్ తర్వాత వైశాలి మూడో స్థానంలో, హంపి నాలుగో స్థానంలో ఉన్నారు.

స్వర్ణం నెగ్గితే రూ. 42 లక్షలు

» పారిస్ ఒలింపిక్స్ అథ్లెట్లకు భారీ నజరానా



మొనాకో: పారిస్ ఒలింపిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో మంటలు రేపే అథ్లెట్లకు కాసుల వర్షం కురవనుంది. ఈ క్రీడల్లో స్వర్ణం సాధించిన అథ్లెట్‌కు సుమారు 42 లక్షల (50 వేల డాలర్లు) ప్రైజ్‌మనీని ప్రకటిస్తూ వరల్డ్ అథ్లెటిక్స్ (డబ్ల్యూఏ) సంచలన నిర్ణయం తీసుకొంది. మెగా ఈవెంట్‌లో ట్రాక్ అండ్ ఫీల్డ్‌కు సంబంధించిన 48 క్రీడాంశాల్లో పసిడి పతకాలు నెగ్గిన వారికి మాత్రమే ఈ నజరానా అందనుంది. ఇక.. 2028 ఒలింపిక్స్‌లో రజత, కాంస్య పతకాలు సాధించిన వారికి కూడా ప్రైజ్‌మనీ దక్కనుందని డబ్ల్యూఏ బుధవారం తెలిపింది. కాగా రిలే అథ్లెట్లకు ప్రైజ్‌మనీని సమానంగా పంచనున్నారు.

దక్షిణాఫ్రికా వేదికలు ఇవే..

2027 వన్డే వరల్డ్ కప్‌నకు

జొహాన్నెస్‌బర్గ్: పురుషుల 2027 వన్డే వరల్డ్ కప్‌కు దక్షిణాఫ్రికా వేదికలు ఖరారయ్యాయి. జింబాబ్వే, నమీబియాతో కలిసి దక్షిణాఫ్రికా ఈ మెగా టోర్నమెంట్‌కు ఆతిథ్యమివ్వనుంది. వాండరర్స్ (జొహాన్నెస్‌బర్గ్), సెంచూరియన్ పార్క్ (ప్రిటోరియా), కింగ్స్‌మీడ్ (దర్బన్), సెయింట్ జార్జెస్ పార్క్ (గెబెర్హా), బోలాండ్ పార్క్ (పార్ల్), న్యూలాండ్స్ (కేప్‌టౌన్), మాన్‌గాంగ్ ఓవల్ (బ్లూమ్ ఫొంటీన్), బఫెలోపార్క్ (ఈస్ట్ లండన్)లో మ్యాచ్‌లు జరుగుతాయి.

భారత్ మూడో'సారీ'

1-2తో ఆసీస్ చేతిలో ఓటమి

పెర్త్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న హాకీ సిరీస్‌లో భారత జట్టుకు వరుసగా మూడో ఓటమి ఎదురైంది. బుధవారం జరిగిన మూడో మ్యాచ్‌లో భారత్ 1-2తో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైంది. గోల్‌పోస్టుకు అడ్డుగోడలా నిలిచిన శ్రీజేష్.. ఆస్ట్రేలియాను చాలాసేపు నిలువరించాడు. 41వ నిమిషంలో జుగ్‌రాజ్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచి భారత్‌కు 1-0 ఆధిక్యం అందించాడు. కానీ, జెర్మీ హేవర్డ్ (44వ, 49వ) డబుల్ ధమాకాతో టీమిండియా ఆశలపై నీళ్లు కుమ్మరించాడు. దీంతో ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్ 0-3తో వెనుకంజలో నిలిచింది. నాలుగో మ్యాచ్ శుక్రవారం జరగనుంది.

సింధు, ప్రణయ్ ముందంజ

» లక్ష్య, శ్రీకాంత్, గాయత్రి ఓటమి

» ఆసియా చాంపియన్‌షిప్



నింగ్‌బో (చైనా): ఆసియా చాంపియన్‌షిప్‌లో స్టార్ షట్లర్లు పీవీ సింధు, హెచ్ఎస్ ప్రణయ్ వినహా మిగిలిన భారత షట్లర్ల ప్రస్థానం మొదటి రౌండ్‌తోనే ముగిసింది. సింగిల్స్‌లో సింధు 18-21, 21-14, 21-19తో గో జిన్ వీ (మలేసియా)పై, ప్రణయ్ 17-21, 23-21, 23-21తో లు గ్వాంగ్ (చైనా)పై గెలిచి రెండో రౌండ్ చేరారు. ఇతర మ్యాచుల్లో కిడాంబి శ్రీకాంత్ 14-21, 13-21తో ఆంథోనీ గిన్‌టింగ్ చేతిలో, ప్రియాన్షు రజావత్ 9-21, 13-21తో జీ జియా చేతిలో, లక్ష్యసేన్ 19-21, 15-21తో టాప్‌సీడ్ షి యు కీ చేతిలో, మాళవికా బన్సోద్ 18-21, 19-21తో సిమ్ యు చేతిలో, ఆకర్షి కశ్యప్ 10-21, 11-21తో బుసానన్ చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు. డబుల్స్‌లో అశ్వినీ/తనీషా జోడీకి బై లభించగా.. గాయత్రీ/ట్రీసా జాలీ 2-21, 11-21తో లియు/టాన్ చేతిలో, రితూపర్ణ/శ్వేతాపర్ణ 8-21, 13-21తో జాంగ్/జెంగ్ చేతిలో, అర్జున్/ధ్రువ్ 21-23, 21-19, 24-26 లియు/జువాన్ చేతిలో, కృష్ణప్రసాద్/సాయిప్రతీక్ 14-21, 17-21తో లియాంగ్/వాంగ్ (చైనా) చేతిలో, హరిహరన్/రూబన్ 15-21, 14-21తో అరోన్ చియా/ సో ఊ చేతిలో, మిక్స్‌డ్‌లో సతీష్/ఆద్య 12-21, 13-21తో లీ/యు చేతిలో పరాజయం పాలయ్యారు.

20 నుంచి హెచ్‌సీఏ శిక్షణ శిబిరాలు

హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో తొలిసారి మెగా వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 కేంద్రాల్లో 30 రోజులపాటు ఉచితంగా ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్టు హెచ్‌సీఏ అధ్యక్షుడు ఎ. జగన్‌మోహన్ రావు బుధవారం తెలిపారు. ఒక్కో కేంద్రంలో 80 నుంచి 100 మంది ఆటగాళ్లకు శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన చెప్పారు. ఇందుకు ఒక్కో జిల్లా క్రికెట్ సంఘానికి రూ. 15 లక్షలు ఇప్పటికే విడుదల జేశారు. 15 నుంచి క్రికెటర్లు తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 20న శిబిరాలు ప్రారంభం కానున్నాయి.

మానవీయ విలువలకు అద్దం పట్టే రంజాన్

నేడే ఈద్.. శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా ఈద్-ఉల్-ఫితర్‌ను పురస్కరించుకుని ముస్లిం సమాజానికి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలిపారు. ఖురాన్ బోధనల ప్రభావం సమాజంపై ఎంతగానో ఉంటుందని, రంజాన్ మాసంలో చేపట్టిన ఉపవాస దీక్షలు స్వీయ క్రమశిక్షణ, జీవితంపట్ల సానుకూల దృక్పథాన్ని కలిగిస్తాయన్నారు. సహనం, పరోపకారం, త్యాగం వంటి మానవీయ విలువలు రంజాన్ మాసం పెంపొందిస్తుందని పేర్కొన్నారు.

ముస్లింలకు సీఎం రేవంత్‌రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్ ఉల్ ఫితర్ వేడుకలను ఆనందంగా జరుపుకొని అల్లా దీవెనలు అందుకోవాలని ఆకాంక్షించారు. అన్ని సేవలకు మించి మానవసేవ అత్యున్నతమైనదని చాటి చెప్పే రంజాన్.. లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీక అన్నారు. పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దానధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు.



ఈ సందర్భంగా గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని, ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజలంతా కలిసిమెలిసి సుఖ సంతోషాలతో జీవించేలా అల్లా ఆశీర్వదాలు ఉండాలని రేవంత్‌రెడ్డి ప్రార్థించారు. నేడు 'ఈద్ ఉల్ ఫితర్' పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజులపాటు జరిగిన రంజాన్ ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలు, పేదలకు సంతర్పణలు తెలంగాణ వ్యాప్తంగా గొప్ప ఆధ్యాత్మిక వాతావారణాన్ని నింపాయన్నారు. తమ హయాంలో లౌకికవాద సాంప్రదాయాలను పాటిస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలబెట్టామన్నారు. రాష్ట్రంలోని ముస్లిం కుటుంబాలకు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలందరూ అల్లా దీవెనలు అందుకోవాలని, ఈద్- ఉల్- ఫితర్ వేడుకల్లో ఆనందంగా పాల్గొనాలని ఆకాంక్షించారు.

బ్యారేజీలను డిజైన్ల ప్రకారమే నిర్మించారా?

- నిర్మాణ సమయంలో మార్పులేమైనా చేశారా?
- ఆయా నిర్మాణ సంస్థలను ప్రశ్నించిన ఎన్‌డీఎస్‌ఏ

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను డి జైన్ల ప్రకారమే నిర్మించారా? మార్పులేమైనా చేశారా? అని సదరు నిర్మాణ సంస్థలను జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) ప్రశ్నించింది. ఆయా బ్యారేజీల నిర్మాణ సంస్థల ప్రతినిధులతో బుధవారం ఢిల్లీలో ఎన్‌డీఎస్‌ఏ సమావేశమైంది. కటాఫ్ వాల్స్‌కు షీట్ పైల్స్‌కు బదులుగా సీకెంట్ పైల్స్‌ను ఎందుకు ఎంచుకున్నారని నిర్మాణ సంస్థలను ఎన్‌డీఎస్‌ఏ ప్రశ్నించింది. ఆ నిర్ణయం ప్రభుత్వానిదేనని, ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగానే చేపట్టామని నిర్మాణ సంస్థలు బదులిచ్చాయి. సీకెంట్ పైల్స్‌లో లోపాల వల్లే ఇసుక జారిపోయి.. మేడిగడ్డ బ్యారేజీ కుంగిందా? మరేమైనా కారణాలున్నాయా? అని ఎన్‌డీఎస్‌ఏ ప్రశ్నించగా.. తగిన పరీక్షల తర్వాతే బ్యారేజీల కుంగుబాటుకు గల కారణాలు తెలుస్తాయని నిర్మాణ ఏజెన్సీలు అభిప్రాయపడ్డాయి. 2019 నాటి వరదలకే డౌన్‌స్ట్రీమ్, అప్‌స్ట్రీమ్ ఏప్రాన్లకు సంబంధించిన సిమెంట్ బ్లాకులు కొట్టుకుపోతే ఏం చర్యలు తీసుకున్నారని ఎన్‌డీఎస్‌ఏ ప్రశ్నించింది. వరదలకు కొట్టుకుపోయిన సిమెంట్ బ్లాకులను మళ్లీ పాత స్థానంలో పెట్టామని నిర్మాణ సంస్థలు బదులిచ్చాయి. బ్లాకుల వారీగా నిర్మాణం జరిగిన తీరుపై ప్రశ్నించి.. ఆ సంస్థలు ఇచ్చిన జవాబులపై అంశాల వారీగా మళ్లీ ఆరా తీసింది. కాగా, ఎన్‌డీఎస్‌ఏ రెండో దశ పర్యటన అనంతరం సంధించిన ప్రశ్నలకు నీటిపారుదల శాఖ అధికారులు హార్డ్‌కాపీల రూపంలో జవాబులు పంపించారు. ఈ కాపీలు అందుకున్న ఎన్‌డీఎస్‌ఏ.. వాటిని సాఫ్ట్ కాపీ రూపంలో అందించాలని తాజాగా తెలంగాణ అధికారులకు సమాచారం ఇచ్చింది.

బీఎఫ్ఐ నెట్‌వర్క్‌తో సీసీఎంబీ ఒప్పందం

హైదరాబాద్, ఏప్రిల్ 10: హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ).. బ్లాక్ ఫైన్ ఫర్ ఇంపాక్ట్(బీఎఫ్ఐ) సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకుంది. బీఎఫ్ఐ-బయోమి వర్చువల్ నెట్‌వర్క్ కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ ఒప్పందం ద్వారా దేశ వైద్య రంగంలో కొత్త ఆవిష్కరణలకు నాంది పలికేందుకు మార్గం సుగమమైంది. జీవ వైద్య శాస్త్ర రంగంలో కొత్త ప్రయోగాలు చేస్తున్న వారిని దేశంలో పేరున్న పరిశోధనా సంస్థలతో అనుసంధానం చేసి కొత్త అవిష్కరణలు ప్రోత్సహించేందుకు బీఎఫ్ఐ-బయోమి నెట్‌వర్క్ కృషి చేస్తున్నది. అందులో భాగంగా వచ్చే మూడేళ్లలో సుమారు రూ.5 కోట్ల నిధులతో జీవశాస్త్ర రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సీసీఎంబీ బుధవారం వెల్లడించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా జీవపరిశోధనా రంగంలో కొత్త ఆలోచనలతో ముందుకు వచ్చే వారికి సీసీఎంబీ మార్గదర్శనం చేస్తుంది. సీసీఎంబీతో ఒప్పందం వల్ల కొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమం అవుతుందని బ్లాక్‌ఫైన్ సీఈవో సందీప్, బీఎఫ్ఐ నెట్‌వర్క్ సీఈవో గౌరవ్ సింగ్ అన్నారు. దేశ ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు అవసరమైన పరిశోధనలు చేసేందుకు ఈ ఒప్పందం తోడ్పడుతుందని సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల నుంచి వేసవి ప్రత్యేక రైళ్లు

- దక్షిణ మధ్య రైల్వే అధికారుల వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల నుంచి వెళ్లి, వచ్చే ప్రయాణికుల డిమాండ్ మేరకు ప్రత్యేక రైళ్లను నడుపడానికి ఏర్పాట్లు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఏప్రిల్ 19 నుంచి జూన్ 28 వరకు సికింద్రాబాద్ నుంచి సంత్రగచ్చి వరకు ప్రత్యేక రైలు(07223) ప్రతి శుక్రవారం 11 ట్రిప్పులు, ఏప్రిల్ 20 నుంచి జూన్ 29 వరకు సంత్రగచ్చి నుంచి సికింద్రాబాద్ వరకు ప్రత్యేక రైలు(07224) ప్రతి శనివారం 11 ట్రిప్పులు, సికింద్రాబాద్ నుంచి షాలిమార్ వరకు ప్రత్యేక రైలు(07225) ప్రతి సోమవారం 11 ట్రిప్పులు, ఏప్రిల్ 15 నుంచి జూన్ 24 వరకు షాలిమార్ నుంచి సికింద్రాబాద్ వరకు ప్రత్యేక రైలు(07226) ప్రతి మంగళవారం ఏప్రిల్ 16 నుంచి జూన్ 25 వరకు 11 ట్రిప్పులు, సికింద్రాబాద్-కొల్లం మధ్య 22 ట్రిప్పులు ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు అధికారులు వివరించారు. ఏప్రిల్ 17, 24, మే 1, 8, 15, 22, 29, జూన్ 5, 12, 19, 26 తేదీల్లో సికింద్రాబాద్-కొల్లం ప్రత్యేక రైలు(07193) ప్రతి బుధవారం నడుస్తుందని తెలిపారు. అలాగే ఏప్రిల్ 19, 26, మే 3, 10, 17, 24, 31, జూన్ 7, 14, 21, 28 తేదీల్లో కొల్లం-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ప్రతి శుక్రవారం నడుస్తుందని రైల్వే అధికారులు వెల్లడించారు.

కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం రేపు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నీటి నిల్వ, తాగునీటి అవసరాలపై చర్చించడానికి వీలుగా కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశం శుక్రవారం జరగనుంది. ఉమ్మడి జలాశయాల్లో నీటి లభ్యతతో పాటు రానున్న రోజుల్లో తాగునీటి అవసరాలకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. అయితే 12వ తేదీన తెలుగు రాష్ట్రాల్లో సెలవు దినం కావడంతో సమావేశానికి అధికారులు హాజరవుతారా? లేక వాయిదాకే పట్టుబడతారా? అనేది తేలాల్సి ఉంది. త్రిసభ్య కమిటీలో కృష్ణాబోర్డు సభ్యకార్యదర్శి డీఎం రాయిపూరేతో పాటు తెలుగు రాష్ట్రాల ఈఎన్‌సీలు సభ్యులుగా ఉంటారు. ఈ సీజన్‌లో రెండు జలాశయాల్లో 80 టీఎంసీలకు గాను 45 టీఎంసీలు ఏపీ, 35 టీఎంసీలు తెలంగాణ పంచుకోవాలని నిర్ణయించిన విషయం విదితమే. తెలంగాణ వాటాకు మించి తరలించిందని ఏపీ ఆరోపించింది. ఏపీ కూడా నిర్ణీత వాటాకు చేరువలో ఉంది.

టెట్ దరఖాస్తుల గడువు పొడిగింపు

- ఇప్పటికే 2.33 లక్షలు దాటిన అప్లికేషన్లు
- నేటి నుంచి దరఖాస్తుల ఎడిట్‌కు అవకాశం

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): టీచర్ ఎలిజిబులిటి టెస్ట్(టెట్)కు దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించారు. ఈ మేరకు విద్యా శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 10వ తేదీతో దరఖాస్తుల గడువు ముగిసింది. ఈ గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించారు. దీంతో మరో పది రోజుల పాటు అభ్యర్థులు టెట్‌కు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంది. మరో పక్క ఇప్పటికే దరఖాస్తులను సమర్పించిన అభ్యర్థులకు ఎడిట్ ఆప్షన్‌ను కూడా కల్పించారు. దరఖాస్తుల దాఖలులో ఏమైనా పొరపాట్లు దొర్లితే.. వాటిని సరి చేసుకోవడానికి వీలుగా ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అవకాశం కల్పించారు. కాగా టెట్ కోసం ఇప్పటి వరకు 2,33,243 మంది అభ్యర్థులు దరఖాస్తులను చేసుకున్నారు. ఇందులో పేపర్-1కు 85,625 అభ్యర్థులు, పేపర్ -2కు 1,47,618 మంది అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించారు. రాష్ట్రంలో మెగా డీఎస్సీని నిర్వహిస్తున్న నేపథ్యంలో దానికంటే ముందుగా టెట్‌ను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మే 20 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఈ పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) పద్ధతిలో నిర్వహించనున్నారు.

అసెంబ్లీలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

- యునైటెడ్ పూలే ఫ్రంట్ కో కన్వీనర్ బొల్ల శివశంకర్

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని పద్మశాలి సంఘం రాజకీయ విభాగం చైర్మన్, యునైటెడ్ పూలే ఫ్రంట్ కో కన్వీనర్ బొల్ల శివశంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చదువు ద్వారానే అట్టడుగు ప్రజల జీవితాల్లో మార్పు సాధ్యమని విశ్వసించి ప్రోత్సహించిన పూలే సేవలకు గుర్తుగా చట్టసభల ఆవరణలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఏప్రిల్ 11న పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహం ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయని పక్షంలో బీసీల సంక్షేమం కోసం చేస్తున్న వాగ్దానాలు, హామీలపై అనుమానాలు వ్యక్తమవుతాయన్నారు.

పార్టీలకు 'బాండ్లు' నిబంధనలకు తూట్లు

కంపెనీ ఏర్పాటైన మూడేళ్ల తర్వాతే రాజకీయ పార్టీలకు విరాళం ఇచ్చే అర్హత

- ఉల్లంఘించి రూ.103 కోట్ల బాండ్లు కొని పార్టీలకు ఇచ్చిన 20 కొత్త కంపెనీలు
- వీటిలో 12 హైదరాబాద్‌కు చెందినవే
- వెల్లడించిన 'హిందూ' కథనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: ఎలక్టోరల్ బాండ్ల వివాదంలో మరో కొత్త కోణం. కంపెనీ ఏర్పాటైన మూడేళ్ల తర్వాతే రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చే అర్హత లభిస్తుదని నిర్దేశిత చట్టం స్పష్టం చేస్తున్నప్పటికీ.. పలు కంపెనీలు ఆ చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘించాయి. పార్టీలకు విరాళాలు సమర్పించుకున్నాయి. దాదాపు 20 కంపెనీలు.. ఈ విధంగా ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసి రాజకీయ పార్టీలకు రూ.103 కోట్ల విరాళం ఇచ్చాయని ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'హిందూ' వెల్లడించింది. ఈ కంపెనీల్లో చాలావరకు హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్నవేనని, వీటి ద్వారా ఆర్థిక లబ్ధి పొందిన పార్టీల్లో కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ అగ్రస్థానంలో తెలిపింది.

అక్రమ నిధులను అడ్డుకోవటానికి

కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 182 ప్రకారం.. ఒక కంపెనీ ఏర్పాటై మూడు ఆర్థిక సంవత్సరాలు పూర్తయిన తర్వాతే.. ఆ కంపెనీ ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ రాజకీయపార్టీలకు విరాళం ఇచ్చే అర్హతను సాధిస్తుంది. పార్టీలకు షెల్ కంపెనీల ద్వారా అక్రమ నిధుల వరద ప్రవహించకుండా ఈ నిబంధన అడ్డుకుంటుంది. దీనిని ఉల్లంఘిస్తే సదరు కంపెనీ ప్రతినిధులకు ఆర్నెళ్ల జైలు శిక్షతోపాటు ఆ కంపెనీ విరాళంగా ఇచ్చిన సొమ్ముకు ఐదు రెట్ల సొమ్మును జరిమానా రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఇటువంటి స్పష్టమైన నిషేధం ఉన్నప్పటికీ.. దాదాపు 20 కంపెనీలు నిబంధనలను ఉల్లంఘిస్తూ రూ.103 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను 2021 ఏప్రిల్-2023 జూన్ మధ్య కొనుగోలు చేశాయి. ఆ సమయానికి ఆ కంపెనీలు ఏర్పాటై మూడేళ్ల గడువు పూర్తి కాలేదు. అయినప్పటికీ, అవి బాండ్లు కొని పార్టీలకు ఇచ్చాయి. ఈ బాండ్ల ద్వారా బీఆర్ఎస్ రూ.31.5 కోట్లు, బీజేపీకి రూ.26 కోట్ల విరాళాలు



లభించాయి. కాగా, ఈ 20 కంపెనీల్లో 12 కంపెనీలు హైదరాబాద్‌లో ప్రధాన కార్యాలయాలను కలిగి ఉన్నాయి. సదరు 12 కంపెనీలు మొత్తంగా రూ.37.5 కోట్ల బాండ్లను పార్టీలకు విరాళం ఇవ్వగా.. వీటిలో 75శాతం నిధులు బీఆర్ఎస్‌కు లభించగా, మిగిలిన 25శాతం బీజేపీ, కాంగ్రెస్, టీడీపీలకు దక్కాయి.

కళ్లు తెరిచి ఏడాది కాకముందే డొనేషన్లు

ఈ 20 కంపెనీల్లో ఐదు కంపెనీలు.. ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసే నాటికి తొలి వార్షికోత్సవాన్ని కూడా జరుపుకోలేదు. అంటే, అవి ఏర్పాటై ఏడాది కూడా కాలేదు. మరో ఏడు కంపెనీలు రెండేళ్ల లోపువి. మిగిలిన ఎనిమిది కంపెనీలు మూడేళ్లలోపువి. మరింత విచిత్రమైన విషయం ఏమిటంటే, ఈ 20 కంపెనీల్లో పలు కంపెనీలు కరోనా కారణంగా ఆర్థికమాంద్యం నెలకొన్న 2019 తర్వాత ఏర్పాటయ్యాయి. అయినప్పటికీ, కళ్లు తెరిచిన కొన్ని నెలల్లోనే కోట్లాది రూపాయల బాండ్లను కొనుగోలు చేశాయి. ఉదాహరణకు.. హైదరాబాద్‌కు చెందిన టీ షార్క్స్ ఇన్ఫ్రా డెవలపర్స్, టీ షార్క్స్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ 2023లో ఏర్పాటయ్యాయి. ఉనికిలోకి వచ్చిన కొన్ని నెలల వ్యవధిలోనే రూ.7.5 కోట్ల బాండ్లను కొని బీఆర్ఎస్‌కు అందించాయి. 2021 నవంబరులో ఏర్పాటైన ఆస్క్ అస్ లాజిస్టిక్స్ కంపెనీ.. ఏడాదిన్నర కూడా కాకముందే రూ.22 కోట్ల బాండ్లను కొని డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, ఆర్జేడీలకు అందించింది. అలాగే, కోయంబత్తూరుకు చెందిన హెచ్‌హెచ్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ రూ.15 కోట్ల బాండ్లను బీజేపీకి, రూ.5 కోట్ల బాండ్లను బీజేడీకి సమర్పించింది. అప్పటికి ఆ కంపెనీ ఏర్పాటై మూడేళ్లు పూర్తి కాలేదు. ఈ జాబితా ఈ 20 కంపెనీలకే పరిమితం కాదని 'హిందూ' తెలిపింది. కంపెనీల విలీనం తర్వాత ఏర్పాటైన కొత్త కంపెనీలను, కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ వెబ్‌సైట్‌లో లేని కంపెనీలను తాము పరిశీలించలేదని వెల్లడించింది. కార్పొరేట్ శాఖ వెబ్‌సైట్‌లోని సమాచారం ఆధారంగా ఆయా కంపెనీల ఆవిర్భావ వివరాలు సేకరించామని తెలియజేసింది.

బాండ్ల పథకానికి ముందే చట్టానికి సవరణ

కంపెనీల చట్టం, 1956 ప్రకారం రాజకీయపార్టీలకు ప్రైవేటు కంపెనీలు విరాళాలు ఇవ్వటంపై నిషేధం ఉంది. 1985లో ఈ చట్టంలోని 'సెక్షన్ 293-ఏ'కు సవరణ జరిపి నిషేధాన్ని తొలగించారు. అయితే, ఆ సందర్భంగా కొన్ని షరతులు విధించారు. వాటి ప్రకారం, 1. పార్టీలకు ప్రభుత్వ సంస్థలు విరాళం ఇవ్వకూడదు 2. విరాళం ఇచ్చే ప్రైవేటు కంపెనీ కనీసం మూడేళ్ల కిందట ఏర్పాటై ఉండాలి 3. మూడేళ్ల కాలవ్యవధిలో వచ్చిన నికర లాభాల్లో 7.5 శాతానికి మించి విరాళం ఇవ్వరాదు. కంపెనీల చట్టం, 2013లో కూడా ఈ నిబంధనలను సెక్షన్ 182 కింద కొనసాగించారు. అయితే, నరేంద్ర మోదీ ప్రధాని పదవిని చేపట్టిన తర్వాత, ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టటానికి ముందు 2017లో సెక్షన్ 182కి సవరణ జరిపారు. దాని ప్రకారం, 7.5 శాతం పరిమితిని తొలగించారు. మూడేళ్లలోపు కంపెనీలు విరాళాలు ఇవ్వొద్దనే నిబంధనను మాత్రం కొనసాగించారు. 7.5 శాతం పరిమితిని ఎత్తివేయటాన్ని అప్పట్లో ఈసీ, ఆర్బీఐ వ్యతిరేకించాయి. ఈ చర్య వల్ల షెల్ కంపెనీల ద్వారా రాజకీయపార్టీలకు నల్లధనం ప్రవహించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి. 'హిందూ' కథనంపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ స్పందిస్తూ.. అక్రమ నిధుల ప్రవాహాన్ని అడ్డుకోవటానికి ఉన్న రక్షణలను కూడా మోదీ పర్యవేక్షణలో అడ్డగోలుగా ఉల్లంఘించినట్లు దీనిద్వారా తేలుతోందన్నారు.

ప్రతి ఇంటికీ సరిపడా తాగునీరు

- సరఫరాలో అంతరాయాలు ఉండొద్దు
- కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశం



హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి సరిపడా తాగునీటిని సరఫరా చేయడానికి ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తగినన్ని నిధులు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీరు, వరి ధాన్యం కొనుగోళ్లు, పాఠశాలల్లో అత్యవసర పనుల నిర్వహణ, వడదెబ్బ నియంత్రణకు ముందస్తు చర్యలు తదితర అంశాలపై చర్చించి కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తూ నిరంతరాయంగా తాగునీటిని సరఫరా చేస్తున్నందుకు జిల్లా కలెక్టర్లను అభినందించారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు కలెక్టర్ల వద్ద తగినన్ని నిధులను అందుబాటులో ఉంచామన్నారు. అయితే. వర్షాకాలం ప్రారంభమయ్యే వరకు ఇదే విధమైన పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రతి ఇంటికీ సరిపడా తాగునీటిని సరఫరా చేయడానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తాగునీటి పరిస్థితిని పర్యవేక్షించేందుకు నియమించిన ప్రత్యేక అధికారులు గ్రామాలను సందర్శించి నీటి సరఫరాలో జరుగుతున్న అంతరాయాలను తొలగించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, ఆ కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ధాన్యాన్ని శుభ్రపరేచే యంత్రాలు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచామని చెప్పారు. వడగాలుల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆస్పత్రుల్లోనూ తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సీఎస్ ఆదేశించారు.

టీఎస్ ఎప్‌సెట్‌కు 3.50 లక్షల దరఖాస్తులు

- గడిచిన ఐదేళ్లలో ఈ ఏడాదే అత్యధికం
- 500 ఆలస్య రుసుంతో 14 వరకు చాన్స్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికై తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎప్‌సెట్-2024కు గతంలో ఎన్నడూ లేని విధంగా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది 3.21 లక్షల దరఖాస్తులు రాగా, ఈ ఏడాది ఇప్పటికే(బుధవారం వరకు) 3,50,246 దరఖాస్తులు రావడం విశేషం. వీటిలో ఇంజనీరింగ్ పరీక్ష కోసం 2,51,539 మంది దరఖాస్తు చేసుకోగా, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్ష కోసం 98,372 మంది, రెండు పరీక్షలూ రాసేందుకు మరో 335 మంది దరఖాస్తులు సమర్పించినట్లు ఎప్‌సెట్ కో కన్వీనర్ డాక్టర్ కె.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. రూ.250 ఆలస్య రుసుముతో గడువు ముగియగా, రూ.500 ఆలస్య రుసుముతో ఈ నెల 14 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. కాగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే ఎప్‌సెట్-2024 పరీక్షల కోసం ఆంధ్రప్రదేశ్ నుంచి 60 వేల మందికి పైగా దరఖాస్తులు సమర్పించడం విశేషం.



ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను పరామర్శిస్తున్న కేసీఆర్

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు కేసీఆర్ పరామర్శ

జగిత్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పితృవియోగం పొందిన బీఆర్ఎస్ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌ను మాజీ సీఎం కేసీఆర్ పరామర్శించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తండ్రి మాకునూరి హనుమంతరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని విరూపాక్షి గార్డెన్‌లో స్వర్గ పాత్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ సీఎం కేసీఆర్ హాజరయ్యారు. హనుమంతరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కుటుంబసభ్యులను కలిసి ఓదార్చారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యకర్తలు, బీఆర్ఎస్ నాయకులతో కొద్దిసేపు ముచ్చటించారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డి ఉన్నారు.

రెండో పీఆర్సీ కాలాతీతం!

ఏప్రిల్ 2తో ఆరు నెలల గడువు సమాప్తి.. ఇప్పటికీ సిఫారసులు చేయని కమిషన్

- మార్చిలో ఉద్యోగ సంఘాలతో భేటీలు ప్రారంభం.. అవీ మందకొడిగానే..
- జూలై 1 నుంచి రావాల్సిన ఫిట్‌మెంట్
- 9 నెలలైనా అందని కొత్త వేతనాలు
- ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో ఆందోళన

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల వేతనాలు, పెన్షన్ల పెంపుపై ఇంకా సందిగ్ధత వీడడం లేదు. పాత ప్రభుత్వం దిగిపోయి, కొత్త ప్రభుత్వం కొలువుదీరి నాలుగు నెలలు గడుస్తున్నా పెంపు వ్యవహారం ఎటూ తేలడం లేదు. చివరకు రెండో 'పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ)' నిర్దేశిత గడువు దాటినా సిఫారసుల ప్రస్తావన లేకపోవడం ఉద్యోగులు, పెన్షనర్లను మరింత ఆందోళనకు గురి చేస్తోంది. పీఆర్సీకి ఇచ్చిన ఆరు నెలల గడువు ఈ ఏప్రిల్ 2తో ముగిసింది. కానీ.. వేతన పెంపు సిఫారసులు మాత్రం చేయలేదు. ఎంత ఫిట్‌మెంట్ ఇవ్వాలో ప్రభుత్వానికి సూచించలేదు. ఇటీవల ఉద్యోగ సంఘాలతో సమావేశాలు మొదలుపెట్టినా ఇవన్నీ తేలేవరకు ఎంత కాలం పడుతుందోనని ఆ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2018 నాటి మొదటి పీఆర్సీ ఐదేళ్ల కాలం 2023 జూన్ 30తో ముగిసింది. 2023 జూలై నుంచి తెలంగాణ రెండో పీఆర్సీ కొత్త వేతనాలు అమల్లోకి రావాలి. కానీ... అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రెండో పీఆర్సీని వెంటనే నియమించలేదు. శాసనసభ ఎన్నికలకు ముందు అక్టోబర్ 2న రెండో పీఆర్సీని వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రిటైర్డు ఐఏఎస్ అధికారి ఎన్.శివశంకర్ చైర్మన్‌గా, మరో రిటైర్డు ఐఏఎస్ బీ రామయ్య సభ్యుడిగా ద్విసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దీనికి విధి విధానాలను కూడా నిర్దేశించింది. ప్రస్తుతం ఉద్యోగులు, పెన్షనర్లకు ఇస్తున్న వేతనాలు, పెన్షన్లు, ఇతర రాష్ట్రాల్లోని వేతనాల సరళి, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను పరిశీలించాలని, రాష్ట్ర రాబడుల పెరుగుదల, భవిష్యత్తులో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం చేసే వ్యయాలు వంటి వాటిని పరిగణనలోకి తీసుకోవాలని పీఆర్సీకి సూచించింది. ఉద్యోగ సంఘాలతో సమావేశాలు నిర్వహించి, అన్ని రకాలుగా అధ్యయనం చేసి, ఆరు నెలల్లోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ ఏప్రిల్ 2కు ఆరు నెలల కాలం గడిచిపోయింది. కానీ... ఇప్పటివరకు సిఫారసులకు అతీగతీ లేదు. నవంబరు, డిసెంబరు నెలల్లో ఎన్నికలు జరగడం, కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం, దాంతో ఉద్యోగులు, అధికారులు ఎన్నికల్లో నిమగ్నం కావడం వంటి కారణాల వల్ల పీఆర్సీ సమావేశాలు నిర్వహించలేకపోయింది. ఈ మార్చిలో ఉద్యోగ సంఘాలతో సమావేశాలు ప్రారంభించింది. ఇవి కూడా మందకొడిగానే సాగుతున్నాయి. రాష్ట్రంలో కీలక ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఇంకా సమావేశాలు నిర్వహించనే లేదు. మరోపక్క ప్రభుత్వం విధించిన గడువు ముగిసింది. ఇది ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. నిజానికి మొదటి పీఆర్సీ వల్లే తమకు అన్యాయం జరిగిందని, ఇప్పుడు రెండో పీఆర్సీ వల్ల ఏదైనా అన్యాయం జరుగుతుందా అన్న సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. 2018 జూలై 1 నుంచి అమల్లోకి రావాల్సిన మొదటి పీఆర్సీ వేతనాలు చాలా ఆలస్యమయ్యాయని చెబుతున్నారు. 2018 మే 18న మాజీ ఐఏఎస్ సీఆర్ బిశ్వాల్ అధ్యక్షతన మొదటి పీఆర్సీని అప్పటి ప్రభుత్వం నియమించింది. ఆ కమిషన్ వెంటనే సిఫారసులు చేయలేకపోయింది. ఎట్టకేలకు రెండేళ్ల అనంతరం 2020 డిసెంబరు 30న ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. 7.5 శాతం ఫిట్‌మెంట్‌ను సిఫారసు చేసింది. కానీ... అప్పట్లో ప్రభుత్వం 30 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించింది. అయినా సవరించిన వేతనాలను 2018 జూలై 1 నుంచి కేవలం 'నోషనల్ బెనిఫిట్'గా వర్తింపజేసింది. 2020 ఏప్రిల్ నుంచి మానిటరీ బెనిఫిట్‌గా, 2021 జూన్ నుంచి క్యాష్ బెనిఫిట్‌గా వర్తింపజేసింది. అంటే... పెరిగిన వేతనాలను 2018 నుంచి జూలై 1 నుంచి 'నోషనల్ బెనిఫిట్'గా చూపడంతో తాము 21 నెలల వేతన పెంపును కోల్పోయామని, ఇది ఒక రకంగా తమను ఆర్థికంగా తీవ్ర నష్టం చేసిందని అప్పట్లోనే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు నిరసించాయి. రెండో పీఆర్సీ సిఫారసులు ఆలస్యమవుతుండడంతో మొదటి పీఆర్సీ గతి పట్టదు కదా అన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. 2023 జూలై 1 నుంచి రెండో పీఆర్సీ వేతనాలు అమలు కావాల్సి ఉందని, కానీ... ఇప్పటికే తొమ్మిది నెలల కాలం గడిచిపోయిందని నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తూతూ మంత్రంగా 5 శాతం మధ్యంతర భృతి (ఐఆర్)ని ప్రకటించిందని పెదవి విరుస్తున్నారు. కనీసం 25-30 శాతం వరకు ఐఆర్‌ను ప్రకటించాలని కోరామని, తమ విజ్ఞప్తులను పట్టించుకోకుండా 5 శాతంతో సరి పెట్టిందని అంటున్నారు. కనీసం పీఆర్సీ నివేదికను త్వరగా తెప్పించుకుని వేతనాలను పెంచుతారేమోనని ఎదురు చూస్తుంటే... తొమ్మిది నెలల కాలం గడిచిపోయిందని, పీఆర్సీ ఆరు నెలల గడువు ముగిసిందని, ఇప్పటికీ సిఫారసుల ఉలుకూ పలుకూ లేదని విమర్శిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో కొంత ఆలస్యం జరిగి ఉండొచ్చని, కనీసం ఇప్పటికైనా పీఆర్సీ నివేదికను త్వరగా తెప్పించుకుని, కొత్త వేతనాలను అమలు చేయాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

బాసర గుడి ఈవోకు చార్జిమెమో

జారీ చేసిన దేవాదాయ శాఖ కమిషనర్.. మరికొన్ని గుడుల్లో అక్రమాలపైనా కమిషనర్ దృష్టి

- కొందరు ఈవోలు, సూపరింటెండెంట్లపై చర్యలు?
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

హైదరాబాద్, బాసర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో ఎక్కువ ధరకు సరుకుల టెండరు ఖరారు విషయంపై దేవాదాయ శాఖ లోతుగా విచారణ చేపట్టింది. ఏళ్ల తరబడిగా జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి నిజాలు నిగ్గుతేల్చే పనిలో నిమగ్నమైంది. అందులో భాగంగానే ఎక్కువ ధరకు సరుకుల టెండరు ఖరారు చేసిన వ్యవహారంలో వివరణ కోరుతూ ఆలయ ఈవోకు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు చార్జిమెమో జారీ చేశారు. ఆలయంలో ప్రసాదాల తయారీతో పాటు దేవస్థానంలో వివిధ విభాగాలకు నిత్యావసర సరుకులతో పాటు ఇతర అవసరాలకు కొనుగోలు చేసే మరికొన్ని వస్తు సామగ్రి కొనుగోళ్లలో భారీగా చోటు చేసుకున్న అక్రమాలపై గత నెల మార్చి 31న 'బాసరలో భోంచేస్తున్నారు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఆలయంలో టెండర్ల విషయంలో మార్కెట్‌లో రేట్లకన్నా అధిక రేట్లు ఖరారు వ్యవహారంలో కమిషనర్ ఆదేశాల మేరకు దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి విచారణ చేపట్టారు. విచారణ నివేదిక ఆధారంగా టెండర్ల ఖరారు వ్యవహారంలో ఈవోపై క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలపాలని కమిషనర్ వివరణ కోరడంతోపాటు చార్జిమెమో జారీ చేశారు. దేవాదాయ శాఖలో ఎట్టి పరిస్థితుల్లో అక్రమాలు సహించేది లేదని కమిషనర్ హనుమంతరావు స్పష్టం చేశారు. కాగా, దేవాదాయ శాఖపై కొత్త కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. మొదటి సమావేశంలోనే.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్ తప్పదని హెచ్చరించారు. అందుకు తగ్గట్లుగానే ప్రధానంగా బాసర ఆలయంతోపాటు కొమురవెల్లి మల్లిఖార్జున స్వామి, వేములవాడ, భద్రాచలంతోపాటు వరంగల్ జోన్ పరిధిలోని మరికొన్ని ఆలయాల్లో జరిగిన అక్రమాలపై నివేదికను సేకరించారు. త్వరలోనే మరి కొంత మంది ఈవోలు, సూపరింటెండెంట్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. కాగా, ప్రస్తుతం ఆలయ ఈవో సెలవుపై ఉండడంతో ఏఈవో సుదర్శన్ గౌడ్‌ను వివరణ కోరగా.. చార్జ్ మెమో వచ్చిన విషయం వాస్తవమేనన్నారు.

కొప్పుల ఈశ్వర్‌కు నిరసన సెగ

- నిలదీసిన సింగరేణి మహిళా కార్మికులు
- ప్రచారం చేయకుండానే వెనుదిరిగిన కొప్పుల

గోదావరిఖని, ఏప్రిల్ 10: పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు నిరసన సెగ తగిలింది. బుధవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని వన్ ఇంక్లైన్ వద్దకు ఎన్నికల ప్రచారానికి వెళ్లిన కొప్పులను మహిళా కార్మికులు నిలదీశారు. 'ఎన్నికలప్పుడే వస్తారా? సమస్యలుంటే పట్టించుకోరా? ఏసీ రూముల్లో ఉండే మీకు మా కష్టాలు ఏం తెలుస్తాయి?' అంటూ మహిళా కార్మికులు ప్రశ్నించారు. మూకుమ్మడిగా ఏరియా వర్క్‌షాప్‌ఎలో పనిచేసే 50మంది మహిళా కార్మికులను బదిలీలు చేస్తే మాట్లాడలేదని, మహిళా కార్మికుల మనోభావాలు దెబ్బతింటున్నాయని, మహిళలను గనులపై, ఎండలో బలవంతంగా పనిచేయించడంవల్ల చాలా మంది కళ్లు తిరిగి పడిపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొప్పుల ఈశ్వర్ బంధువులు గనిలోకి దిగడం లేదని, వారితో ఉపరితల పనులు మాత్రమే చేయిస్తున్నారని, ఇదెక్కడి న్యాయం అంటూ నిలదీశారు. దీంతో మహిళలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఈశ్వర్ అక్కడినుంచి వెళ్లిపోయారు. మహిళలు ఈశ్వర్‌ను నిలదీస్తున్న ఘటనను విలేకరులు మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించగా.. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వారి చేతుల్లో ఫోన్లను లాక్కొని ఆ చిత్రాలను డిలీట్ చేశారు. వారితో దురుసుగా ప్రవర్తించారు. చందర్ చర్యను విలేకరులు ఖండించారు. కాగా, విలేకరులపై కోరుకంటి చందర్ దురుసుగా ప్రవర్తించడం సరికాదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు.

కంటోన్మెంట్ టికెట్ నివేదితకే

- ప్రకటించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ అసెంబ్లీ ఉపఎన్నిక నేపథ్యంలో తమపార్టీ అభ్యర్థిగా లాస్యనివేదితను బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ బుధవారం ప్రకటించారు. పార్టీ ముఖ్యులు, కంటోన్మెంట్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నేతలు దివంగత ఎమ్మెల్యే లాస్యనందిత కుటుంబ సభ్యులతో చర్చించిన ఆయన ఈ మేరకు నివేదితను ఎన్నికల బరిలో నిలుపుతున్నట్లు వెల్లడించారు. కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత మరణించడంతో.. ఆ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. లోక్‌సభ ఎన్నికలతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి మే 13న పోలింగ్ జరగనుంది. జూన్ 4న ఫలితాలు వెల్లడించనున్నారు.

16న సుల్తాన్‌పూర్‌లో కేసీఆర్ సభ

పుల్‌కల్, ఏప్రిల్ 10: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో మాజీ సీఎం కేసీఆర్‌తో ఈ నెల 16న భారీ బహిరంగ సభను నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ నిర్ణయించింది. సభ కోసం ఇప్పటికే 45 ఎకరాల పట్టా భూమిని ఎంపిక చేశారు. ఎన్నికల సభ కావడంతో రైతుల వద్ద నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ)లపై సంతకాలు తీసుకున్నారు. లక్ష మందిని సభకు తరలించేందుకు బీఆర్‌ఎస్ కసరత్తు చేస్తోంది.

సీఎంవా? చెడ్డీగ్యాంగ్ సభ్యుడివా?: హరీశ్

సంగారెడ్డి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సీఎంవా? చెడ్డీగ్యాంగ్ సభ్యుడివా? అంటూ బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఘాటు విమర్శలు చేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం గణేష్ ఆలయం వద్ద బుధవారం బీఆర్‌ఎస్ ప్రచార రథాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 120 రోజులు గడుస్తున్నా ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని హామీనిచ్చారు కానీ ఇంతవరకు అమలు చేయడంలేదని విమర్శించారు. రాష్ట్రంలో 42 లక్షల మంది పింఛన్‌దారులు ఉన్నారని, వీరికి నెలకు రూ.4 వేలు ఎప్పుడిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా ఇవ్వడం లేదని, కేసీఆర్ కిట్ బంద్ అయ్యిందని, కల్యాణలక్ష్మికి తులం బంగారం, వడ్లకు రూ.500ల బోనస్ ఏమైందని అడిగితే సీఎం రేవంత్‌రెడ్డి అవాకులు, చెవాకులు పేలుతున్నారని దుయ్యబట్టారు.

రాజ్యసభ సభ్యురాలిగా రేణుక ప్రమాణ స్వీకారం



న్యూఢిల్లీ, ఖమ్మం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రేణుకా చౌదరి రాజ్యసభ సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. శివసేన(షిండే వర్గం) పార్టీకి చెందిన మిలింద్ దేవ్‌రాతో పాటు సీనియర్ జర్నలిస్టు, రచయిత సాగరికా ఘోష్ కూడా ఎంపీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్ హాల్‌లోని ప్రత్యేక రూంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. వీరితో పాటు మరో ఏడుగురు కూడా ఎంపీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. రేణుకా చౌదరి 1984లో టీడీపీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. టీడీపీ తరపున రెండు సార్లు రాజ్యసభ సభ్యురాలిగా పనిచేశారు. దేవగౌడ, మన్మోహన్ ప్రభుత్వాల హయాంలో కేంద్రమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1999, 2004 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలిచారు. 2009 ఎన్నికల్లో ఓడిపోయాక 2012లో కాంగ్రెస్ నుంచి రాజ్యసభ ఎంపీగా రేణుకా చౌదరి ఎన్నికయ్యారు.

దానం అనర్హతపై స్పీకర్‌కు ఆదేశాలివ్వండి

- హైకోర్టులో పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ తరపున ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచి.. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ బీఫాంపై గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకొన్న దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలని మార్చి 18న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఎదుట పిటిషన్ దాఖలు చేశామని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని.. అనర్హత పిటిషన్‌పై త్వరగా విచారణ చేపట్టడంతోపాటు ప్రతివాది అయిన దానం నాగేందర్‌కు స్పీకర్ నోటీసులు జారీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్ సోమవారం హైకోర్టులో విచారణకు వచ్చే అవకాశం ఉంది.

టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్‌గా పొన్నం అశోక్ గౌడ్



తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్, మానవ హక్కులు, సమాచార హక్కు చట్టం విభాగం చైర్మన్‌గా హైకోర్టు సీనియర్ అడ్వకేట్ పొన్నం అశోక్‌గౌడ్ నియమితులయ్యారు. బుధవారం ఈ మేరకు ఏఐసీసీ నియామక పత్రాన్ని విడుదల చేసింది. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం పట్ల విధేయత, అడ్వకేట్‌గా అందిస్తున్న సేవలను గుర్తించి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన సిఫారసు మేరకు టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్‌గా అశోక్ గౌడ్‌ను నియమించినట్లు ఏఐసీసీ లీగల్ సెల్ కార్యదర్శి విపుల్ మహేశ్వరి తెలిపారు. కాగా తనను టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్‌గా నియమించిన ఏఐసీసీ, టీపీసీసీ నాయకత్వానికి పొన్నం అశోక్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

కల్వకుంట్ల కుటుంబమే పెద్ద చెడ్డీ గ్యాంగ్

- ఆ గ్యాంగుకు లీడర్ కేసీఆర్: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను పదేళ్ల పాటు దోచుకున్న కల్వకుంట్ల కుటుంబమే పెద్ద చెడ్డీ గ్యాంగ్ అని, ఆ గ్యాంగుకు లీడర్ కేసీఆర్ అని పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆ చెడ్డీ గ్యాంగు సభ్యులు కేటీఆర్, హరీశ్ రావు, కవిత అని చెప్పారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చెడ్డీ గ్యాంగులు అర్ధరాత్రి పూట దొంగతనాలు చేస్తాయని, కానీ.. కేసీఆర్ గ్యాంగు పట్టపగలే తెలంగాణను నిలువు దోపిడీ చేశాయని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డిపైన ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తాట తీస్తామని హరీశ్ రావును హెచ్చరించారు. ఎప్పుడో ఒకప్పుడు హరీశ్ రావే బీఆర్‌ఎస్ పార్టీకి వెన్నుపోటు పొడుస్తాడన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నెల జీతం ఎప్పుడు వస్తుందో తెలియక.. ఈఎంఐలు ఎలా కట్టాలో అర్థంకాక ఉద్యోగులు బాధపడుతున్నప్పుడు ఒక్క మాటా మాట్లాడని శ్రీనివాస్‌గౌడ్‌కు.. ఇప్పుడు ఉద్యోగుల గురించి మాట్లాడే హక్కు లేదని టీపీసీసీ అధికార ప్రతినిధి జి.హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. జీవో 317 బాధితులు ప్రగతిభవన్ చుట్టూ తిరుగుతూ అరెస్టులూ అయినప్పుడూ ఆయన స్పందించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల ఆత్మగౌరవం నిలబెడుతుందే కానీ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలా వారిని మోసం చేయబోదన్నారు.

మేడ్చల్‌లో బీఆర్‌ఎస్‌కు మరో షాక్

- హస్తం గూటికి మునిసిపల్ వైస్ చైర్మన్ సహా పది మంది కౌన్సిలర్లు
- సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరిక
- కాంగ్రెస్‌లోకి కంటోన్మెంట్, తుంగతుర్తి నియోజకవర్గాల బీఆర్‌ఎస్ నేతలు



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మేడ్చల్ కౌన్సిలర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)/మేడ్చల్‌టౌన్, ఏప్రిల్ 10: మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మేడ్చల్ మునిసిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు గట్టి షాక్ తగిలింది. బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు మూకుమ్మడిగా బుధవారం కారు దిగి హస్తం గూటికి చేరారు. మొత్తం 23 మంది కౌన్సిలర్లు ఉన్న మేడ్చల్ మునిసిపాలిటీలో ఇటీవల బీఆర్‌ఎస్ చెందిన మణికంఠ గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా బుధవారం మునిసిపల్ వైస్ చైర్మన్ సహా పది మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ కండువాను సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కప్పుకున్నారు. సీఎం నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.. ఇక కంటోన్మెంట్, తుంగతుర్తి నియోజకవర్గాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నేతలూ సీఎం రేవంత్ సమక్షంలో పార్టీలో చేరారు. కంటోన్మెంట్ మాజీ వైస్ చైర్మన్ జంపన ప్రతాప్ తదితరులు ఇందులో ఉన్నారు.

కష్టపడి పని చేయాలి: సీఎం రేవంత్

కొత్తగా కాంగ్రెస్ పార్టీలో చేరిన కౌన్సిలర్లకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి పనిచేసి మంచి గుర్తింపు పొందాలని సూచించారు. పార్టీలో చేరిన కౌన్సిలర్ల బృందం తమ వార్డుల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని సీఎంకు వినతి పత్రం సమర్పించారు. పార్టీలో చేరిన కౌన్సిలర్లకు తాము అండగా ఉంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌లు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేసి గెలిపించాలన్నారు.

జూన్‌లో స్థానిక ఎన్నికలు

లోక్‌సభ ఎన్నికల్లో పనితీరు ఆధారంగా అవకాశాలు.. చురుకుగా పనిచేసిన వారికి చాన్స్: సీఎం రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామపంచాయతీలకు జూన్ నెలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల్లో క్షేత్రస్థాయి నేతల పనితీరును బట్టి ఆ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసే అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. బుధవారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో జరిగిన భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశానికి సీఎం రేవంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకులంతా సమిష్టిగా పనిచేసి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని భువనగిరి ఎంపీగా గెలిపించాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి వరకు మూడంచెల సమన్వయ కమిటీల వ్యవస్థను త్వరితగతిన ఏర్పాటు చేసుకుని సమిష్టిగా పని చేయాలన్నారు. ఇటు డీసీసీ అధ్యక్షులు, అటు మండల, బూత్ స్థాయి కమిటీనూ సమన్వయం చేసుకుని పోల్ మేనేజ్‌మెంట్ పకడ్బందీగా నిర్వహించాలంటూ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమన్వయకర్తలకు సూచించారు. ప్రతి పది బూత్‌లను కలిసి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయాలని, వంద రోజుల్లో ప్రభుత్వ పనితీరును, రాహుల్‌గాంధీ ప్రకటించిన పాంచ్‌న్యాయ్ గ్యారెంటీలను, పార్టీ మేనిఫెస్టోను ప్రతి ఓటరు వద్దకూ వెళ్లి వివరించాలని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బూత్ కమిటీల్లో చురుకుగా పనిచేసిన వారికి గ్రామ వలంటీర్ల నియామకంలో ప్రాధాన్యం ఇస్తామని సీఎం చెప్పినట్లు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 30 వేల మందికి పైగా వలంటీర్లతో వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, ఇందులో మహిళలకు ఎక్కువగా అవకాశం కల్పిస్తామని, రూ.6 వేల గౌరవ వేతనం ఇస్తామని చెప్పినట్లు సమాచారం.



భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

ఇక ఈ నెల 21న భువగిరిలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమం పెట్టుకుందామని, అక్కడే సభనూ నిర్వహిద్దామని సీఎం రేవంత్ చెప్పారు. ఈ కార్యక్రమాల్లో తాను కూడా పాల్గొంటానన్నారు. కాగా, మే నెల మొదటి వారంలో నల్లగొండ, చౌటుప్పల్‌లో ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీ రోడ్‌షోలు ఉంటాయని తెలిపారు.

రేవంత్ వ్యూహాత్మక భేటీ!

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ సమీక్షను కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో నిర్వహించడం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. నియోజకవర్గంలోని పార్టీ నేతలంతా ఒక్కతాటిపై ఉన్నారని, పార్టీ అభ్యర్థిని గెలిపించడానికి సమిష్టిగా కృషి చేస్తున్నారనే సంకేతాన్ని ప్రజల్లోకి పంపారు. ఈ నియోజకవర్గం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి సన్నిహితుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎంపీగా పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే రాజగోపాల్‌రెడ్డి భార్య లక్ష్మి కూడా భువనగిరి టికెట్ కోసం చివరి వరకూ పోటీ పడ్డారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని నేతల మధ్య విభేదాల్లేవని చెప్పేందుకు.. సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా వారి ఐక్యతపై దృష్టి సారించారు. ఇప్పటివరకు జరిగిన నిజామాబాద్, సికింద్రాబాద్, వరంగల్ నియోజకవర్గాల సమీక్షలను తన నివాసంలోనే నిర్వహించిన సీఎం.. భువనగిరి సమీక్షను మాత్రం రాజగోపాల్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేశారు. తన నివాసానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని.. రాజగోపాల్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేలు, వేముల వీరేశం, మల్‌రెడ్డి రంగారెడ్డి, బీర్ల అయిలయ్య, నియోజకవర్గ ముఖ్యనాయకులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, బాలలక్ష్మి, చనగాని దయాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమ కెరటం పూలే

మహాత్మా జ్యోతిబా పూలే స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలను చేపడుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సామాన్యుడిగా మొదలై ఒక సామాజిక ఉద్యమ కెరటంగా ఎదిగిన పూలే జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. సామాజిక కార్యకర్తగా, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సంఘసంస్కర్త పూలే భావితరాలకు సైతం మార్గదర్శకుడని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల జనోద్ధరణకు ఆయన ఎంచుకున్న బాట, అనుసరించిన మార్గం సమాజ శ్రేయస్సును కాంక్షించే వారందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ప్రగతి భవన్‌కు మహాత్మా జ్యోతిబా పూలే పేరు పెట్టి ప్రజాభవన్‌గా మార్చిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఇండియా టీవీ నిర్వహిస్తున్న 'ఆప్ కీ అదాలత్' కార్యక్రమంలో పాల్గొనేందుకే ఆయన వెళుతున్నారు. అనంతరం సాయంత్రం తిరిగి హైదరాబాద్‌కు వస్తారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

రేవంత్‌ది సానుభూతి నాటకం

- సీఎం పదవి నుంచి తప్పిస్తారని భయం
- కొడంగల్‌లో పట్టపగలు బరాబర్ తిరుగుతా
- రావద్దనడానికి ఆయనెవరు?: డీకే అరుణ



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 10: కొడంగల్‌లో తనను దెబ్బ తీసేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి కుట్ర చేస్తున్నాయన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి, ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మండిపడ్డారు. ఇన్నాళ్లూ తనను సీఎం పదవి నుంచి దించుతారట అంటూ ప్రచారం చేసుకున్న రేవంత్‌రెడ్డిలో ఇప్పుడు భయం మరింత పెరిగి సింపతీ డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. బుధవారం మహబూబ్‌నగర్‌లోని తన నివాసంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. తాము చీకట్లో వచ్చిపోతున్నామనడం సరికాదని, ఆ అవసరం తనకు లేదని చెప్పారు. పట్టపగలు బరాబర్ ఇంటింటికీ తిరుగుతానని స్పష్టం చేశారు. "అభ్యర్థిగా ఉన్న నేను కొడంగల్‌లో తిరగవద్దా? అదేమైనా మీ సామ్రాజ్యమా? ఎవరూ రావద్దని గీత గీశారా? ప్రతి ఓటరునూ కలిసి ఓటు అడిగే హక్కు, బాధ్యత నాకు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో నీకు ఓటు వేయడంతో సీఎం అయ్యావు. ఇవి పార్లమెంట్ ఎన్నికలు. నువ్వు పోటీ చేయడంలేదు. అయినా నిన్ను ఓడించడానికి కుట్ర చేస్తున్నారని ఎలా అంటావు? నేను పోటీ చేస్తున్నది గెలవడానికి.. నిన్ను గెలిపించడానికి కాదు" అని అరుణ మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా తీసుకురాలేదనడం దురదృష్టకరమన్నారు. తాను ఎంపీగా పని చేయలేదని, జాతీయ ఉపాధ్యక్షురాలు అనేది పార్టీ పదవి అని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నందున పాలమూరు డిజైన్‌ను జూరాలకు మార్చి డీపీఆర్ చేస్తే కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. కేంద్రంలో మళ్లీ వచ్చేది బీజేపీయేనని, మూడోసారి మోదీ ప్రధాని అవుతారని అరుణ ధీమా వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్, బీజేపీపై చర్యలు తీసుకోండి

- ఈసీకి బీఆర్‌ఎస్ నేతల ఫిర్యాదు
- సీఈసీ, సీఈవో, డీజీపీలకు లేఖలు
- బీఆర్‌ఎస్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరించారని ఆక్షేపణ

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల సమయంలో తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా సీఎం ఎ.రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని బీఆర్‌ఎస్ నేతలు కర్నె ప్రభాకర్, దాసోజు శ్రవణ్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. అదేవిధంగా 'ఎక్స్' వేదికగా.. కామెంట్లు పెట్టిన బీజేపీపై, 'ఫోన్ ట్యాపింగ్ కేసులో పదిమంది బీఆర్‌ఎస్ నేతలు' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించారని ఆరోపిస్తూ.. వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. ఎన్నికల సమయంలో తమ పార్టీ నేతల ప్రతిష్ఠకు భంగం కలిగేలా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్‌కు ఫ్యాక్స్ ద్వారా, తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) వికాస్‌రాజ్, డీజీపీ రవిగుప్తాను నేరుగా కలిసి ఫిర్యాదు చేశారు. ఇటీవల తుక్కుగూడలో నిర్వహించిన కాంగ్రెస్ బహిరంగ సభలో మాజీ సీఎం కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభ్యంతరకర పదజాలంతో చవకబారు వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. 'మేము అనుకుంటే.. పీకడం మొదలు పెడితే.. మీ ముడ్డి మీద డ్రాయర్ కూడా ఉండదు. బిడ్డా.. నేను రేవంత్‌రెడ్డిని.. అంగి లాగు ఊడబీకి చెర్లపల్లి జైలులో చిప్పకూడు తినిపిస్తా' అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించినట్లు తెలిపారు. కేసీఆర్‌ను ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడారని, సీఎం రేవంత్‌రెడ్డిపై తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బీజేపీ ట్వీట్‌పై..!

'ఫ్రాడ్ 11- తెలంగాణను మోసం చేసిన దగాకోరు టీమ్ ఇదే' అనే క్యాప్షన్‌తో బీజేపీ అధికారిక ఎక్స్ ఖాతాలో ఈనెల 8న పోస్టు పెట్టారని.. ఇది అభ్యంతకరమని బీఆర్‌ఎస్ నేతలు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించే విధంగా ట్వీట్ చేశారని, తమ పార్టీ నేతల వ్యక్తిగత ప్రతిష్ఠ దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేతలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

'ఆంధ్రజ్యోతి'పై..!

'ట్యాపింగ్ కేసులో పదిమందికిపైగా బీఆర్‌ఎస్ నేతలు' శీర్షికన ఈనెల 10న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఎటువంటి ఆధారాల్లేవని, కాంగ్రెస్ పార్టీ ప్రోద్బలంతో ఇది రాశారని బీఆర్‌ఎస్ నేతలు ఈసీకి చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఓటర్ల దృష్టి మళ్లించడంలో భాగంగా.. బీఆర్‌ఎస్ నేతల ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పెయిడ్ న్యూస్ మాదిరిగా ఈ కథనం ప్రచురించారని ఆరోపించారు. పోలీసు అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదని, ప్రెస్‌నోట్ కూడా జారీ చేయలేదని, అయినా నిరాధారమైన కథనాన్ని ప్రచురించారన్నారు. ఇందుకుగాను 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ, ప్రింటర్, పబ్లిషర్ కోగంటి వెంకటశేషగిరిరావు, ఎడిటర్ కె.శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నేతలు ఈసీకి ఇచ్చిన ఫిర్యాదులో కోరారు.

రేవంత్‌రెడ్డి బీజేపీలో చేరడం ఖాయం

కాంగ్రెస్‌లో రాహుల్, రేవంత్‌ది చెరో దారి.. ముఖ్యమంత్రి మాటలు స్థాయికి తగినట్లుగా లేవు

- ఫోన్ ట్యాపింగ్‌పై పెట్టిన శ్రద్ధ మంచినీళ్లపై పెట్టాలి: కేటీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

పీర్జాదిగూడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెరో దారి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఓవైపు రాహుల్ 'భారత్ జోడో యాత్ర' అని దేశమంతా తిరుగుతుంటే.. రేవంత్‌రెడ్డి మాత్రం ప్రధాని మోదీ తన పెద్దన్న అంటున్నారని తెలిపారు. లిక్కర్ స్కామ్ జరగలేదని రాహుల్ అంటుంటే.. జరిగిందని రేవంత్ అంటున్నారని చెప్పారు. తనపై ఉన్న కేసుల నుంచి తప్పించుకోవడానికి రేవంత్‌రెడ్డి కచ్చితంగా బీజేపీలో చేరుతారని చెప్పారు. బుధవారం మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓ కన్వెన్షన్‌లో ఉమ్మడి ఘట్‌కేసర్ మండల పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కొంతమంది నాయకులు స్వలాభం కోసం పార్టీని వీడినా బీఆర్‌ఎస్‌కు ఎలాంటి నష్టం లేదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రజలు తమకిచ్చిన ప్రధాన ప్రతిపక్షం బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలిచ్చి గద్దెనెక్కిందని, అందులో ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలు ముఖ్యమంత్రి స్థాయికి తగినట్లుగా లేవన్నారు. రేవంత్‌రెడ్డి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నానని, ఆయన ప్రభుత్వాన్ని పడగొట్టాల్సిన కర్మ తమకు లేదని అన్నారు. ముఖ్యమంత్రి ఫోన్ ట్యాపింగ్ మీద పెట్టిన శ్రద్ధను ప్రజలకు అందించే మంచినీళ్ల మీద పెట్టాలని హితవు పలికారు.

తెలంగాణకు రూపాయి కూడా ఇవ్వని మోదీ..

పదేళ్లు దేశాన్ని నడిపిన ప్రధాని మోదీ తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని కేటీఆర్ తెలిపారు. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటు వేసినా ఆయన మల్కాజిగిరిలో ఉండరని, హుజూరాబాద్ వెళ్లిపోతారని అన్నారు. ప్రజలు స్థానిక అభ్యర్థి రాగిడిని గెలిపించాలని కోరారు. 'రాముడిని మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం. రాముడి పేరు చెప్పుకొని రాజకీయం చేసే బీజేపీని తన్ని తరిమేద్దాం" అని పిలుపునిచ్చారు. అయోధ్యలో ఉన్నది రాముడే, భద్రాచలంలో ఉన్నది కూడా రాముడే అయినా.. భద్రాచలం రాముడికి కేంద్రం ఒక్క రూపాయి కూడా ఎందుకు ఖర్చు చేయలేదని ప్రశ్నించారు. బీజేపీ మతోన్మాదాన్ని అరికట్టాలన్నారు.

ఎన్నికలయ్యాక రేవంత్ సొంత దుకాణం

- 25 మంది ఎమ్మెల్యేలతో కలిసి బీఆర్‌ఎస్‌తో ఆయన కూటమి..
- ఉత్తమ్, పొంగులేటి కూడా పదేసి మంది ఎమ్మెల్యేలతో సిద్ధం
- భట్టి 9 శాతం బీ ట్యాక్స్ లీకు ఇచ్చింది కాంగ్రెస్ వాళ్లే : ఏలేటి



హైదరాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత దుకాణం పెట్టుకునేందుకు సిద్ధమయ్యారని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర రెడ్డి పేర్కొన్నారు. 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను వెంటబెట్టుకొని రేవంత్ రెడ్డి.. బీఆర్‌ఎస్‌తో చేతులు కలపనున్నారని చెప్పారు. మంత్రులు ఉత్తమ్, పొంగులేటి కూడా పది మంది చొప్పున ఎమ్మెల్యేలతో సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ మేరకు లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారనున్నాయని చెప్పారు. బుధవారం మహేశ్వర రెడ్డి హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. మహబూబ్‌నగర్ ఎంపీ సీటు ఓడిపోతున్నామని రేవంత్ స్వయంగా ఒప్పుకొన్నారని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సొంత పార్టీ వాళ్ల వల్ల రేవంత్ అభద్రతా భావంలో ఉన్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వాళ్లు గేట్లు ఓపెన్ చేసినా పట్టుమని పది మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను తెచ్చుకోలేకపోయారని విమర్శించారు. భట్టిని పక్కకు తప్పించే ప్రయత్నం జరుగుతోందని, భట్టి 9 శాతం బీ ట్యాక్స్ లీకు కాంగ్రెస్ వాళ్లే ఇచ్చారని ఆరోపించారు.. భట్టిని పక్కన పెట్టి రెండో స్థానం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, అక్కడికి వచ్చే నాయకుడు ఆ తర్వాత మొదటి స్థానం చేరుకోవడం కోసం ప్రయత్నాలు చేస్తారని చెప్పారు. ఉప ఎన్నికలు వస్తే రాష్ట్రంలో ప్రజలు బీజేపీ వైపు ఉంటారని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తెలంగాణలో 12 సీట్లు రాబోతున్నాయని జోష్యం చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు, సీఎం రేవంత్ రెడ్డికి దగ్గరి పోలికలు ఉన్నాయని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతోనే తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మోదీని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదని ఏలేటి పేర్కొన్నారు. అధికారం పోయిందనే నిస్పృహలో ఆయన ఉన్నారని, చేసిన తప్పులకు కేటీఆర్ జైలుకు వెళ్లే అవకాశం కూడా ఉందన్నారు. లిక్కర్ కేసులో చెల్లి ఇప్పటికే తిహాడ్ జైల్లో ఉందని చెప్పారు. ఆ జైల్లో ఎండ ఎక్కువ ఉందని, కనీసం ఫ్యాన్ కూడా లేదని చెల్లి చెప్పడంతో కేటీఆర్ ఇక్కడే ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేరేందుకు పిచ్చెక్కినట్లు నటిస్తున్నారని విమర్శించారు.

ప్రచారంలో నిదానం!

- అభ్యర్థిగా ప్రకటించినా.. ఇంకా వెనుకడుగే
- సీఎం సమీక్ష తర్వాత కూడా ప్రారంభం కాని ప్రచార పర్వం
- నేతలతో సమావేశాలకు దూరంగా నాగేందర్



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎన్నికల ప్రచారంలో నిదానమే ప్రధానం అన్నట్టుగా వ్యవహరిస్తున్నారా? కాంగ్రెస్‌లో చేరిన వెంటనే సికింద్రాబాద్ పార్లమెంట్ టికెట్ దక్కించుకున్న ఆయన.. ఎన్నికలకు సమాయత్తం కావడంలో అంత వేగం చూపడం లేదా? ఒకవైపు బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతుంటే.. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వెనుకబడిందా? అంటే.. అవుననే అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు. వాస్తవానికి కాంగ్రెస్‌లో సికింద్రాబాద్ టికెట్ కోసం బొంతు రామ్మోహన్‌తోపాటు పలువురు నేతలు తీవ్రంగా ప్రయత్నించారు. కానీ, సికింద్రాబాద్ పరిధిలో విస్తృత పరిచయాలు ఉండడం, ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసి ఉండడం.. దానం నాగేందర్‌కు కలిసి వచ్చింది. అందుకే కాంగ్రెస్‌లో చేరగానే అధిష్ఠానం సైతం టికెట్ ఖరారు చేసింది. కానీ, ఇప్పటిదాకా ఆయన ఎన్నికల ప్రచార పర్వంలోకి దిగకపోవడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. ఈ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఇప్పటిదాకా ఎక్కడా ఆయన సమావేశాలు నిర్వహించలేదు. వివిధ సామాజిక సంఘాలు, నేతలను కలవడంలోనూ వెనుకంజలోనే ఉన్నారు. ఎన్నికల ప్రచారం ప్రారంభించకపోవడం, ఇటీవల తుక్కుగూడలో నిర్వహించిన రాహుల్‌గాంధీ సభకు నేతలు, కార్యకర్తలను తరలించే ప్రయత్నం చేయకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డి తన ఇంట్లో సికింద్రాబాద్ నియోజకవర్గ ముఖ్య నేతలతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికలకు సమయత్తం కావాలని దిశానిర్దేశం చేశారు. కానీ, ఆ తర్వాత కూడా ప్రచారం ప్రారంభం కాలేదు. ఇప్పటికే బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు ప్రచారాన్ని ప్రారంభించడమే కాకుండా ఎక్కడికక్కడ ఎన్నికల కార్యాలయాలను ప్రారంభిస్తూ నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. కానీ, అధికారంలో ఉండి, అభ్యర్థి ఖరారైనా ప్రచారం ప్రారంభం కాకపోవడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నిరుత్సాహం నెలకొంది.

ఐఐటీ గ్రాడ్యుయేట్లకే ఉద్యోగాలు కరువు

» ఎన్నికల వేళ నిరుద్యోగంపై చర్చ జరగాలి: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): "ప్రఖ్యాత విద్యాసంస్థల్లో చదువుకున్న ఐఐటీ గ్రాడ్యుయేట్లకు కూడా ఉద్యోగాలు లేవు. దేశంలో నిరుద్యోగానికి ఇది నిదర్శనం కాదా..?" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ప్రతిష్ఠాత్మక ముంబై ఐఐటీలో 36 శాతం మంది విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ పొందలేకపోయారని ఇటీవల వార్తలు వెలువడిన నేపథ్యంలో ఈ అంశంపై బుధవారం 'ఎక్స్ ' వేదికగా ఆయన స్పందించారు. కేంద్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకోబోతున్న ఈ కీలక సమయంలో నిరుద్యోగంపై చర్చ జరగాలని, ప్రపంచంలోనే యువరక్తం అధికంగా ఉన్న మన దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య నిరుద్యోగమేనని పేర్కొన్నారు.

హైదరాబాద్ అంటేనే వరల్డ్ క్లాస్ సిటీ

"హైదరాబాద్ అంటేనే వరల్డ్ క్లాస్ సిటీ. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన నగరం. ఎవరైనా సరే ఒప్పుకోక తప్పని నిజమిద"ని కేటీఆర్ పేర్కొన్నారు. బెంగళూరు, హైదరాబాద్ సిటీలను పోల్చుతూ మన నగరం ఫోటోను వాడటం పట్ల బుధవారం 'ఎక్స్' వేదికగా ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన ఫోటోను పోస్ట్ చేస్తూ... "హైదరాబాద్ అంటే ఇదీ!" అంటూ క్యాప్షన్ పెట్టారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో డీఎంవోలుగా అనర్హులు

» టీఎస్ఎంసీ తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలోని మెజార్టీ ఆస్పత్రుల్లో సరైన అర్హత లేనివారిని డ్యూటీ మెడికల్ ఆఫీసర్లుగా నియమిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి తనిఖీల్లో వెల్లడైంది. డీఎంవోలుగా ఆయుష్ వైద్యులు, ఫార్మ్ డి డిగ్రీ చేసినవారిని నియమిస్తున్నట్లు తేలింది. అటువంటివారే రోగుల కేస్‌షీట్‌లు రాస్తున్నట్లు గుర్తించారు. అలాగే మెజార్టీ ప్రైవేటు ఆస్పత్రులు వాటి రిజిస్ట్రేషన్ నంబర్లను ప్రదర్శించడం లేదు. జీహెచ్ఎంసీ పరిధిలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులతో పాటు నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లు, ప్రైవేటు ఆస్పత్రులను తెలంగాణ రాష్ట్ర వైద్యమండలి బృందం తనిఖీ చేసింది. అవి మెడికల్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వైద్యులు ఇక్కడి మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోకుండానే మనదగ్గర వైద్య సేవలందిస్తున్నట్లు గుర్తించారు. అలాగే మరికొందరు వైద్యులు వారి రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరించుకోకుండానే ప్రాక్టీస్ చేస్తున్నట్లు తేల్చారు. ఇకపై నిబంధనలు ఉల్లంఘిస్తే మెడికల్ కౌన్సిల్ తగిన చర్యలు తీసుకుంటుందని ఛైర్మన్ డాక్టర్ మహేశ్‌కుమార్ హెచ్చరించారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

» నలుగురి అరెస్టు, రూ.43,57,461 నగదు స్వాధీనం

మియాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఓ ముఠాకు చెందిన నలుగురిని సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.43,57,461, మూడు ల్యాప్‌టాప్‌లు, ఎనిమిది మొబైల్ ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మియాపూర్, మాతృశ్రీనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసిన సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు నిందితులను పట్టుకున్నారు. నిందితులను విచారించగా ఏపీలోని నరసరావుపేటకు చెందిన శాఖమూరి వెంకటేశ్వర్‌రావు అలియాస్ చిన్ను ఆధ్వర్యంలో బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిసింది. క్రికెట్ లైవ్ గురు, లక్కీ ఆన్‌లైన్ యాప్, కాల్ కాన్ఫరెన్స్ ద్వారా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్టు గుర్తించారు. సుమారు 50 వరకు పంటర్స్(బుకీలు) బెట్టింగ్‌లో పాల్గొన్నట్లు తెలుస్తుంది. కాగా, పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌కు చెందిన మనం రాజేష్, బొల్లె స్వామి, ఏపీలోని గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన ఆలూరు త్రినాథ్, విజయనగరం జిల్లా లింగాలపలసకు చెందిన మార్పెన్న గణపతిరావు ఉన్నారు. ప్రధాన నిందితుడు శాఖమూరి వెంకటేశ్వర్‌రావు పరారీలో ఉన్నాడు.

మేడిగడ్డ బ్యారేజీలో ఏ మార్పు లేదు

» 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఈఈ వివరణ

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 10: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు సంబంధించి కొత్తగా ఏమార్పులేదని ఆ బ్యారేజీ ఈఈ తిరుపతిరావు తెలిపారు. ఆంధ్రజ్యోతి మెయిన్‌లో మంగళవారం ప్రచురితమైన 'మేడిగడ్డ మరింత కుంగింది' కథనంపై ఆయన స్పందించారు. బ్యారేజీలోని 7వ బ్లాకులో పిల్లర్లు కుంగిన సమయంలో నీరు ఉండటం వల్ల కుంగిన దృశ్యాలు కనబడలేదని పేర్కొన్నారు. నిపుణుల పర్యటనల నేపథ్యంలో నీటిని తొలగించడంతో పెద్దగా కుంగినట్లు కనిపిస్తోందన్నారు. అయితే బ్యారేజీ పిల్లర్లు కుంగిన నాటి నుంచి స్వల్పమార్పులు తప్ప పెద్దగా కుంగలేదని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

గణనీయంగా తగ్గిన ఎల్లంపల్లి నీటి మట్టం

» తాగునీటికి ఇబ్బంది లేదంటున్న అధికారులు

మంచిర్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట గ్రామంలోని గోదావరిపై నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి పడిపోయింది. ఓ వైపు ఎండలు ముదరడం, మరోవైపు వివిధ పనుల నిమిత్తం ఇప్పటిదాకా నీటి కేటాయింపులతో ప్రాజెక్టులో నీటి మట్టం అట్టడుగుకు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాల కోసం 313 క్యూసెక్కులు, రామగుండంలోని ఎన్టీపీసీ పంప్‌హౌస్‌కు 121 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా బుధవారం నాటికి 7.25 టీఎంసీలకు పడిపోయింది. నిరుడు ఇదే సమయానికి ప్రాజెక్టులో 10.06 టీఎంసీల నీరు అందుబాటులో ఉండగా, ఈ ఏడాది ఇప్పటి వరకు మూడు టీఎంసీల మేర నీటి మట్టం తగ్గింది. ప్రాజెక్టు నుంచి విషన్ భగీరథ పంప్ హౌస్‌కు నీరందించే ఇన్‌టేక్ వెల్ వద్ద వారం రోజుల్లో నీరు పూర్తిగా అడుగంటి పోయింది. నిరుటితో పోలిస్తే ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గు ముఖం పట్టినా తాగునీటి అవసరాలకు ఢోకా లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో రాహిల్‌కు బెయిల్

పంజాగుట్ట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా భవన్ ముందు జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో ప్రధాన నిందితుడు, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్ అలియాస్ సాహిల్‌కు బుధవారం నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. గత ఏడాది డిసెంబరు 23న అర్ధరాత్రి రాహిల్, మరో ముగ్గురు కారులో పంజాగుట్టవైపు వెళుతూ ప్రజా భవన్ వద్ద బారికేడ్లను ఢీకొట్టారు. పంజాగుట్ట పోలీసులు అప్పుడే రాహిల్‌ను అదుపులోకి తీసుకుని, మద్యం తాగాడా లేదా అని పరీక్ష నిర్వహించడానికి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లే క్రమంలో తప్పించుకున్నాడు. తండ్రితో కలిసి దుబాయ్ పారిపోయాడు. దీంతో వారిపై లుకౌట్ నోటీస్ జారీ అయింది. రాహిల్ ఈ నెల 7న హైదరాబాద్ వచ్చి పోలీసుల ముందు లొంగిపోయాడు. అతనికి నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. అతని తరఫు న్యాయవాదులు నాంపల్లి కోర్టులో, హైకోర్టులో లంచ్ మోషన్‌లో బెయిల్ కోసం, పోలీసులు అతని కస్టడీ కోసం పిటిషన్లు వేశారు. నాంపల్లి కోర్టు రాహిల్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కస్టడీ పిటిషన్‌ను కొట్టేసింది.

యాదాద్రి జిల్లాలో పార్శ్వనాథుడి విగ్రహం లభ్యం

రాజాపేట, ఏప్రిల్ 10: యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం నెమిల గ్రామంలో జైనమత 23వ తీర్థంకరుడు పార్శ్వనాథుడి విగ్రహం లభ్యమైంది. ఈ విషయాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ రామోజు హరగోపాల్, బృందం సభ్యుడు కుండె గణేష్‌లు వెల్లడించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నెమిల గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద అసంపూర్తిగా ఉన్న విగ్రహాన్ని గుర్తించి స్థానికులు సమాచారం ఇచ్చారని చెప్పారు. ఆ విగ్రహాన్ని పరిశీలించి, జైన ధర్మానికి చెందిన 23వ తీర్థంకరుడి విగ్రహంగా గుర్తించామని తెలిపారు. ఈ శిల్పానికి వెనుక భాగాన చుట్టలు తిరిగిన 7 తలల సర్పం ఉన్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, దాని ఆధారంగా పార్శ్వనాథుడి విగ్రహంగా గుర్తించామని వివరించారు. దీనిని రాష్ట్ర కూట శైలిలో చెక్కారని చెప్పారు. 22వ జైన తీర్థంకరుడైన నేమినాథుడి పేరుమీదనే నెమిల గ్రామం వెలిసిందని, ఈ ప్రాంతమంతా జైన వసతులతో అలరారేదని పేర్కొన్నారు.

కవితను జైల్లోనే విచారించాం!

» అందుకే కౌంటర్ దాఖలు చేయలేదు
» రౌస్ అవెన్యూ కోర్టుకు తెలిపిన సీబీఐ
» మాకు తెలియకుండా విచారించడం సరికాదు
» కవిత తరఫు న్యాయవాదుల అభ్యంతరం
» తదుపరి విచారణ 26కు వాయిదా



న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఇప్పటికే విచారించామని సీబీఐ రౌస్ అవెన్యూ కోర్టుకు తెలిపింది. అందుకే కౌంటర్ దాఖలు చేయలేదని పేర్కొంది. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న కవితను ప్రశ్నించేందుకు సీబీఐకి ఈ నెల 5న కోర్టు అనుమతి ఇచ్చింది. దీన్ని కవిత రౌస్ అవెన్యూ కోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై కోర్టు ఈ నెల 6న విచారణ జరిపింది. కవితను విచారించేందుకు సీబీఐకి అనుమతి ఇవ్వడంపై స్టేటస్‌కో ఇవ్వాలని ఆమె తరఫు న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు. ముందస్తు సమాచారం లేదని, కనీసం సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ కాపీ కూడా తమకు అందలేదని, అలాంటప్పుడు అనుమతివ్వడం సరికాదని ఆయన వాదించారు. ఆ వాదనతో జడ్జి కావేరీ బవేజా విభేదించారు. పిటిషన్‌పై వాదనలు విన్న తర్వాతే ఏ ఉత్తర్వులైనా ఇస్తామన్నారు. కవిత పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐని ఆదేశించి, తదుపరి విచారణను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో కవిత పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. కవిత తరఫున న్యాయవాదులు నితేష్ రాణా, మోహిత్ రావు వాదనలు వినిపించారు. సీబీఐ ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. గత శనివారమే కవితను జ్యుడీషియల్ కస్టడీలో విచారించామని సీబీఐ తరఫు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. అందుకే కౌంటర్ దాఖలు చేయడం లేదని చెప్పారు. భవిష్యత్తులో కవితను విచారించాలనుకుంటే ముందుగానే సమాచారం ఇవ్వాలని జడ్జి కావేరి సీబీఐని ఆదేశించారు. అయినప్పటికీ తమకు సమాచారం ఇవ్వకుండా సీబీఐ కవితను విచారించడం సరికాదని, దీనిపై తమ వాదనలు వినిపిస్తామని ఆమె తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తదుపరి విచారణను ఈ నెల 26కు వాయిదా వేసింది.

కిడ్నాప్ టాస్క్.. షేర్ల బదిలీకి ఫోర్స్

(మొదటి పేజీ తరువాయి)



మొత్తం కంపెనీని కొట్టేయాలని పథకం వేశారు. వేణుమాధవ్ షేర్లను తమకు అమ్మేయాలంటూ ఒత్తిడి చేయడం ప్రారంభించారు. ఏంచేయాలో తెలియక అయోమయంలో ఉన్న వేణుమాధవ్.. గోల్డ్‌ఫిష్ అడోబ్ సంస్థ సీఈవో చంద్రశేఖర్‌ను సంప్రదించారు. ఆయన ఈ సమస్యను పరిష్కరిస్తానని నమ్మబలికి.. వేణుమాధవ్ పేరిట ఉన్న నాలుగు లక్షల షేర్లను తన పేరిట తాత్కాలికంగా బదిలీ చేయించుకున్నారు. ఆ తర్వాత భాగస్వాముల ఒత్తిడి, బెదిరింపులు పెరగడంతో.. వేణుమాధవ్ పోలీసులను ఆశ్రయించారు. 2018 నవంబరు 22న వేణుమాధవ్ ఆఫీసు నుంచి తన కార్లో ఇంటికి వెళ్తుండగా.. కొందరు వ్యక్తులు ద్విచక్రవాహనాలపై ఆయనను వెంబడించారు. గచ్చిబౌలి సమీపంలో బైక్‌లను అడ్డుపెట్టి.. కారును ఆపారు. ఆ వెంటనే కార్లోకి చొరబడ్డారు. వేణుమాధవ్ అరిచేందుకు యత్నించగా.. తాము టాస్క్‌ఫోర్స్ పోలీసులమని చెప్పారు. వారిలో అప్పటి టాస్క్‌ఫోర్స్ ఎస్సై మల్లికార్జున్‌తోపాటు.. మరికొందరు సిబ్బంది ఉన్నారు. నేరుగా సికింద్రాబాద్‌లోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తరలించారు. అక్కడ ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు గదిలో నిర్బంధించారు. ఆ తర్వాత కొద్ది సేపటికి క్రియా హెల్త్‌కేర్ భాగస్వాములు, సీఈవో బాలాజీ, గోల్డ్‌ఫిష్ సీఈవో చంద్రశేఖర్ అక్కడికి చేరుకున్నారు. దాంతో.. చంద్రశేఖర్ తన భాగస్వాములతో కలిసిపోయాడని, పోలీసుల సాయంతో తనను బెదిరించే ప్రయత్నంలో ఉన్నట్లు అర్థం చేసుకున్నారు. వేణుమాధవ్‌ను భయపెట్టేందుకు ఎస్సై మల్లికార్జున్ పక్కగదిలో వేరేకేసులో తీసుకొచ్చిన ఓ వ్యక్తిని తీవ్రంగా హింసించారు. "మాటవిని షేర్లను బదిలీ చేయి.. లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయి" అని బెదిరించారు. ఆ తర్వాతి రోజు సాయంత్రం వరకు టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలోనే నిర్బంధించారు. ఆ తర్వాత గట్టుమల్లు, ఎస్సై మల్లికార్జున్, మిగతా వారితోపాటు.. వేణుమాధవ్‌ను అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ దగ్గరకు తీసుకెళ్లారు. రాధాకిషన్ కూడా అదే తరహాలో బెదిరించారు. దీంతో బాధితుడు తన మిత్రుడు, లహరీ రిసార్ట్స్ ఎండీ సంజయ్‌కి ఫోన్‌లో విషయం చెప్పారు. సంజయ్ హుటాహుటిన డీజీపీని కలిసి, పరిస్థితిని వివరించారు. డీజీపీ రాధాకిషన్‌కు ఫోన్ చేయగా.. తప్పుడు సమాచారమిచ్చి, ఏమార్చారు. "వేణుమాధవ్‌ను మనీలాండరింగ్, మరికొన్ని కేసుల్లో తీసుకొచ్చాం" అని బుకాయించారు. ఆ తర్వాత వేణుమాధవ్ ఫోన్‌ను లాక్కొన్నారు. అక్కడికక్కడే వేణుమాధవ్ షేర్లను అతని భాగస్వాముల పేరిట బదిలీ చేయించారు. అందుకు ప్రతిఫలంగా రాధాకిషన్ అండ్ కో.. వేణుమాధవ్ భాగస్వాముల నుంచి రూ.10లక్షలు తీసుకున్నారు. "నిన్ను వదిలేస్తున్నాం. బయటకు వెళ్లాక మీడియాకు గానీ.. ఇంకెవరికైనా విషయం చెబితే చంపేస్తాం" అని బెదిరించి పంపారు. ప్రాణభయంతో తాను ఇంత వరకు ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదని, తాజాగా ఫోన్ ట్యాపింగ్‌లో రాధాకిషన్ అరెస్టవ్వడంతో ధైర్యం తెచ్చుకుని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చినట్లు జూబ్లీహిల్స్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఐపీసీలోని సెక్షన్లు 386, 365, 341, 120(బి) ఐపీసీ రెడ్‌విత్ 34 కింద కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు ప్రారంభించినట్లు జూబ్లీహిల్స్ పోలీసులు వివరించారు.

ఫోన్ ట్యాపింగ్‌పై.. ఈడీకి హైకోర్టు న్యాయవాది ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో వ్యాపారులను బెదిరించి డబ్బులు వసూలు చేసిన కేసులో ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్(పీఎంఎల్ఏ) ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని హైదరాబాద్ ఈడీ జాయింట్ డైరెక్టర్‌కు హైకోర్టు న్యాయవాది యూవీ సురేశ్ కుమార్ ఫిర్యాదు చేశారు. ఎన్నికల సమయంలో ఓ పార్టీ డబ్బులు పోలీసు వాహనాల్లో తరలించినట్లు నిందితులు వెల్లడించిన విషయాన్ని ఆయన ఈడీ అధికరుల దృష్టికి తీసుకెళ్లారు. ఈడీ కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపితే ట్యాపింగ్ వెనక ఉన్న రాజకీయ నాయకులు, డబ్బులు చేతులు మారడం వంటి అంశాల్లో వాస్తవాలు నిగ్గుతేలుతాయని పేర్కొన్నారు. ఈడీ చర్యలు తీసుకోకుంటే.. తాను హైకోర్టును ఆశ్రయిస్తానని సురేశ్‌కుమార్ వివరించారు. కాగా.. రాధాకిషన్‌రావు పోలీసు కస్టడీ ముగియడంతో పంజాగుట్ట పోలీసులు బుధవారం సాయంత్రం ఆయనను న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. జడ్జి ఆయనకు ఈ నెల 12 వరకు రిమాండ్ విధించడంతో.. చంచల్‌గూడ జైలుకు తరలించారు.

'ఎక్స్'లో సీఎం రేవంత్ అకౌంట్‌కు

బ్లూటిక్ మాయం

హైదరాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ మైక్రోబ్లాగింగ్ వెబ్‌సైట్ ఎక్స్(ట్విటర్)లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖాతాకు ఉన్న బ్లూటిక్ బుధవారం హఠాత్తుగా మాయమైంది. ఎక్స్‌లో ఓ వ్యక్తి లేదా సంస్థ అధికారిక ఖాతాను గుర్తించేందుకు బ్లూటిక్‌ను ప్రామాణికంగా భావిస్తుంటారు. బ్లూటిక్ ఉన్న ఖాతాలను వెరిఫైడ్ అకౌంట్స్ అంటారు. అలాంటి బ్లూటిక్ పోవడంతో సీఎం రేవంత్ అకౌంట్ హ్యాక్ అయ్యిందనే చర్చ జరిగింది. బ్లూటిక్ పోవడానికి కారణాలను విశ్లేషిస్తూ నెటిజన్లు పోస్టులు పెట్టారు. అయితే, ముఖ్యమంత్రి ఎక్స్ ప్రొఫైల్‌లో చేసిన మార్పుల వల్ల బ్లూటిక్ కోల్పోయినట్లు ఐటీ శాఖ వర్గాలు వెల్లడించాయి. వెరిఫైడ్ ఖాతాల వారు తమ ప్రొఫైల్‌లో ఇచ్చిన సమాచారంలో మార్పులు చేసినప్పుడు బ్లూటిక్‌ను ఎక్స్ కొన్ని గంటల పాటు తీసేస్తుంది. ఖాతాదారుల మార్చిన సమాచారాన్ని సమీక్షించిన తర్వాత బ్లూటిక్‌ను పునరుద్ధరిస్తుంది.

నిజాం షుగర్స్ పునరుద్ధరణకు

కమిటీ గ్రీన్‌సిగ్నల్

మెదక్, ఏప్రిల్ 10: నిజాం షుగర్స్ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ్యులతో వేసిన అంచనాల (ఎస్టిమేట్స్) కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ విషయమై నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్ఎల్) పునరుద్ధరణ కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ..2002-2003 క్రషింగ్ సీజన్ మొదలుకొని 2014- 2015 వరకూ ఫ్యాక్టరీ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో నడిచి నష్టాల పాలైనట్టు తెలిపారు. సుమారు రూ.407 కోట్ల మేరకు అప్పులున్నట్టు కమిటీ గుర్తించినట్టు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్డీఎస్ఎల్ మెదక్, బోధన్, మెట్‌పల్లి యూనిట్లలో లే-ఆఫ్ ప్రకటించి కార్మికులు, రైతులను రోడ్డున పడేసిందని ఆరోపించారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకపక్షంగా 2015లో లే-ఆఫ్ ప్రకటించి ఫ్యాక్టరీల ఆస్తులను అమ్ముకోవడానికి ప్రయత్నించిందని ఆరోపించారు. గతంలో చేసిన అప్పులను 51శాతం రాయితీతో వాయిదాల పద్ధతిలో బ్యాంకులకు చెల్లింపులు చేయాల్సిందిగా ప్రభుత్వానికి లేఖ రాసినట్లు ఆయన తెలిపారు.

కాళేశ్వరంపై ప్రస్తుతానికి

న్యాయ విచారణే

» ఈ దశలో సీబీఐ విచారణకు ఆదేశించలేం
» హైకోర్టు స్పష్టీకరణ.. విచారణ జూన్‌కు వాయిదా

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై న్యాయ విచారణకు ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ప్రస్తుతానికి ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కమిషన్స్ ఆఫ్ ఎంక్వయిరీ యాక్ట్ - 1952 అధికారాలను ఉపయోగించుకుని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ ఆధ్వర్యంలో జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసినట్లు తన వివరణలో తెలియజేసినట్లు పేర్కొంది. ఈ దశలో సీబీఐ విచారణకు ఆదేశాలు ఇవ్వలేమని చెప్పింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, ప్రొఫెసర్ కోదండరాం, బక్క జడ్సన్, న్యాయవాదులు రామ్మోహన్ రెడ్డి, ఎం.విశ్వనాథ్ రెడ్డి తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. గత విచారణ సందర్భంగా సోర్స్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఎక్కడ నుంచి వచ్చిందో వివరించాలని హైకోర్టు ఆదేశించడంతో కేఏ పాల్ సవరణ పిటిషన్ దాఖలు చేశారు. ఒక్కసారి తనకు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వాలని కేఏ పాల్ కోరడంతో ధర్మాసనం అవకాశం ఇచ్చింది. కేఏ పాల్ వాదనలు వినిపిస్తూ.. రూ.1.05లక్షల కోట్లతో ప్రాజెక్టును నిర్మించగా.. వడ్డీలు, ఇతర ఖర్చులు కలిపి రూ.2లక్షల కోట్ల భారం పడిందని తెలిపారు. కాళేశ్వరం లోపాల గురించి స్వయంగా కాగ్ తన నివేదికలో వెల్లడించిందని పేర్కొన్నారు. దీనిప్రకారమైనా సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. అక్రమాలకు పాల్పడిన వ్యక్తులను ప్రాసిక్యూట్ చేయడంతోపాటు నిధులను సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ప్రస్తుతం ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని పేర్కొంది. తదుపరి విచారణను జూన్ నెలకు వాయిదా వేసింది.

'ఐఎంజీ'పై పిటిషన్ల విచారణ వాయిదా

ఐఎంజీ అకాడమీస్‌కు 850 ఎకరాల భూకేటాయింపు వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ శ్రీరంగారావు తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ ఈనెల 29కి వాయిదా పడింది. చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం ఎదుట బుధవారం మరోసారి ఈ పిటిషన్లు విచారణకు వచ్చాయి. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. భూకేటాయింపు ఒప్పందం, సేల్‌డీడ్ రద్దుకు ప్రత్యేక చట్టం తేవడం సబబే అని ఇదే హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని.. దానిపై ఐఎంజీ సుప్రీంకోర్టుకు వెళ్లిందని తెలిపారు. సుప్రీంకోర్టులో ఉన్న పిటిషన్‌కు, సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలన్న పిటిషన్లకు సంబంధం లేదని పేర్కొన్నారు. ఐఎంజీ అప్పీల్ సుప్రీంకోర్టులో లిస్ట్ కానందున.. ప్రస్తుత పిటిషన్లను ఈనెల 29కి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు తెలిపింది.

భలే చెప్పారు బ్రహ్మానందం!

» ప్రాచీన సాహిత్యంపై ప్రసంగంతో మంత్రముగ్ధులను చేసిన హాస్య బ్రహ్మ
» అద్భుత ప్రసంగం విన్నానన్న వెంకయ్య
» పోలవరపు కోటేశ్వరరావు సాహిత్య సర్వస్వం రెండవ సంపుటి ఆవిష్కరణ



సాహిత్య సర్వస్వం రెండవ సంపుటిని ఆవిష్కరిస్తున్న వెంకయ్య, చిత్రంలో బ్రహ్మానందం, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): వెండి తెర మీద కనిపించి ముఖకవళికలతోనే నవ్వులు పూయించే బ్రహ్మానందం ప్రాచీన సాహిత్యం మీద అరగంటకుపైగా ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు. ఆలోచింపజేసేలా ఉండటంతో ఆ ప్రసంగాన్ని సభికులు ఎంతో ఆసక్తిగా విన్నారు. మహాకవి ధూర్జటి మీద బౌద్ధం ప్రభావం ఉందంటూ తనదైన శైలిలో విశ్లేషించారు. ధూర్జటి, బమ్మెర పోతనలను విప్లవ కవులుగా అభివర్ణిస్తూ సోదాహరణంగా మాట్లాడారు. కవిసామ్రాట్ విశ్వనాథ, మహాకవి శ్రీశ్రీల మధ్య సాగిన భావ యుద్ధాన్ని సంఘటనతో సహా ప్రస్తావిస్తూ సభలో హాస్యజల్లు కురిపించారు. సాహిత్యమంటే మెటికలు విరిచేవారిలో సైతం ఆసక్తిని రేకెత్తించేలా బ్రహ్మానందం ఉపన్యసించారు. "భలే చెప్పారు బ్రహ్మానందం" అంటూ సభికులంతా హర్షధ్వానాలు ప్రకటించారు. ఈ అరుదైన సందర్భం... సోమవారం మాదాపూర్ దస్‌పల్లా హోటల్‌లోని దివంగత పోలవరపు కోటేశ్వరరావు సాహిత్య సర్వస్వం రెండో సంపుటి ఆవిష్కరణ సభలో చోటుచేసుకుంది. ఈ పుస్తకాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య ఆవిష్కరించారు. తొలిప్రతిని కోటేశ్వరరావు భార్య సుజాతకు అందించారు. అనంతరం వెంకయ్య మాట్లాడారు. చాలారోజుల తర్వాత అద్భుతమైన ప్రసంగం విన్నానంటూ బ్రహ్మానందాన్ని కొనియాడారు. సాహిత్యమే తపస్సుగా ముందుకుసాగిన కోటేశ్వరరావు జీవితం ఈతరానికి ఆదర్శం అంటూ శ్లాఘించారు. ఆయన కథలు పల్లెపరిస్థితులను ప్రతిబింబిస్తాయన్నారు. కోటేశ్వరరావును సాహిత్య తపస్విగా అభివర్ణించారు. కోటేశ్వరరావు శైలి ప్రత్యేకమైనదన్నారు. ఆ రచనలన్నింటినీ రెండు సంపుటాలుగా తీసుకురావడంలో ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ కృషి అభినందనీయమని ప్రశంసించారు. అక్షరం ఆయుధంకన్నా శక్తిమంతమైనదని, దాన్ని మంచికి వాడాలి అని రచయితలకు హితవుపలికారు. కాగా "కోటేశ్వరరావు రచనల్లో దేశభక్తి, హేతుబద్ధమైన ఆలోచనలు కనిపిస్తాయి" అని బ్రహ్మానందం పేర్కొన్నారు. సమాజం సవ్యమైన మార్గం దిశగా ముందుకు సాగడానికి ఉత్తమ రచనలు దోహదపడతాయన్నారు. ఎమెస్కో విజయకుమార్ సభాధ్యక్షత వహించగా కార్యక్రమంలో ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శిశు మరణాలపై సంకల్ప్ అస్త్రం!

పైలెట్ ప్రాజెక్టు చేపట్టిన కేంద్రం.. దేశంలో పది జిల్లాల ఎంపిక

తెలంగాణ నుంచి ఆదిలాబాద్

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో నవజాత శిశు మరణాలను సింగిల్ డిజిట్‌కు తగ్గించేందుకు కేంద్రం కసరత్తు మొదలుపెట్టింది. ఇందుకోసం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), కేంద్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ వైద్య పరిశోధన విభాగం సంయుక్తంగా 'సంకల్ప్ ప్రాజెక్టు' పేరిట ఓ పైలెట్ ప్రాజెక్టును అమలు చేయబోతున్నాయి. దేశవ్యాప్తంగా ఇందుకు పది జిల్లాలను ఎంపిక చేయగా.. తెలుగు రాష్ట్రాల నుంచి ఆదిలాబాద్ జిల్లాకు చోటు దక్కింది. ఇక్కడ ఈ ప్రాజెక్టును లీడ్ చేసేందుకు భువనగిరి ఎయిమ్స్‌కు చెందిన డాక్టర్ ఎస్.తంగియానాథన్‌ను నియమించారు. ఆయన రాష్ట్ర, జిల్లా అధికార యంత్రాంగంతో కలసి పనిచేయనున్నారు. ఆయనకు అవసరమైన సహాయ సహకారాలను, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన గర్భిణుల వివరాలను అందజేయాలని కేంద్రం రాష్ట్రాన్ని కోరింది. అలాగే ఈ అధ్యయనం కోసం ఒక నోడల్ అధికారిని కూడా నియమించాలని సూచించింది. ఈ మేరకు ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ బాహ్లా తెలంగాణ సీఎస్‌కు లేఖ రాశారు. నవజాత శిశువుల మరణాలను తగ్గించేందుకు క్షేత్రస్థాయిలో ఏమేం చర్యలు తీసుకోవాలి.. గర్భిణులు ఎటువంటి ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి.. శిశువు గర్భంలోనే మరణించే సందర్భాలేంటి.. పుట్టిన తర్వాత ఏ కారణంగా చనిపోతున్నారన్న వాటిపై ఈ అధ్యయనం జరగనున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం దేశంలో పుట్టే ప్రతీ వేయి మంది శిశువుల్లో వారంలోనే 15 మంది చనిపోతున్నారు. అదే తెలంగాణలో ప్రతి వేయి మందికి పది మంది మృత్యువాతపడుతున్నారు. దీన్ని వైద్య పరిభాషలో తొలిదశ నవజాత శిశు మరణాల రేటు (ఈఎన్ఎంఆర్)గా వ్యవహరిస్తారు. పుట్టిన నెల రోజుల్లోగా మరణిస్తే నవజాత శిశు మరణాల రేటు (ఎన్ఎంఆర్) గా పిలుస్తారు. దేశంలో ఎన్ఎంఆర్ రేటు 20 ఉండగా, తెలంగాణలో 15గా ఉంది. ఏడాదిలోపు మరణిస్తే శిశు మరణాల రేటు (ఐఎంఆర్) గా వ్యవహరిస్తారు. ప్రస్తుతం ఐఎంఆర్ రేటు దేశంలో 28గా ఉంటే.. తెలంగాణలో 21గా ఉంది. ఇక సంకల్ప్ ప్రాజెక్టు కోసం ఆదిలాబాద్‌తో పాటు ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్, వారాణసీ, ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్, బిహార్‌లోని పూర్ణియా, రాజస్థాన్‌లోని దుంగర్‌పూర్, కర్ణాటకలోని కొప్పాల్, బెంగాల్‌లోని ముర్షిదాబాద్, హరియాణాలోని అంబాల, మధ్యప్రదేశ్‌లోని ఖర్గాన్ జిల్లాను ఎంపిక చేశారు. ఆ జిల్లాల్లో వచ్చే మూడేళ్ల లోపు మూడు దశల్లో ఈ అధ్యయనం నిర్వహించనున్నారు. నవజాత శిశు మరణాలు తగ్గించే దిశగా చర్యలు చేపట్టనున్నారు.

రంజాన్ మాసంలో

స్విగ్గీకి ఆర్డర్ల మోత!

పది లక్షల బిర్యానీలు ఆర్డర్ చేసిన హైదరాబాదీలు
5.3 లక్షల హలీం ప్లేట్‌లూ..
చికెన్ బిర్యానీ, మటన్ హలీం, సమోసాలకే క్రేజ్
బిర్యానీ ఆర్డర్లలో 15 శాతం వృద్ధి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పండుగ ఏదైనా బిర్యానీ ఉండాల్సిందేననే హైదరాబాదీలు పవిత్ర రంజాన్ మాసంలోనూ బిర్యానీల ఆర్డర్ పరంగా తమ ఇష్టాన్ని మరోమారు వెల్లడించారంటోంది ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ. తమ ప్లాట్‌ఫామ్‌పై ఈ రంజాన్ నెలలో దేశవ్యాప్తంగా 60 లక్షల ఆర్డర్లు బిర్యానీకి వస్తే... ఒక్క హైదరాబాద్ నుంచే 10 లక్షలకు పైగా ఆర్డర్లు వచ్చాయంటోంది. సాధారణ నెలలతో పోలిస్తే దాదాపు 15 శాతం వృద్ధి ఈ నెలలో కనిపించిందని తెలిపింది. బిర్యానీలతో పోటీగా హలీంను కూడా నగరవాసులు ఆర్డర్ చేశారని, 5.3 లక్షల హలీం ప్లేట్‌లను లాగించేశారని ఆ సంస్థ వెల్లడించింది. ఇఫ్తార్ సమయాల్లో అధికంగా హలీం, బిర్యానీ, సమోసా ఆర్డర్లు వచ్చాయని, దేశవ్యాప్తంగా చూస్తే సాయంత్రం 5.30 గంటల నుంచి 7 గంటల మధ్య కాలంలో చికెన్ బిర్యానీ, మటన్ హలీం, సమోసా, ఫలుదా, ఖీర్ ఆర్డర్లే ఎక్కువ వచ్చాయని పేర్కొంది. మార్చి 12 నుంచి ఏప్రిల్ 8వ తేదీల మధ్య వచ్చిన ఆర్డర్లను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నామన్న సంస్థ సాధారణ రోజులతో పోలిస్తే ఈ నెలలో హలీం ఆర్డర్ల పరంగా ఏకంగా 1,455 శాతం వృద్ధి కనిపించిందని, తర్వాత ఫిర్నీ, మలుపా, ఫలుదా ఆర్డర్లు ఉన్నాయని తెలిపింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● గురువారం 11 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com

నిట్ కురుక్షేత్రలో ఎంబీఏ



కురుక్షేత్రలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్ కేకేఆర్)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 53 రెగ్యులర్, 4 సూపర్‌న్యూమరరీ, 7 స్పాన్సర్డ్ సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: కనీసం 50 శాతం మార్కులతో ఏదేని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. క్యాట్/సీమ్యాట్/మ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఎంపిక: జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. జీడీ, ఇంటర్వ్యూలలో కనీసం 50 శాతం మార్కులు రావాలి. జాతీయ పరీక్ష స్కోర్‌నకు 70, గ్రూప్ డిస్కషన్స్‌కు 20, పర్సనల్ ఇంటర్వ్యూకి 10 మార్కుల వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్/ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 5
- **గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 8న
- **గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు:** మే 17న
- **ఎంపికైన అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** మే 18న
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** మే 20, 21
- **రెండో మెరిట్ లిస్ట్ విడుదల:** మే 27న
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్:** మే 28న
- **వెబ్‌సైట్:** nitkkr.ac.in

నైసర్‌లో ఎమ్మెస్సీ


భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ మెడికల్ అండ్ రేడియేషన్ ఫిజిక్స్- 'ఎమ్మెస్సీ ప్రోగ్రామ్ ఇన్ మెడికల్ అండ్ రేడియోలాజికల్ ఫిజిక్స్'లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

జామ్ 2024/జెస్ట్ 2024 ర్యాంక్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ఇంటర్వ్యూకి హాజరయ్యే అభ్యర్థులకు సింగిల్ సెకండ్ స్లీపర్ క్లాస్ రైల్వే లేదా బస్ ఫెయిర్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులోనే ఏడాది వ్యవధిగల కంపల్సరీ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. మొత్తం 10 సీట్లు ఉన్నాయి. ఫెలోషిప్ సౌకర్యం ఉంది. ప్రోగ్రామ్ పూర్తి చేసినవారికి ముంబైలోని హోమీ బాబా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

ప్రోగ్రామ్ వివరాలు

మొదటి రెండేళ్లు నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఒక్కో సెమిస్టర్‌లో నాలుగు కోర్ కోర్సులు, ఒక ల్యాబొరేటరీ కోర్సు పూర్తిచేయాల్సి ఉంటుంది. కోర్ కోర్సుకు ఎనిమిది క్రెడిట్‌లు, ల్యాబొరేటరీ కోర్సుకు ఆరు క్రెడిట్‌లు నిర్దేశించారు. హోమీ బాబా నేషనల్ ఇన్‌స్టిట్యూట్(హెచ్‌బీఎన్ఐ) సూచనల మేరకు ప్రోగ్రామ్ సిలబస్‌ను రూపొందించారు.

కోర్ కోర్సులు: క్లాసికల్ మెకానిక్స్, స్టాటిస్టికల్ మెకానిక్స్ అండ్ థర్మోడైనమిక్స్, మేథమెటికల్ ఫిజిక్స్, ఎలక్ట్రోడైనమిక్స్, క్వాంటం మెకానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, సాలిడ్ స్టేట్ ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్, రేడియేషన్ ఫిజిక్స్- రేడియేషన్ జనరేటర్స్, రేడియోలాజికల్ మేథమెటిక్స్, రేడియేషన్ డిటెక్టర్స్-ఇన్‌స్ట్రుమెంటేషన్, రేడియేషన్ స్టాండర్డయిజేషన్, క్లినికల్ అండ్ రేడియేషన్ బయాలజీ, మెడికల్ ఇమేజింగ్, రేడియేషన్ థెరపీ, రేడియేషన్ సేఫ్టీ.



ల్యాబొరేటరీ కోర్సులు: మోడరన్ ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్, సాలిడ్ స్టేట్ ఫిజిక్స్, న్యూక్లియర్ రేడియేషన్, సాలిడ్ స్టేట్ ఫిజిక్స్, రేడియేషన్ థెరపీ, సేఫ్టీ-ఇన్‌స్ట్రుమెంటేషన్ అంశాలకు సంబంధించి సెమిస్టర్‌కు 10 నుంచి 15 ప్రయోగాలు చేయాల్సి ఉంటుంది.

అర్హత

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్ట్‌గా ప్రథమ శ్రేణి మార్కులతో బీఎస్సీ డిగ్రీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు ఇంటర్వ్యూ నాటికి మార్కుల పత్రాలు, డిగ్రీ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. జామ్ 2024/జెస్ట్ 2024 అర్హత తప్పనిసరి.

ఫెలోషిప్

ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందిన అభ్యర్థులకు నెలకు రూ.16,000లతోపాటు హెచ్ఆర్ఏ, డీఏఈ నిబంధనల ప్రకారం మెంటార్‌షిప్ గ్రాంట్/కంటింజెన్సీ గ్రాంట్ ఇస్తారు.

ఇంటర్న్‌షిప్ సెంటర్లు

- ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, భువనేశ్వర్
- ఆచార్య హరిహర పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్, కటక్
- టాటా మెమోరియల్ సెంటర్, ముంబై

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
- **అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** మే 31
- **ఇంటర్వ్యూలు:** జూలై 1 నుంచి 4 వరకు
- **ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 5న
- **వెబ్‌సైట్:** www.niser.ac.in

'షుగర్' టెక్నాలజీలో పీజీ డిప్లొమాలు

కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్(ఎన్ఎస్ఐ), కాన్పూర్- పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు సహా ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లకు ఇంటర్వ్యూ, మిగిలిన ప్రోగ్రామ్‌లకు అడ్మిషన్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **పీజీ డిప్లొమా కోర్స్ ఆఫ్ అసోసియేట్‌షిప్ ఆఫ్ నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ షుగర్ టెక్నాలజీ**

ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో 66 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ(ఎంపీసీ)/డిగ్రీ(కెమికల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ)/బీఎస్సీ(షుగర్ సైన్స్ అండ్ టెక్నాలజీ) ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు.

- **పీజీ డిప్లొమా కోర్స్ ఆఫ్ అసోసియేట్‌షిప్ ఆఫ్ నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ షుగర్ ఇంజనీరింగ్**

కోర్సు వ్యవధి ఏడాదిన్నర. ఇందులో 40 సీట్లు ఉన్నాయి. మెకానికల్/ ప్రొడక్షన్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో బీఈ/బీటెక్/ఏఎంఐఈ ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **పీజీ డిప్లొమా కోర్స్ ఇన్ ఇండస్ట్రియల్ ఫర్మంటేషన్ అండ్ ఆల్కహాల్ టెక్నాలజీ**

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాదిన్నర. ఇందులో 50 సీట్లు ఉన్నాయి. కెమిస్ట్రీ/అప్లయిడ్ కెమిస్ట్రీ/ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ/బయో కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్ట్‌గా బీఎస్సీ ఉత్తీర్ణులు, బీటెక్(బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్/బయో కెమికల్ ఇంజనీరింగ్) పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

- **పీజీ డిప్లొమా ఇన్ షుగర్‌కేన్ ప్రొడక్టివిటీ అండ్ మెచ్యూరిటీ మేనేజ్‌మెంట్**

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో 20 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ/బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తిచేసినవారు అర్హులు.

- **పీజీ డిప్లొమా కోర్స్ ఇన్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ ప్రాసెస్ కంట్రోల్**

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో 17 సీట్లు ఉన్నాయి. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ విభాగాల్లో బీఈ/ బీటెక్/ ఏఎంఐఈ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ ఉత్తీర్ణతతోపాటు ఏడాది అనుభవం ఉన్నవారు, ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్ పూర్తిచేసినవారు కూడా అర్హులే.

- **పీజీ డిప్లొమా కోర్స్ ఇన్ క్వాలిటీ కంట్రోల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్**

కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో 22 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ(ఎంపీసీ/బైపీసీ)/బీఎస్సీ(ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/బయోటెక్నాలజీ)/బీటెక్(బయోటెక్నాలజీ) పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

- **షుగర్ బాయిలింగ్ సర్టిఫికెట్ కోర్సు**

దీని వ్యవధి ఏడాది. ఇందులో 63 సీట్లు ఉన్నాయి. మెట్రిక్యులేషన్ లేదా సైన్స్/అగ్రికల్చర్ సబ్జెక్టులతో హైస్కూల్ చదువు పూర్తిచేసి ఉండాలి. వాక్యూమ్ పాన్ షుగర్ ఫ్యాక్టరీలో పాన్ ఆపరేషన్‌కు సంబంధించి మూడు నెలల అనుభవం ఉండాలి.

- **షుగర్ ఇంజనీరింగ్ సర్టిఫికెట్ కోర్సు**

దీని వ్యవధి ఏడాదిన్నర. ఇందులో 17 సీట్లు ఉన్నాయి. మెకానికల్/ప్రొడక్షన్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో



డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులు.

- **సర్టిఫికెట్ కోర్స్ ఇన్ క్వాలిటీ కంట్రోల్**

ప్రోగ్రామ్ వ్యవధి నాలుగు నెలలు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి. ఇంటర్(ఎంపీసీ) అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఫెలోషిప్ ఆఫ్ ఎన్ఎస్ఐ ఇన్ షుగర్ టెక్నాలజీ/షుగర్ కెమిస్ట్రీ**

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. షుగర్ టెక్నాలజీ విభాగంలో ఏఎన్ఎస్ఐ/ఏవీఎస్ఐ పూర్తిచేసినవారు అర్హులు

- **ఫెలోషిప్ ఆఫ్ ఎన్ఎస్ఐ ఇన్ షుగర్ ఇంజనీరింగ్**

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. షుగర్ ఇంజనీరింగ్ విభాగంలో ఏఎన్ఎస్ఐ/ ఏవీఎస్ఐ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఫెలోషిప్ ఆఫ్ ఎన్ఎస్ఐ ఇన్ ఫర్మంటేషన్ టెక్నాలజీ**

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. డీఐఎఫ్ఏటీ/ఐఎఫ్ఏటీ అభ్యర్థులు అర్హులు.

ముఖ్య సమాచారం

- **వయసు:** 2024 జూలై 1 నాటికి ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లకు 50 ఏళ్లు; మిగిలిన ప్రోగ్రామ్‌లకు 35 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 24
- **హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** మే 31
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూన్ 16 నుంచి
- **అడ్మిషన్ టెస్ట్ తేదీ:** జూన్ 23
- **చిరునామా:** డైరెక్టర్, నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్, కల్యాణ్‌పూర్, కాన్పూర్-208017
- **వెబ్‌సైట్:** http://nsi.gov.in

సీఎఫ్‌టీఆర్ఐలో ఎమ్మెస్సీ ఫుడ్ టెక్నాలజీ



సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎస్ఐఆర్-సీఎఫ్‌టీఆర్ఐ, మైసూరు)-'ఎమ్మెస్సీ(ఫుడ్ టెక్నాలజీ)' కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది రెండేళ్ల వ్యవధిగల ఇంటర్ డిసిప్లినరీ ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 34 సీట్లు ఉన్నాయి. వీటిలో రెండు సీట్లను డిఫెన్స్ అభ్యర్థులకు, మరో రెండు సీట్లను ఇండస్ట్రీ స్పాన్సర్డ్ అభ్యర్థులకు ప్రత్యేకించారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ(సైన్స్/అగ్రికల్చర్/ఇంజనీరింగ్/టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసిన/రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 జూలై 25 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. స్పాన్సర్డ్ అభ్యర్థులకు సంబంధిత విభాగాల్లో కనీసం రెండేళ్ల అనుభవం తప్పనిసరి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్

దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే అడుగుతారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, బోటనీ, జువాలజీ, మైక్రోబయాలజీ, ఫుడ్ బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, న్యూట్రిషన్, అగ్రికల్చర్, డెయిరీ టెక్నాలజీ, ఫుడ్ ఇంజనీరింగ్, మెంటల్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్ సబ్జెక్టుల నుంచి డిగ్రీ స్థాయిలో ప్రశ్నలు ఇస్తారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ప్రశ్నకు కేటాయించిన మార్కుల్లో నాలుగోవంతు కోత విధిస్తారు. స్పాన్సర్డ్ కేటగిరీలో ఎక్కువ దరఖాస్తులు వచ్చిన పక్షంలో పర్సనల్ ఇంటర్వ్యూలు కూడా నిర్వహిస్తారు.

- **కోర్సు ఫీజు:** సెమిస్టర్‌కు రూ.30,000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, డిఫెన్స్, ఇండస్ట్రీ స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 5
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూన్ 26 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, బెంగళూరు, పుణె, మైసూరు, కోల్‌కతా, తిరువనంతపురం, ఘజియాబాద్, గువహటి, జమ్ము
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్:** జూలై 7న
- **అడ్మిషన్స్:** ఆగస్టు 9 నుంచి
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **వెబ్‌సైట్:** cftri.res.in

జాబ్ కార్నర్

ఐసీఎస్ఐలో సీఆర్‌సీ ఎగ్జిక్యూటివ్‌లు

ఖాళీలు 30

న్యూఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: సీఆర్‌సీ ఎగ్జిక్యూటివ్

అర్హత: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్‌లో మెంబర్ అయి ఉండాలి.

వేతనం: నెలకు రూ.40,000 - రూ.60,000

జాబ్ లొకేషన్: సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్, కార్పొరేషన్ భవన్, ఐఐసీఏ, మనేసర్, గుర్‌గావ్(హరియాణా)

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 15

వెబ్‌సైట్: https://www.icsi.edu/careers/

అలిమ్‌కోలో మేనేజర్లు

ఖాళీలు 142

కాన్పూర్‌లోని ఆర్టిఫీషియల్ లింబ్స్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా...కాంట్రాక్ట్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా అలిమ్‌కో కేంద్రాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. సీనియర్ కన్సల్టెంట్: 1 పోస్టు
2. మేనేజర్: 1 పోస్టు
3. డిప్యూటీ మేనేజర్: 1 పోస్టు
4. అసిస్టెంట్ మేనేజర్: 4 పోస్టులు
5. జూనియర్ మేనేజర్: 17 పోస్టులు
6. ఆడియాలజిస్ట్: 50
7. ప్రొస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్: 47 పోస్టులు
8. స్పెషల్ ఎడ్యుకేటర్: 5 పోస్టులు
9. క్లినికల్ సైకాలజిస్ట్: 5 పోస్టులు
10. ఆప్టోమెట్రిస్ట్: 5 పోస్టులు
11. సీఎస్ఆర్ కన్సల్టెంట్: 1 పోస్టు
12. క్యాసీ అసిస్టెంట్: 4 పోస్టులు
13. ఫైనాన్స్ అసిస్టెంట్: 1 పోస్టు

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీ, బీఈడీ/ఎంఈడీ, ఎంఫిల్, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సు, సీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ఆడియాలజిస్ట్, ప్రొస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్, స్పెషల్ ఎడ్యుకేటర్, క్లినికల్ సైకాలజిస్ట్, ఆప్టోమెట్రిస్ట్, సీఎస్ఆర్ కన్సల్టెంట్ పోస్టులకు 40 ఏళ్లు; క్యాసీ అసిస్టెంట్, ఫైనాన్స్ అసిస్టెంట్, జూనియర్ మేనేజర్ పోస్టులకు 45 ఏళ్లు; మేనేజర్, డిప్యూటీ మేనేజర్ పోస్టులకు 50 ఏళ్లు; సీనియర్ కన్సల్టెంట్‌కు 62 ఏళ్లు మించకూడదు.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 16

వెబ్‌సైట్: https://alimco.in/content/7_1_Careers

ఐఐటీ హైదరాబాద్‌లోని సీహెచ్ఈకి ఎస్కేన్ వెంచర్స్ సపోర్ట్

హైదరాబాద్ ఐఐటీలోని సెంటర్ ఫర్ హెల్త్‌కేర్ ఆంత్రప్రెన్యూర్‌షిప్(సీహెచ్ఈ)కి 9.6 మిలియన్లు అంటే సుమారు రూ.80 కోట్లు సమకూరుస్తామని తనూశ్రీ అలాగే ఎస్కేన్ వెంచర్స్ ఫౌండర్ సుశాంత్ కుమార్ ప్రకటించారు. హెల్త్‌కేర్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్‌గా సీహెచ్ఈకి జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. ఆంత్రప్రెన్యూర్లకు సహకరించడం ద్వారా ప్రభావపూరిత పరిష్కారాలను కనుగొనేందుకు ఈ నిధులను వినియోగిస్తారని సుశాంత్ కుమార్ ఈ సందర్భంలో చెప్పారు. హెల్త్ కేర్‌లో డివైజ్‌లు, డయాగ్నసిస్‌లో ప్రస్తుతం ఉన్న గ్యాప్‌ను పూరించేందుకు ఈ సెంటర్ ద్వారా కృషి చేస్తున్నట్టు ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి తెలిపారు.



లిటిల్స్



గొప్ప పేదవాడు

తన రాజ్యంలో అందరూ సుభిక్షంగా ఉన్నారని అక్బర్ అనుకున్నారు. తనకు తానెంతో గర్వపడ్డారు. ఒక రోజు సభ ప్రారంభమైంది. సంతోషంతో ఇలా అన్నాడు. 'ఒక పేదవాడు ధనవంతుడు కావొచ్చునేమో కానీ గొప్పవాడు కాలేడు కదా?' అన్నాడు. అదేమీ లేదు మహాప్రభో.. ఇది అపద్ధం.. మీ భ్రమ అన్నాడు బీర్బల్. అక్బర్‌కు కోపం వచ్చింది. ఏదీ అలాంటి వాడు ఉంటే తీసుకొని వచ్చి.. నాకు చూపించు అన్నాడు.

బీర్బల్ బయటకు వెళ్లిపోయాడు. ఒక బిచ్చగాడిని తీసుకొచ్చాడు. ఇతను గొప్పవాడే అన్నాడు. అక్బర్‌కు కోపం వచ్చింది. 'దారినపోయే దానయ్యను గొప్పవాడంటే ఎలా నమ్మాలి? అర్థతలేంటీ?' అని అడిగాడు అక్బర్. 'అయ్యా.. మీకో విషయం చెప్పాలి. ఇతడు నిజంగానే పేదవాడు. అంతకంటే ముందు బిచ్చగాడు. మీ లాంటి వారు పరిపాలిస్తున్న రాజ్యంలో ఇతను ఉన్నాడంటే అవమానమూ... బాధాకరమే కదా అన్నాడు బీర్బల్. 'ఇతనికి వరహాలతో పాటు ఇల్లు కూడా ఇప్పించండి' అంటూ అధికారులకు ఆదేశాలిచ్చాడు. అన్నట్లే అధికారులు అతనికి సాయం చేశారు. 'మా రాజ్యంలో పేదవాడు ఉండకూడదు' అన్నాడు గర్వంగా అక్బర్.

ఇంతలో పేదవాడు కలగజేసుకున్నాడు. 'బాద్‌షా.. మీలాంటి వారు ఏలుతున్న ఈ రాజ్యంలో నాకంటే ఘోరమైన పేదలు ఉన్నారు. వారంతా భిక్షాటనమే. వారికి ఏమైనా సాయం చేయండి' అని చెప్పారు. దీంతో అక్బర్‌కు కోపం వచ్చింది. 'నా రాజ్యంలో ఇంతటి పేదవాళ్లు ఉన్నారా? వారందరికీ ప్రభుత్వం తరఫున సాయం చెయ్యండి అని ఆజ్ఞాపించాడు అక్బర్. వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. రాజ్యంలోని వారినంతతా ధనికులుగా ఉండాలి అన్నాడు అక్బర్.

ఇపుడు చెప్పు బీర్బల్ 'ఈ పేదవాడు ఎలా గొప్పవాడు అవుతాడు? నీ మాటలకు నమ్మాలా?' అని అడిగాడు అక్బర్. 'అయ్యా.. నిస్సందేహంగా ఈ పేదవాడు గొప్పవాడే' అన్నాడు. 'నేనే కదా ఇతన్ని ధనవంతున్ని చేసింది' అన్నాడు అక్బర్. 'అయితే కావొచ్చు.. బాద్‌షా. ఇతను తన చుట్టూ ఉండే పేదవాళ్లను, బిక్షగాళ్లను మీ ద్వారా వారికి ధనాన్ని, జీవితాన్ని ప్రసాదించాడు. అందువల్ల ఇతను గొప్పవాడే' అన్నాడు. అక్బర్‌తో పాటు సభికులంతా చప్పట్లు కొట్టారు. బీర్బల్ మేధస్సుకు అక్బర్ ఎంతో ఆనందపడ్డారు.



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి





డైలీ సుడోకు - 278

		9						2
6		1		7	3			
			8				6	7
				8	7		4	
		2				8		
	7		1	6				
5	9				1			
			6	3		7		5
4						6		

సుడోకు - 277 సమాధానం

6	7	2	3	9	5	1	8	4
4	5	9	1	6	8	3	2	7
3	1	8	2	7	4	9	6	5
8	9	4	5	3	6	7	1	2
2	6	1	7	8	9	4	5	3
5	3	7	4	2	1	6	9	8
9	4	6	8	5	7	2	3	1
7	2	5	9	1	3	8	4	6
1	8	3	6	4	2	5	7	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.